


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యువత పఠనాసక్తిని పెంపొందించుకోవాలి: గవర్నర్

బేగంబజార్, న్యూస్‌టుడే: పుస్తకానికి పాఠకుడికి మధ్య యంత్రం ఉండవద్దని, యువత పఠనాసక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 133 ఏళ్ల చరిత్ర కలిగిన అఫ్జల్‌గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో జాతీయ సామాజిక సంఘం(ఎన్ఎస్ఎస్) 55వ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి నర్సింహారెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులతో కలిసి జ్యోతిని వెలిగించారు. 'గ్రంథాలయ దీప్తి' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం గవర్నర్ మాట్లాడారు. యువత, విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని, గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదువుతూ ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. బుక్ డాక్టర్ పేరిట ప్రత్యేక కార్నర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని వాటిని పరిరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని బుర్ర వెంకటేశం చెప్పారు. సాలార్‌జంగ్ మ్యూజియాన్ని రోజూ 20వేల మంది సందర్శిస్తుంటే ఈ గ్రంథాలయానికి కేవలం 500మంది రావడం అసంతృప్తిగా ఉందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర గవర్నర్ ఈ గ్రంథాలయాన్ని సందర్శించడం విశేషమన్నారు. పౌర గ్రంథాలయ శాఖ ఉప సంచాలకులు శ్రీహరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ కష్టాలివే


"జాతీయ రహదారుల సంస్థ ఎన్‌హెచ్-65పై చేపట్టిన ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం స్థానికులకు శాపంగా మారింది. కోటి జనాభా ఉన్న నగరంలో 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తుండటంతో.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల మధ్య గోడ కట్టినట్లయింది. ఉద్యోగులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సిటీ బస్సు ఎక్కాలన్నా, దిగాక కాలనీ రోడ్డుకు చేరుకోవాలన్నా సగటున 6 కి.మీ. నడవాల్సి వస్తోంది. ఇల్లు ఓ వైపు, పాఠశాల మరో వైపుంటే.. పిల్లలను తీసుకెళ్లడం తల్లిదండ్రులకు కత్తిమీద సాములా మారింది. పాత కల్వర్టులు విస్తరించకపోవడం, కాలనీ రోడ్లకు పదడుగుల ఎత్తున ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, కనుచూపు మేరలో యూటర్న్‌లు లేకపోవడం వంటి సమస్యలతో ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు."

ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు హద్దు గోడైన రోడ్డు

● బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా 6 కి.మీ. నడవాల్సిందే



భాగ్యలత నుంచి ఎల్బీనగర్ మార్గంలో సర్వీసు రోడ్డుకు ఏర్పాటుచేసిన గ్రిల్స్



ప్రధాన నగరంలో ఎక్స్‌ప్రెస్ వేనా..

ఎల్బీనగర్ చింతలకుంట చెక్‌పోస్టు నుంచి విజయవాడ వెళ్లే ఎన్‌హెచ్-65ను 'ఎక్స్‌ప్రెస్ వే'గా అభివృద్ధి చేసే పనులు 2021లో ఆమోదం పొందాయి. రెండేళ్లలో పనులు పూర్తవ్వాలన్నది ఒప్పందం. వేర్వేరు కారణాలతో ఇంకా కొనసాగుతున్నాయి.

● ఎల్బీనగర్ నుంచి భాగ్యలత, శారదనగర్, బీడీఎల్, హైకోర్టుకాలనీ, శాంతినగర్, సామానగర్, నర్సింహారావునగర్, ఇతర చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేవారు ఇటీవలి వరకు భాగ్యలత రోడ్డు వద్ద సిటీ బస్సు దిగేవారు. ఇప్పుడు 2 కి.మీ. అవతల ఉన్న హయత్‌నగర్‌లో దిగి, మరో 2.కి.మీ వెనక్కి వస్తున్నారు. రోడ్డు పొడవునా గ్రిల్స్ ఏర్పాటుతో ఈ సమస్య తలెత్తింది.

స్థానికంగా అనేక సమస్యలు

ఈనాడు, హైదరాబాద్, వనస్థలిపురం, హయత్‌నగర్-న్యూస్‌టుడే

● ఎల్బీనగర్ చింతలకుంట చెక్‌పోస్టు సమీపంలోని ఆగమయ్యనగర్, హకీమాబాద్ కాలనీ రోడ్లకు 8 అడుగుల ఎత్తున ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణమవుతోంది. సుష్మా, హైకోర్టుకాలనీ, వర్ద్ అండ్ డీడీ కాలేజీ ఎదురుగా ఉన్న ప్రాంతాలకు, పెద్దఅంబర్‌పేట శివారులోనూ సమస్య తీవ్రంగా ఉంది. హైవే నుంచి కాలనీల్లోకి వెళ్లే దారి లేక జనం నానా అవస్థలు పడుతున్నారు.

● పనామా తర్వాత డీమార్ట్ వద్ద కల్వర్టు మరమ్మతుల్లో జాప్యంతో రోడ్డు ముంపునకు గురవుతోంది. ● ఎల్బీనగర్ నుంచి సుష్మా, హిల్‌కాలనీ, హుడా సాయినగర్, వనస్థలిపురం-4, కమలానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే గతంలో సుష్మావద్ద దిగేవారు. ఇప్పుడు ఆటోనగర్‌లో దిగి 2 కి.మీ. వెనక్కి నడవాల్సి వస్తోంది.

● ప్యారడైజ్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద బాక్స్ డ్రెయిన్ పనులు ఏడాదిగా పూర్తవక పోవడంతో అక్కడున్న హోటల్, ఆస్పత్రి, ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే జనం నిత్యం అవస్థలు పడుతున్నారు.

● ఆటోనగర్ కూడలి, రాజధాని హోటల్, రాయల్ ఓక్ షోరూం ప్రాంతాల్లో సర్వీసు రోడ్డు పనులు మూడేళ్లవుతున్నా మొదలుకాలేదు.

● వనస్థలి పార్కు, పుల్లారెడ్డి మిఠాయి దుకాణం వద్ద కల్వర్టులు విస్తరణకు నోచుకోక ఆ ప్రాంతాలు చిన్న వానకే చెరువులా మారుతున్నాయి.



సర్వీసురోడ్డు లేని ప్రాంతాల్లో ప్రయాణికుల అగచాట్లు

● హయత్‌నగర్ బస్ డిపో, కృష్ణవేణి ఆస్పత్రి రోడ్లకు 8 అడుగుల ఎత్తున హైవే నిర్మాణంతో డిపోకెళ్లే బస్సులు అవస్థలు పడుతున్నాయి. ఇక్కడ గ్రిల్స్‌తో డిపో చుట్టుపక్కల ప్రాంతాలకు 4 కి.మీ. అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

● తొర్రూరు - హయత్‌నగర్ హైవేకు రాకపోకలు సాగించే వాహనాలతో కూడలిలో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కూడలివద్ద బస్టాపుతో సర్వీసు రోడ్డు అనాథగా మారింది. ● ఆర్టీసీకాలనీ, హయత్‌నగర్ బస్టాండు పరిసరాల్లో భూసేకరణ జరగక సర్వీసురోడ్డు అతుకుల బొంతలా మారింది.

● పెద్దఅంబర్‌పేట జేసీబీ కూడలి ఆర్‌వోబీవద్ద రోడ్డు విస్తరణ జరగకపోవడం, పనుల నత్తనడకతో వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు.

● లక్ష్మారెడ్డిపాలెం పిల్లలు హైవే అవతలున్న కాండర్ ప్రైన్ స్కూల్‌కు వెళ్లాలంటే హయత్‌నగర్ బస్టాండు, ఇంటికెళ్లేందుకు పెద్దఅంబర్‌పేటకు వెళ్లి యూటర్న్ తీసుకుంటున్నారు. 100మీటర్ల దూరంలో ఉన్న బడి కోసం రోజూ 6 కి.మీ. అదనంగా ప్రయాణిస్తున్నారు.



జింకలపార్కు చెంత అసంపూర్తిగా కాలువ పనులు

● పెద్దఅంబర్‌పేట ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూం ఎదురుగా హైవేపై కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో వరద సర్వీసురోడ్డును ధ్వంసం చేస్తోంది.

పైవంతెనపై స్పష్టత రావాలి

ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ ప్రతిపాదన 2021 నాటిది. కొంతకాలంగా పనామా నుంచి హయత్‌నగర్ వరకు పైవంతెన నిర్మించాలని ప్రజలతో పాటు కార్పొరేటర్లు, ఎమ్మెల్యే అడుగుతున్నారు. రూ.340కోట్లతో అంచనాలను కేంద్ర సర్కారుకు పంపాం. ఆమోదం లభిస్తే పైవంతెన నిర్మిస్తాం. లేదంటే.. ప్రస్తుత పనులే కొనసాగుతాయి. పలు చోట్ల పాదచారుల వంతెనలు నిర్మిస్తాం. **- ధర్మారెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ**



నాగోల్ నుంచి ఉప్పల్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు, ఇబ్బందులు పడుతున్న పాదచారులు

వరుణ ప్రతాపం

ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో మంగళవారం రాత్రి వరుణుడు బీభత్సం సృష్టించాడు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు వేర్వేరు ప్రాంతాల్లో కుండపోత కురిసింది. అత్యధికంగా నాగోల్‌లో 8.9సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్ నుంచి నాగోల్ వరకు ప్రధాన రహదారిపై పలుచోట్ల మోకాల్లోతు నీరు నిలిచింది. న్యూ నాగోల్ రోడ్డు10లో ఇళ్లలోకి నీరు చేరింది. కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధానిపై నడుముల్లోతు వరద ప్రవహించింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్ నుంచి రామంతాపూర్ వైపు భారీఎత్తున ట్రాఫిక్ సమస్య తలెత్తింది. బండ్లగూడ, హబ్సిగూడలో 7, రామంతాపూర్ 5.2, హయత్‌నగర్‌లో 5, ఓయూలో 4.6, వనస్థలిపురం 4.3, సరూర్‌నగర్ 4.2, ఎల్బీనగర్‌లో 3.5 సె.మీ. వర్షం కురిసింది.



ఉప్పల్‌లో భారీ వర్షం..

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

ఈనాడు, హైదరాబాద్: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. వైద్యులు, సహాయ సిబ్బంది సెలవు తీసుకోకుండా పనిచేయాలని, రోజంతా వైద్యులు అందుబాటులో ఉండేట్లు దవాఖానాలకు ఆదేశాలివ్వాలని ఆయన యంత్రాంగానికి సూచించారు. కలెక్టర్ శశాంక్, ఇతర ఉన్నతాధికారులతో మంగళవారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, ఇతర ఉప కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. పసి పిల్లలు, గర్భిణులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలన్నారు.



అధికారులతో సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు

ఇద్దరి ప్రాణాలను బలిగొన్న అతివేగం

ఘట్‌కేసర్ వద్ద ఔటర్‌పై కారు బోల్తా



ప్రమాదానికి గురైన కారు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సీఐ సైదులు కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన ఇడుపులపాటి సాంబయ్య నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సైదిపల్‌లో 40ఏళ్లక్రితం వ్యవసాయ భూమి కొన్నాడు. దానికి సంబంధించి ఆన్‌లైన్ పని నిమిత్తం సాంబయ్య కొడుకు సురేష్ అదే గ్రామానికి చెందిన సామినేని రాఘవరావు, కాకుమాను అమ్మయ్య, ముక్త రమేష్‌లు ఈనెల 22న కారులో వర్నికి వచ్చారు. పని పూర్తయ్యాక సోమవారం రాత్రి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం తెల్లవారుజామున ఘట్‌కేసర్ వద్ద ఔటర్ మీదుగా వస్తుండగా కారునడుపుతున్న సురేష్ ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో కారు బోల్తాపడింది. సురేష్(35) తోపాటు పక్కన కూర్చున్న రాఘవరావు(45) అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన అమ్మయ్య, రమేష్‌లను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతివేగంతోపాటు నిద్ర మత్తు కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని సీఐ చెప్పారు.

రికార్డుల్లో నిషేధిత భూములు..

ధరణిలో ప్రైవేటు పట్టాలు

● వట్టినాగులపల్లిలో 80 ఎకరాల ఆక్రమణకు స్కెచ్

● పాతికేళ్ల కిందట ప్రణాళిక.. తాజా సర్వేతో వెలుగులోకి

ధరణి

ఈనాడు, హైదరాబాద్: రాజధాని నగరం శివారు ప్రాంతాల భవిష్యత్తును ఊహించిన కొందరు వ్యక్తులు గండిపేట చెరువు సమీపంలో ప్రభుత్వ భూములను ఒక పథకం ప్రకారం ఆక్రమించేందుకు పాతికేళ్ల కిందటే ప్రణాళిక రచించారు. వట్టినాగులపల్లిలో సర్వే నం. 110 నుంచి 150 మధ్య వందల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు ఇచ్చినట్టు తెలుసుకున్నారు. అసైనీలకు ఇచ్చిన ప్రైవేటు పట్టాలు.. ఖాళీ ప్రభుత్వ భూముల పక్కనున్న 80 ఎకరాలను ఆక్రమించేందుకు కార్యాచరణ రూపొందించారు. కొందరు అసైనీల నుంచి, ప్రైవేటు పట్టాదారుల నుంచి భూములు కొని పక్కన ప్రభుత్వ స్థలాలకు మార్కింగ్ వేసుకున్నారు. వట్టినాగులపల్లి, గోపన్‌పల్లి, ఆర్థిక జిల్లాల పరిసర ప్రాంతాల్లో బహుళజాతి ఐటీ సంస్థలు వచ్చినా.. అనూహ్యంగా అభివృద్ధి చెందినా తొందరపడలేదు. ఐదేళ్ల కిందట ధరణి పోర్టల్ అందుబాటులోకి రాగానే.. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు, వారి కుటుంబ సభ్యుల పేర్లను రికార్డుల్లోకి ఎక్కించి ప్రైవేటు పట్టాలుగా మార్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెలుగులోకి రాగా, రికార్డుల మార్పిడిపై అంతర్గతంగా విచారణ చేస్తున్నారు. ఈ భూముల విలువ రూ.2500 కోట్లుంటుందని అంచనావేస్తున్నారు.



అమ్మోరి పండగొస్తోంది!

తెలంగాణలో వైభవంగా నిర్వహించే దసరా పండుగకు నగరంలోని ధూల్‌పేటలో అమ్మవారి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కార్మికులు రంగులద్దుతూ, తుది మెరుగులు దిద్దుతూ ప్రతిమలను ముస్తాబుచేస్తున్నారు. దూరప్రాంతాల వారు ఇప్పటికే కొనుగోళ్లు పూర్తి చేసి తరలిస్తున్నారు.

వేగం పెరిగితేనే రిమోట్ సెన్సింగ్‌కు భవిష్యత్తు



వేడుకలను ప్రారంభిస్తున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్, మాజీ ఛైర్మన్లు రాధాకృష్ణన్, కిరణ్‌కుమార్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ఉపగ్రహాల నుంచి అవసరమైన చిత్రాలు, డేటాను మాత్రమే సేకరించేలా భవిష్యత్తు రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలపై పనిచేయాల్సి ఉందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం బాలానగర్‌లోని సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రిమోట్ సెన్సింగ్ పరంగా గడిచిన 50 ఏళ్లలో ఎన్ఆర్ఎస్‌సీ దేశానికి ఎంతో సేవ చేసినా, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకనుగుణంగా మారకపోతే మనుగడ కష్టమన్నారు. సాంకేతికతలో వేగంగా మార్పులు వస్తున్నాయని.. సమాచారం అత్యంత వేగంగా కావాలని ప్రజలు, వ్యవస్థలు, విధానకర్తలు, సంస్థలు కోరుకుంటున్నాయని చెప్పారు. కమిటీలుగా ఏర్పడి 5, 10, 25 ఏళ్లకు ప్రపంచంలో రానున్న మార్పులు, అందుకు మనం ఏం చేయాలనేది నివేదికలు రూపొందించాలని సూచించారు. ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు, సీడ్ ఫండింగ్‌తో పరిశోధనలను వేగవంతం చేయవచ్చన్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు కె.రాధాకృష్ణన్, ఏ.ఎస్.కిరణ్‌కుమార్, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్, మాజీ డైరెక్టర్లు బి.ఎన్.దీక్షితులు, వి.జయరామన్, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ రహితంగా సికింద్రాబాద్ స్టేషన్

ఈనాడు, హైదరాబాద్

పారిశుద్ధ్యానికి రూ.10 కోట్ల వ్యయం



ప్లాట్‌ఫామ్‌లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పారిశుద్ధ్యం, స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దీనికోసం రూ.10కోట్లు ఖర్చు చేస్తోంది. ఐజీబీసీ-సీఐఐ గ్రీన్ రేటింగ్‌లో 'ప్లాటినం' గ్రేడ్ దక్కించుకోగా పారిశుద్ధ్యం, పర్యావరణహిత ఆవిష్కరణలను అందిపుచ్చుకుంది. మూడేళ్ల పాటు స్వచ్ఛత పనులు చేపట్టేలా వేర్వేరు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. 197 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు, 2లక్షల మంది నిత్యం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ప్రమాణాలు పాటిస్తోంది. స్టేషన్ ఆవరణలో చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు.

పురోగతిలో జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్: రోజూ 4 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ కోసం స్టేషన్‌లో 10 ప్లాస్టిక్ బాటిల్ ష్రెడ్డింగ్‌యంత్రాలు, 26 చ.మీ.విస్తీర్ణంలో వేస్ట్ సెగ్రిగేషన్ షెడ్ ఏర్పాటు చేశారు. ఆకుపచ్చ డబ్బాలో బయోడీగ్రేడబుల్ వ్యర్థాలు, నీలిరంగు డబ్బాలో నాన్ బయోడీగ్రేడబుల్ వ్యర్థాలు వేసేందుకు డబుల్ డస్ట్‌బిన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

● స్టేషన్‌లో 2400 కిలోలీటర్ల నీటి వినియోగం ఉండగా.. సున్నా నీటి వృథా కోసం 500 కేఎల్‌డీ సామర్థ్యంతో రీసైక్లింగ్ ప్లాంటు ఏర్పాటు చేశారు. రీసైకిల్ నీటిని పారిశుద్ధ్యం, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ● 100 శాతం ఎల్ఈడీ విద్యుద్దీపాలు, విద్యుత్తు ఆదాకు బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఇన్వర్టెడ్ ఎయిర్ కండిషనింగ్ యూనిట్లు, 500 కేడబ్ల్యూపీ సోలార్ వ్యవస్థలతో కర్బన ఉద్గారాలను తగ్గిస్తోంది.

● ర్యాగ్‌పికింగ్ యంత్రాలు, రైడ్‌ఆన్ స్క్రబ్బర్, గ్రానైట్ డ్రైయర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను శుభ్రం చేసేందుకు వాక్ బిహైండ్ స్వీపింగ్ మెషీన్లు వినియోగిస్తున్నారు.

చెరువుల చెంత నిర్మాణ అనుమతులపై హైడ్రా లేఖాస్త్రం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మహా నగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అడ్డగోలుగా ఇచ్చిన భవననిర్మాణ అనుమతుల రద్దుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు హైదరాబాద్ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు హైడ్రా లేఖలు రాసింది. రెండు నెలలుగా అనేక చెరువుల సమీపంలో పరిశీలిస్తే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నా దాదాపు 30 నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని తేలింది. కొంతమంది ఒక సర్వే నెంబరులో నిర్మాణ అనుమతులు తీసుకుని ప్రభుత్వ స్థలంలో భారీ నిర్మాణాలు చేశారు. నిర్మాణ అనుమతులు ఇచ్చిన తరువాత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన కూడా చేయలేదని తేలింది. ఇందులో కొందరు అధికారులకు రూ.లక్షల్లోనే అందిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. తమంతట తామే ఈ తప్పులన్నింటినీ సరిదిద్దుకోవాలని రెండు ప్రభుత్వ సంస్థలను హైడ్రా కోరింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడానికి సిద్ధమవుతున్నారు. అక్రమ అనుమతులని తేలితే రద్దు చేయనున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

మూసీ నిర్వాసితులకు 16 వేల ఇళ్లు

● బాధితుల గుర్తింపునకు నేటి నుంచి ఇంటింటి సర్వే

● పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్

ఈనాడు, హైదరాబాద్: మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడింది. పనులను ప్రారంభించేందుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చేందుకు సర్కారు సిద్ధమైంది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 16వేల ఇళ్లను మూసీ నిర్వాసితులకు ఇచ్చేలా మంగళవారం జీవో జారీచేసినట్లు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ మంగళవారం వెల్లడించారు. 'కొన్నినెలలుగా 3 జిల్లాల పరిధిలోని మూసీ నదిపై సర్వే జరిగింది. రెవెన్యూ అధికారులు నదిగర్భంలో, బఫర్‌జోన్‌లో 10,200 నిర్మాణాలను గుర్తించారు. వాటిలో ఎవరెవరు ఉన్నారో గుర్తించేందుకు బుధవారం నుంచి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. బాధితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తున్నామనే వివరాలు కూడా ఇస్తాం. మొదట నదీ గర్భంలో ఉన్న 1,600 నిర్మాణాల్లోని బాధితులకు ఇళ్ల కేటాయింపు జరుగుతుంది. పునరావాసం కల్పించాక ఆక్రమణలను తొలగిస్తాం. అర్హులైన ప్రతి ఒక్క బాధితుడికి చట్ట ప్రకారం నష్టపరిహారం, పునరావాసం అందాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలను పక్కాగా అమలు చేస్తాం' అని ఆయన వివరించారు. పునరావాస ప్రక్రియ కొలిక్కి వచ్చిన తరువాత కూల్చివేతల ప్రక్రియను హైడ్రాకు అప్పగించాలని నిర్ణయించారు. దీనిపై మంగళవారం ఉన్నతాధికారులు చర్చించారు.

అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఆహార కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: దుకాణాల మూసివేత సమయాలపై హైదరాబాద్ కమిషనరేట్ ఉన్నతాధికారులు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు, టీస్టాళ్లు, పాన్‌షాప్‌లు అర్ధరాత్రి ఒంటిగంట వరకు నడుపుకోవచ్చు. సూపర్ మార్కెట్లు, ఎలక్ట్రానిక్, నగలు, దుస్తులు, సెల్‌ఫోన్, కిరాణా తదితర దుకాణాలు, వైన్‌షాప్‌లు రాత్రి 11 గంటలవరకు తెరిచి ఉంచొచ్చు. బార్లు శుక్ర, శనివారాల్లో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయించొచ్చు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

ఎస్సార్‌నగర్ పోలీసు డివిజన్‌కు సీసీ కెమెరాల అందజేత



అందజేసిన సామగ్రితో ఏజియంట్ ఫార్మా సంస్థ ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఎస్సార్‌నగర్ పోలీసు డివిజన్‌కు రూ.10 లక్షల విలువైన సీసీ కెమెరాలు, ఇతర ఇన్‌స్టలేషన్ సామగ్రిని అమీర్‌పేట మైత్రి విహార్‌లోని ఏజియంట్ ఫార్మా సంస్థ ప్రతినిధులు అందజేశారు. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో (సీఎస్ఆర్) భాగంగా సంస్థ సీఎండీ శ్రీనివాస్ వర్మ రుద్రరాజు, డైరెక్టర్ సౌమ్య రుద్రరాజులు కమ్యూనిటీ సీసీటీవీ ప్రాజెక్టు కోసం సీసీ కెమెరాలను మంగళవారం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్, ఏసీపీ పి.వెంకటరమణలకు అందజేశారు. ఈ కెమెరాలను బోరబండ పోలీసు స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్నామని పోలీసు అధికారులు చెప్పారు.

'తితిదేలో నాణ్యత పర్యవేక్షణ.. ఆహార ఆడిట్ తప్పనిసరి'

అమీర్‌పేట, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదం, ఫలహారాల సంబంధించిన నాణ్యతను పర్యవేక్షించడం, ప్రజా సూపర్‌విజన్, ఆహార ఆడిట్ నిర్వహించడం తప్పనిసరని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ అన్నారు. ఇటీవల తిరుపతి లడ్డు వివాదం దృష్టిలో ఉంచుకుని మంగళవారం అమీర్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తితిదేలో ప్రసాదంతో పాటు ఇతర కార్యక్రమాలు నిబంధనలకు అనుగుణంగా, ఆలయ గౌరవాన్ని కాపాడేలా ఉండాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై తాను 'తిరుపతి ఒక జీవన విధానం', 'సేక్రెడ్ ఫుడ్స్ అండ్ గాడ్స్' అనే రెండు పుస్తకాలు రాసినట్లు గుర్తు చేశారు. తితిదేలో స్వామివారికి నివేదించే నైవేద్యాలు, ప్రసాద సంప్రదాయాలను పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. తిరుపతి లడ్డు ప్రసాదం కలుషితమైన విషయం సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఆహార నాణ్యతపై సమగ్ర విచారణ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

హనుమాన్ దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేటలోని హనుమాన్ దేవస్థానంలోని హుండీల ద్వారా రూ.4,18,834 ఆదాయం సమకూరింది. మంగళవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, కార్యనిర్వహణాధికారి జయంతి పర్యవేక్షణలో భక్తులు, దేవస్థాన సిబ్బంది హుండీల్లో నగదును లెక్కించారు. 87 రోజులకు పది హుండీల ద్వారా ఆదాయం సమకూరినట్లు దేవస్థాన సూపరింటెండెంట్ సతీష్ తెలిపారు.

28 నుంచి గాత్ర, వీణ పోటీలు

లాలాపేట: ఓయూలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ఫైన్ఆర్ట్స్ మీడియం ఎడ్యుకేషన్ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో కర్ణాటక గాత్ర, వీణ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి కలిగి ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారు 94417 68811, 94413 86157 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా సురేష్‌కుమార్ చౌదరి

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని ఎస్‌బీఎస్ నివాస్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా సురేష్‌కుమార్ చౌదరి ఎన్నికయ్యారు. తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీ నిర్వహించిన ఎన్నికల్లో సురేష్‌కుమార్ చౌదరి ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఉపాధ్యక్షుడిగా వై.శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్ కలిమిచెర్ల, కార్యదర్శిగా ఎస్.వై.సంపత్‌కుమార్, సహ కార్యదర్శిగా ఎం.శేషగిరిరావు, కోశాధికారిగా వి.తిరుపతిరెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా జి.పరిమళాదేవి, లింగ పద్మావతి, కె.మిలింద్‌లు ఎన్నికయ్యారు.

సనత్‌నగర్‌లో ఉక్కిరిబిక్కిరి

డంపింగ్ యార్డులా మారిన పారిశ్రామిక వాడ

రసాయనాల ప్రవాహం.. ఘన, ధూళి రూపాల్లో కాలుష్యం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ పారిశ్రామికవాడ పరిసర ప్రాంతాల్లో ఊపిరి పీల్చుకోవడమూ కష్టంగా మారింది. రాత్రి పూట విషవాయువుల ప్రభావంతో పాటు ఈ ప్రాంతంలో ద్రవ రూపంలో వదులుతున్న రసాయన వ్యర్థాలు, రహదారులపై పారిశ్రామిక వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానిక నివాసిత ప్రాంతాల్లో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. నగరంలో పంజాగుట్ట, జూపార్క్ ప్రాంతాలతో పాటు సనత్‌నగర్‌లోనూ గాలిలో ధూళి కణాలు ఎక్కువగా విడుదలవుతున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వెల్లడించింది.



వాయు కాలుష్యాన్ని సూచించే బోర్డు



బేగంపేట నాలాలో పారుతున్న రసాయన జలాలు

నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు

పారిశ్రామికవాడలో గతంలో 120 భారీ, మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమలు కొనసాగాయి. ఆ తరవాత మౌలిక సదుపాయాలు సరిగా లేక కొన్ని పరిశ్రమలు తరలిపోగా.. ఇంకొన్ని రసాయన పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ ల్యాబ్‌లు, పెయింట్ తయారీ కర్మాగారాలు కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం గ్రీన్ జోన్‌గా మారిన పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఉండకూడదు. ఆర్ అండ్ డీ యూనిట్లకు మాత్రం అనుమతి ఉంటుంది. దీనికి విరుద్ధంగా ఔషధ ఉత్పత్తి, పెయింట్ల తయారీతో పాటు పలు రసాయన పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఇక్కడి ఓ కర్మాగారం నుంచి రోజూ రాత్రి వేళల్లో వాయురూపంలో ధూళి వెలువడుతూ స్థానిక నివాసితుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

సనత్‌నగర్ పారిశ్రామికవాడలో నిర్మాణ వ్యర్థాలు పారబోసే డంపింగ్ యార్డుగా వినియోగించుకుంటున్నారు. పారిశ్రామికవాడలోని రహదారులపై అర్ధరాత్రి లారీల్లో తరలిస్తున్న నిర్మాణ వ్యర్థాలు, చెత్తను పారబోస్తున్నారు. వీవీఎస్ వెనక వైపు లేన్, మెటాలిక్ ఇండస్ట్రీస్ లేన్, ఎస్‌బీఐ లేన్, ఆగ్రో ఇండస్ట్రీస్ లేన్లలో రోడ్లకు ఇరువైపులా నిర్మాణ వ్యర్థాలు, చెత్త కుప్పలు, పారిశ్రామిక వ్యర్థాలను కుప్పలుగా పోస్తున్నారు. తుప్పుపట్టిన వాహనాలు పేరుకుపోయాయి.



పారిశ్రామికవాడ రహదారులపై ఇలా..

రహదారులు, నాలాల్లోనే వ్యర్థాలు

సనత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రసాయన, ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో సాధారణంగా వినియోగించే మిథనాల్, రసాయన సాల్వెంట్లు, యాసిడ్, ఎసిటిక్ నైట్రేట్ తదితర పదార్థాల వ్యర్థాలను జీడిమెట్ల లేదా పటాన్‌చెరు రసాయన శుద్ధి ప్లాంట్లకు తరలించాల్సి ఉంది. రసాయనాలను శుద్ధి చేసే ప్లాంట్లకు లక్షల్లో ఫీజు చెల్లించాల్సి ఉండటంతో పరిశ్రమల నుంచి రాత్రి పూట ఫతేనగర్, జింకలవాడ, ఇందిరాగాంధీపురం ప్రాంతాల్లో రసాయనాలను, ద్రవరూప వ్యర్థాలను దొంగచాటుగా నాలాల్లో వదిలిపెడుతున్నారు. పారిశ్రామిక వాడకు డ్రైయిన్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కడి రసాయన, ద్రవరూప వ్యర్థాలు వర్షపు నీటి కాల్వ ద్వారా ఫతేనగర్ రైల్వే ట్రాక్ కింద ఉన్న కల్వర్టు నుంచి బాలానగర్ నాలాలో కలుస్తున్నాయి. కొందరు సనత్‌నగర్ పారిశ్రామిక వాడలోని డ్రెయిన్‌లలో విడిచిపెడుతుండటంతో రసాయన ఒత్తిడికి గతంలో మ్యాన్‌హోళ్లు పేలిన సందర్భాలు ఉన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య
సికింద్రాబాద్: 8008573368
కంటోన్మెంట్: 8008573361
సనత్‌నగర్: 8008573356

సికింద్రాబాద్, సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే:

? సీతాఫల్ మండి మేడిబావి ప్రాంతంలో ఉన్న డెడ్ లాక్ బిల్డింగ్ రోడ్డులో వర్షాల కారణంగా బురద, చెత్త పేరుకు పోయి చిత్తడిగా తయారై దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించండి. – సురేష్, మేడిబావి

● వర్షాల వల్ల తడిబారి ఉన్న చెత్తను తొలగించడానికి కష్ట ఇబ్బందిగా మారింది. వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – రజినీకాంత్, వైద్యాధికారి, సికింద్రాబాద్ సర్కిల్

? బీకేగూడ జయభారతి పాఠశాల చౌరస్తా సమీపంలో సనత్‌నగర్ బస్టాండ్ వైపు వచ్చే రహదారిలో ఓ వీధి దీపం రెండు నెలలుగా రాత్రింబవళ్లు వెలుగుతోంది. – మహేష్‌కుమార్, బీకేగూడ

● సంబంధిత గుత్తేదారుకు సమాచారం ఇచ్చి మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. – కిరణ్మయి, జీహెచ్‌ఎంసీ వీధి దీపాల నిర్వహణాధికారి

విజయ పాల ఉత్పత్తుల నాణ్యతకు కట్టుబడి ఉంటాం



మాట్లాడుతున్న డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

లాలాపేట, న్యూస్‌టుడే: తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని సంస్థ నూతన ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాక డివిజన్ లాలాపేటలోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయ డెయిరీ పాల ఉత్పత్తుల మీద ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ పాఠశాలలకు, హాస్టళ్లకు, జైళ్లకు, ఆసుపత్రులకు, దేవాలయాలకు అవసరమైన పాలు, పాలపదార్థాలు విజయ డెయిరీ నుంచి సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే జీఓ తీసుకురావడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ రంగంలో లాభాపేక్ష లేకుండా వినియోగదారుడికి సరసమైన ధరలో నాణ్యమైన పాలను పాల ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

'బీసీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం'

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం బీసీలను అణగదొక్కిందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. సికింద్రాబాద్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులందరూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ బీసీ ఉద్యోగుల ఐక్యవేదిక ద్వారా బీసీలకు రావాల్సిన హక్కులు, డిమాండ్లు, ఆత్మగౌరవాన్ని సాధించుకుంటామన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకుని వచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీసీ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి నిరంజన్, రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.గోపికృష్ణ, సంఘం ముఖ్య సలహాదారులు లక్ష్మీనారాయణ, ఎంపీపీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కంప్యూటర్ శిక్షణ ధ్రువపత్రాల ప్రదానం




శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో కమ్మసంఘం ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమీర్‌పేట కమ్మ సంఘం ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ద్వారా ఉచితంగా నిర్వహించిన బేసిక్ కంప్యూటర్స్, ఎం.ఎస్.ఆఫీస్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు, గృహిణులు, సీనియర్ సిటిజన్లకు మంగళవారం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ ఆధ్వర్యంలో అమీర్‌పేట కమ్మసంఘం హాలు ఆవరణలోని శిక్షణ సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 65 మందికి ధ్రువపత్రాలు అందజేశారు.

మలి విడత అక్టోబరు 14 నుంచి: కంప్యూటర్స్‌లో విద్యార్థులు, గృహిణులు, సీనియర్ సిటిజన్లకు మలివిడత ఉచిత శిక్షణను అక్టోబరు 14 నుంచి ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. శిక్షణకు హాజరు కాగోరు ఆసక్తి కలిగిన వారు 98495 66945, 91776 61161 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అక్టోబరు 8, 9వ తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు అమీర్‌పేట కమ్మసంఘం హాల్ ఆవరణలోని శిక్షణ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

అగ్ర శాస్త్రవేత్తల్లో మనవారికి చోటు



ఈనాడు, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి రెండు శాతం శాస్త్రవేత్తల్లో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) విశ్రాంత శాస్త్రవేత్త **డాక్టర్ అవుల లక్ష్మయ్య**కు చోటు దక్కింది. యూఎస్ఏలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం వేర్వేరు అంశాల ఆధారంగా ఈ జాబితాను ప్రకటిస్తుంది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని 29 మంది పరిశోధకులకు చోటు దక్కటం తెలిసిందే.

బేగంపేటలో సీవరేజీ ఇబ్బందులు పరిష్కరించండి

బేగంపేట, న్యూస్‌టుడే: బేగంపేట డివిజన్‌లో సీవరేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ మహేశ్వరి జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జలమండలి జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పాడైపోయిన మ్యాన్‌హోళ్ల స్థానంలో కొత్తవి అమర్చాలని, సామర్థ్యానికి అనుగుణంగా సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

న్యాయమూర్తి కుటుంబానికి తలసాని పరామర్శ

రెజిమెంటల్‌బజార్: సిటీ సివిల్ కోర్ట్ స్మాల్ కాజెస్ చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావును మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. నర్సింగ్‌రావు మాతృమూర్తి మణెమ్మ సోమవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం ఓల్డ్ బోయగూడలోని వారి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

కంటోన్మెంట్: ఖమ్మం జిల్లాలో ఇబ్బందులు పడుతున్న వరద బాధితుల సహాయార్థం రెండు రోజులుగా హైదరాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం విరాళాలను సేకరిస్తోంది. ఈ మేరకు మంగళవారం జేబీఎస్, వెస్ట్ మారేడుపల్లి ఆ పరిసర ప్రాంతాల్లో వరద బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పాటల రూపంలో ఆలపిస్తూ విరాళాలను సేకరించారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వ నమోదు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో భాజపా సభ్యత్వ నమోదు నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. మంగళవారం మెట్టుగూడ డివిజన్‌లో డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలోని చిలకలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ శాఖ సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు లక్ష్మి, సతీష్ రెడ్డి, డాక్టర్లు చందు, యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమిత వనరులతో అద్భుతాలు చేసేలా ఆలోచనలు



ఓయూ అధికారులతో విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

లాలాపేట, న్యూస్‌టుడే: ఉద్యోగుల ఆలోచన విధానంలో మార్పు రావాలని విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలు, విద్యారంగ సవాళ్లు, పరిష్కారాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఓయూలో మంగళవారం ఓయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఓయూలోని విద్యార్థుల, బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలను పలువురు ప్రిన్సిపల్స్ వివరించారు. ఆయా కళాశాలల్లో జరుగుతున్న పరిశోధనలు, అకడమిక్ ప్రచురణలపై ఆయన ఆరా తీశారు. పరిమిత వనరులతో అద్భుతాలు సృష్టించేలా ఆలోచనలు ఉండాలన్నారు. అకడమిక్స్ పాటు స్పోకెన్ ఇంగ్లిష్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్ లాంటి కనీస నైపుణ్యాల శిక్షణ ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొ. బి.రెడ్యానాయక్, యూజీసీ డీన్ ప్రొ. జి.మల్లేశం, పలువురు ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

దుకాణాలపై కూలిన ఓల్డ్ జైల్‌ఖానా గోడ



గోడ కూలి ధ్వంసమైన దుకాణాలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ మోండా మార్కెట్ ఓల్డ్‌జైల్‌ఖానా వెనుక వైపు పురాతన గోడ పైభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఒక్కరూ స్వల్పంగా గాయపడగా.. అక్కడి ఆరు దుకాణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సందర్శించి పరిశీలించారు. సికింద్రాబాద్ మోండామార్కెట్ ప్రాంతంలోని ఓల్డ్‌జైల్‌ఖానా వెనుక వైపు పార్కింగ్ ప్రదేశంలో భారీ ఎత్తులో పురాతన గోడ ఉంది. దీనికి అనుకుని అయిదు టైలరింగ్ దుకాణాలు, ఒక పూల దుకాణం కొనసాగుతున్నాయి. స్థానికులైన రాజు, కీర్తి నరేందర్, ఐలయ్య, రాయి నర్సింగ్‌రావు, రాయి హనుమంతరావు, మోతే భాస్కర్, కృష్ణలు 40 నుంచి 50 ఏళ్లుగా జీహెచ్‌ఎంసీకి చెందిన ఈ దుకాణాల్లోనే అద్దె చెల్లిస్తూ కుట్టుమిషన్ల ద్వారా దుస్తులు కుట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో పురాతన గోడలు నానిపోయి మంగళవారం సాయంత్రం పై భాగం ఒక్కసారిగా కూలిపోయి దుకాణాలపై పడటంతో అక్కడున్న కుటుమిషన్లు ధ్వంసమయ్యాయి. దుస్తులు మట్టి కొట్టుకుపోయాయి. టైలర్ కృష్ణ స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదకరంగా ఉన్న మిగతా గోడను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం రాత్రి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఒక్కో బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. షాపులు కూలిపోయినందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



గ్రంథాలయాన్ని శుభ్రం చేయడానికి వచ్చిన విద్యార్థులు

సంజీవరెడ్డినగర్: నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్సార్‌నగర్ గ్రంథాలయాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం మంగళవారం సంజీవరెడ్డినగర్ గ్రంథాలయం భవనంలోని అన్ని గదులను శుభ్రం చేశారు. బృందానికి సారథ్యం వహిస్తున్న ప్రొఫెసర్ డా.సుధారాణి, నర్సింహులు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నగరంలోని అన్ని గ్రంథాలయాల్లో నిర్వహించినట్లు చెప్పారు. జేబీఐటీ, గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు.

బేగంపేట: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఛైర్ పర్సన్, కళాశాల ప్రిన్సిపల్ డా.కె.పద్మావతి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ 5 యూనిట్లకు చెందిన విద్యార్థులు బేగంపేట కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీ, సంస్కృత అకాడమీల్లోని గ్రంథాలయాలను శ్రమదానం ద్వారా శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎన్-4 ఇన్‌ఛార్జి డా.కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదల సంజీవని

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: నిరుపేదలు మెరుగైన వైద్య సేవలను పొందటానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ సంజీవనిలా పనిచేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ నారాయణన్ అన్నారు. వెస్ట్ మారేడుపల్లికి చెందిన శ్రీశైలం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక స్తోమత లేకపోవడంతో మెరుగైన వైద్యానికి దూరంగా ఉంటున్నాడు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని తెలుసుకుని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కోసం రూ.2.25 లక్షలను మంజూరు చేయించారు. ప్రభుత్వ మంజూరుపత్రాన్ని మంగళవారం అందజేశారు.

మారేడుపల్లి: వెస్ట్ మారేడుపల్లికి చెందిన శ్రీశైలం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవటానికి స్తోమత లేకపోవడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను సంప్రదించారు. ఆయన స్పందించి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2.25 లక్షలు సీఎం సహాయ నిధి ఎల్ఓసీ పత్రాలు మంజూరు చేయించి అందజేశారు.

జైనుల కృషి అభినందనీయం



మహిమాజైన్‌ను సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: జీవహింస చేయకుండా సమాజంలో ధర్మం, న్యాయం వర్ధిల్లాలన్న తమ గురువుల ప్రవచనాలను పాటించే జైన్ సమాజం మానవ కల్యాణం కోసం కృషి చేస్తుండటం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతం సిఖ్‌రోడ్డులోని ఆదినాథ్ భవన్‌లో మంగళవారం జైన్ సమాజ్ ఉపవాస్ దీక్ష విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 31 రోజుల ఉపవాస దీక్షను పూర్తి చేసుకున్న బొల్లారానికి చెందిన 25 ఏళ్ల మహిమాజైన్‌ను సన్మానించి, ఆమెను అభినందించారు. కార్యక్రమంలో బాణిక మల్లికార్జున్, బీఎన్ శ్రీనివాస్, వినోద్, అనితా తదితరులు పాల్గొన్నారు.

'పేదల నిర్మాణాలపై ప్రతాపం సరి కాదు'

సంజీవరెడ్డినగర్: పేదల నిర్మాణాలను హైడ్రా సిబ్బంది ఉన్నపళంగా కూల్చివేయటం సరికాదని భారాస రాష్ట్ర నాయకులు అమృత్‌లాల్ చౌహాన్ అన్నారు. ఎస్సార్‌నగర్ బాపూనగర్ బంజారా బస్తీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ హైడ్రా కూల్చివేతలతో బడా బాబుల కంటే పేద, మధ్యతరగతి కుటుంబాలే బాధితులుగా మారుతున్నారన్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ వంటి ప్రభుత్వ విభాగాలు ఇచ్చిన అనుమతులతో నిర్మించిన భవనాలనూ కూల్చివేస్తుండటంతో కొనుగోలుదారుల్లో భయం నెలకొందన్నారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రాష్ట్ర ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, దాని నుంచి దృష్టి మరల్చడానికే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నోటీసులు, సమయం ఇవ్వకుండా కూల్చడం మానుకోవాలన్నారు.

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం

కార్ఖానా, న్యూస్‌టుడే: మతిస్థిమితం సరిగా లేని బాలిక అదృశ్యమైన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఆంథోనమ్మ కథనం ప్రకారం.. తిరుమలగిరి ఎల్ఐసీ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన బాలిక(17)కు మతిస్థిమితం సరిగా లేదు. దీనికి తోడు మూగ. ఆమె తల్లిదండ్రులు గత నెల 23న కూలి పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లో బాలిక లేదు. చుట్టుపక్కల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆగస్టు 24న తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: మెడికల్ షాపులోకి వెళ్లి వచ్చేలోపు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్కెట్ పోలీసుల కథనం ప్రకారం... శివాజీనగర్‌లో నివాసం ఉండే శ్రీవాత్సవ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఇతడు ఈ నెల 13న రాత్రి ద్విచక్రవాహనంపై శివాజీనగర్‌లోని సౌమ్య మెడికల్ దుకాణం వద్దకు వచ్చాడు. షాపు ముందు తన వాహనాన్ని నిలిపి దానికే తాళం ఉంచి వెళ్లాడు. కొంతసేపటికి వచ్చి చూడగా.. వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. దీంతో ఈనెల 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి

లాలాపేట: విశ్వవిద్యాలయాల్లో 30 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐకాస ప్రతినిధులు విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేశారు. ఓయూలో ఆయన మంగళవారం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఐకాస నాయకులు ఆయనను కలసి తమ సమస్యలను వివరించారు.

వయోధికుల సేవలు ఆదర్శప్రాయం

సనత్‌నగర్: ఎస్సార్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ సభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎస్సార్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేను మారేడుపల్లిలో కలిసి సన్మానించారు. వచ్చే నెల 4న నిర్వహించే సత్యనారాయణస్వామి వ్రతానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కౌన్సిల్ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, మాజీ అధ్యక్షులు డి.పార్థసారథి, ప్రతినిధులు ఉన్నారు.

సమకూరిన సొంత జెట్టింగ్ వాహనం



కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని బోర్డు పరిధిలో నిరుపేదలు జీవనం సాగించే మురికివాడలు, బస్తీల సంఖ్య ఎక్కువే. ఆయా ప్రాంతాల్లోని చిన్నపాటి గల్లీల్లో ఏర్పాటు చేసే భూగర్భ డ్రైనేజీ పైపులైన్లలో పూడిక పేరుకుపోయినా, లీకేజీలు ఏర్పడినా మురుగు ఏరులై పారుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బోర్డు యంత్రాంగం సమస్యను పరిష్కరించేందుకు ప్రైవేటు సంస్థలకు గంటకు సుమారు రూ.3 వేలను చెల్లించి సక్షన్/ జెట్టింగ్ వాహనాలను అద్దెకు తీసుకునేవారు. చాలా సంవత్సరాలుగా సొంత నిధులతో సక్షన్ కమ్ జెట్టింగ్ యంత్రంతో కూడుకున్న వాహనాన్ని కొనుగోలు చేయాలని భావిస్తున్నా.. ఎప్పటికప్పుడు పెండింగ్ పడుతూ వస్తోంది.

ఎట్టకేలకు రూ.45 లక్షల వ్యయంతో కొనుగోలు

సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం అందుబాటులో ఉన్న 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల్లోంచి రూ.45 లక్షలను వెచ్చించి సక్షన్ కమ్ జెట్టింగ్ యంత్రం వాహనాన్ని కొనుగోలు చేయాలని జూన్ నెలలో జరిగిన సమావేశంలో పాలకమండలి నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు, ప్రభుత్వ ఈ మార్కెట్ టెండర్ ప్రక్రియ ద్వారా కొద్దిరోజుల క్రితం ఆరువేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాహనాన్ని కొనుగోలు చేశారు. సదరు వాహనం నాలుగు రోజుల కిందట అందుబాటులోకి వచ్చింది. మరో రెండు, మూడు రోజుల్లో ఈ వాహనం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఇకపై మురుగు సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించవచ్చని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ చెప్పారు.

స్వచ్ఛతకు కాలనీ సంఘాల సహకారం అవసరం

కార్ఖానా, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్‌కు కాలనీ సంఘాల సహకారం అవసరమని కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈవో పల్లవి, బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణలు పేర్కొన్నారు. బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏడో వార్డులోని బంజార కాలనీ పార్కులో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ సీఈవో పల్లవి, రామకృష్ణలతో పాటు బోర్డు హెల్త్‌విభాగం ఉన్నతాధికారి దేవేందర్, కాలనీ కార్యదర్శి వై.వి.రావులతో కలిసి కాలనీ పార్కును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (మంగళవారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 43, వంగ 35, బెండ 40, పచ్చిమిర్చి 23, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 40, ఆలు 38, ఉల్లి 54, సొర 15, పొట్ల 18, బీన్స్ 55, గోరుచిక్కుడు 28, చిక్కుడు 70, దోస 21, బీర 45, కాకర 38, చామగడ్డ 40, కీర 40, క్యాప్సికం 65, బీట్‌రూట్ 28, కందగడ్డ 65, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.43, వంగ 35, బెండ 40, పచ్చిమిర్చి 23, కాకర 38, బీర 38, క్యాబేజీ 21, బీన్స్ 55, క్యారెట్ 45, దొండ 40, చిక్కుడు 70, క్యాప్సికం 65, ఆలు 38, కీర 25, దోస 21, చామగడ్డ 40, అరటి 10, బీట్‌రూట్ 28, సొర 15, గోకర 28, కందగడ్డ 65, చిలకడదుంప 45, మామిడి 86.

రోడ్డు ఛిద్రం.. గుంతలు ప్రమాదకరం



గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ సామాజిక భవనం ఎదురు మార్గంలో రోడ్డు ఛిద్రమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మార్గంలో గతంలో సగం సీసీ రోడ్డు పూర్తి చేసిన అధికారులు మిగతా సగం పూర్తి చేయలేదు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో గుంతల్లోకి నీరు చేరి ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాహెబ్ చెరువును పరిరక్షించాలని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

మౌలాలి, న్యూస్‌టుడే: మౌలాలి డివిజన్ పరిధిలోని సాహెబ్ చెరువును పరిరక్షించాలని డివిజన్‌కు చెందిన మీర్ హుస్సేన్ అలీ హైడ్రా కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మౌలాలి గుట్ట కింద సర్వే నంబర్ 425లో విలేజ్ మ్యాప్ ప్రకారం సాహెబ్ చెరువు ఉందని కొందరు ఆక్రమణదారులు చెరువును పూడ్చివేసి కబ్జా చేస్తున్నారని పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓ, తహసిల్దార్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. చెరువు విలేజ్ మ్యాప్ తదితర పత్రాలను ఆయనకు అందజేసినట్లు పేర్కొన్నారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి

లాలాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు 30 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐకాస ప్రతినిధులు విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేశారు. ఓయూలో ఆయన మంగళవారం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు తమ సమస్యలను వివరించారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక సేవలు..!

ముమ్మరంగా ఆయుష్మాన్ భారత్‌లో వివరాల నమోదు

గౌతంనగర్, న్యూస్‌టుడే: చిన్నపాటి జబ్బులకు సైతం లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తున్న ప్రస్తుత రోజుల్లో కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోలేని నిరుపేద, మధ్య తరగతి వారికోసం సర్కిల్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఇప్పటికే అందిస్తున్న సేవలతో పాటు (ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్) ద్వారా మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సిబ్బందికి ఇందుకు అవసరమైన శిక్షణను ఇప్పటికే పూర్తి చేసింది.



గౌతంనగర్‌లో ఇంటింటికి వెళ్లి పత్రాలు పరిశీలిస్తూ..

పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ..

ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం ఆధునిక వైద్యసేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. కొవిడ్ పరీక్ష, హిమోగ్లోబిన్ ఎస్టిమేషన్(హెచ్‌బీ), మొత్తం లూకో సైట్ కౌంట్, డిఫెరెన్షియల్ లూకో సైట్ కౌంట్(డీఎల్‌సీ), ప్లేట్‌లెట్ కౌంట్, గడ్డకట్టడానికి సమయం(సీటీ), బ్లడ్ గ్రూప్(ఏబీవో-ఆర్‌హెచ్), బ్లడ్‌షుగర్, బ్లడ్‌యూరియా, సీరంక్రియాటినిన్, ఎస్‌జీవోటీ, ఎస్‌జీపీటీ, టోటల్ ప్రొటీన్, సీరం టోటల్ కొలెస్ట్రాల్, కఫం, హెచ్ఐవీ, మలం విశ్లేషణకు చెందిన పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు. ఈ కేంద్రంలో ప్రతి బుధవారం చిన్న పిల్లలకు పోలియో, రొటావైరస్, తట్టువ్యాధి వంటి రోగాలు రాకుండా ఉచితంగా టీకాలు వేస్తారు. గర్భిణులకు ఉచితంగా టీకాలు, పరీక్షలు నిర్వహిస్తారు. రానున్న రోజుల్లో దవాఖానాలను కూడా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు అనుసంధానించనున్నారు. ఏర్పాట్లు పూర్తయితే మరో 12 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి. బాధితులు సుదూర ప్రాంతాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.



ఏకలవ్యనగర్ యూపీహెచ్‌సీ

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఆసుపత్రులు

- ★ మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రి, పీహెచ్‌సీ
- ★ ఏకలవ్యనగర్, సఫిల్‌గూడ, మౌలాలి, వినాయక నగర్ యూపీహెచ్‌సీలు

నమోదు కేంద్రాలు ఎక్కడెక్కడంటే..

గౌతంనగర్, మల్లికార్జున్‌నగర్, బలరాంనగర్ సామాజిక భవనాలు, సీతారాంనగర్ గణేష్ మండపం వద్ద

మెరుగైన వైద్యం అందుతుంది



–డాక్టర్ రాధ, ఏకలవ్యనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల సహకారంతో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యమందిర్‌లో స్థానికుల వివరాలు నమోదు ప్రక్రియ జరుగుతోంది. సర్కిల్ పరిధిలో సుమారు 1.5లక్షల మంది వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు దాదాపు 56 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ముందుకొచ్చారు. స్థానికుల ఆధార్ నంబర్ ఆధారంగా వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

అల్వాల్, డిఫెన్స్‌కాలనీ, గౌతంనగర్, డిఫెన్స్ కాలనీ, న్యూస్‌టుడే:

? కానాజిగూడలోని శ్రీనిధి స్వగృహ ఫుడ్స్ వీధిలో మ్యాన్‌హోల్ నుంచి వారం రోజులుగా మురుగు నిరంతరం పారుతుండటంతో అపరిశుభ్రత నెలకొంది. –సురేశ్, స్థానికుడు ✓ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. – రమేశ్, మేనేజర్, జలమండలి ? యాప్రాల్ కమ్మరి బస్తీ సమీపంలోని గ్రంథాలయం వీధిలో పలు వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథాను అరికట్టండి. – రెడ్డి, యాప్రాల్ ✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – వెంకటేష్ వీధి దీపాల నిర్వహణ అధికారి ? గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ రోడ్డులో కుక్క చనిపోయి ఉంది. వెంటనే తొలగించగలరు. – చక్రపాణి, మిర్జాలగూడ ✓ చనిపోయిన కుక్కను వెంటనే తొలగిస్తాం.

– మంజుల, ఏఎంహెచ్‌వో, మల్కాజిగిరి

? యాప్రాల్ కమ్మరి బస్తీ సమీపంలోని గ్రంథాలయం వీధిలో పలు వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథాను అరికట్టండి. –రెడ్డి, యాప్రాల్ ✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –వెంకటేష్, వీధి దీపాల నిర్వహణ అధికారి

సుబ్రహ్మణ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలోని శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యుడు



ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ప్రసన్నాంజనేయుడు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆనంద్‌బాగ్‌లోని లలితా పరమేశ్వరి దేవాలయంలో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ★ ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ప్రసన్నాంజనేయుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు.

అపార్టుమెంట్ల డ్రైనేజీ కనెక్షన్లపై విచారణ చేయించండి

అల్వాల్, న్యూస్‌టుడే: మచ్చబొల్లారంలోని కొత్తకాలనీల్లో వెలుస్తున్న అపార్టుమెంట్లకు ఇస్తున్న డ్రైనేజీ కనెక్షన్లపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అపార్టుమెంట్ల డ్రైనేజీతో ఇబ్బంది పడుతున్న ఏడు కాలనీ వాసులతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో మంగళవారం భేటీ అయ్యారు. 'ఆయా కాలనీల్లో అవుట్‌లెట్లు లేకుండా అపార్ట్‌మెంట్లకు డ్రైనేజీ కనెక్షన్లు ఇస్తున్నారు. దీంతో అప్పటికే ఉన్న మురుగుకాలువ గొట్టాల సామర్థ్యం సరిపోక సమస్యలు వస్తున్నాయి. డ్రైనేజీ కనెక్షన్ల జారీకి నిబంధనలు ఉన్నా డివిజన్ పరిధిలో అమలు జరగడం లేదు. అదేవిధంగా తుర్కపల్లి కాలనీలోనూ సమస్య నెలకొంది' అని కమిషనర్‌కు వివరించారు. ఎగువన ఉన్న వైమానిక దళ యంత్రాంగం దిగువకు వరద రాకుండా సహకరిస్తామని చెబుతోందని కమిషనర్‌కు వివరించారు. ఇందుకు స్థానిక సర్కిల్ యంత్రాంగం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని సర్కిళ్ల అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో భారాస నేతలు రావుల అంజయ్య, పరశురాం రెడ్డి, డోలి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ల చిత్రాలను కమిషనర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే

స్వచ్ఛతా హీ సేవలో ఆర్పీఎఫ్ అధికారులు

మౌలాలి, న్యూస్‌టుడే: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మౌలాలి అధికారులు మంగళవారం మల్లాపూర్‌లోని అశోక్‌నగర్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ట్రాక్ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం కమ్యూనిటీ పోలీసింగ్ విధానం, ఆరోగ్యం- పర్యావరణ ప్రభావం, వ్యర్థాల నిర్వహణ - సామాజిక బాధ్యత అన్న అంశాలపై స్థానికులకు వివరించి అవగాహన కల్పించారు. ఆయా పరిసర ప్రాంతాల వారితో పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు ఆర్పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మానవ కల్యాణానికి జైన సమాజం కృషి అభినందనీయం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: జీవహింస చేయకుండా సమాజంలో ధర్మం, న్యాయం వర్ధిల్లాలన్న తమ గురువుల ప్రవచనాలను పాటించే జైన్ సమాజం మానవ కళ్యాణం కోసం కృషి చేస్తుండటం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతం సిఖ్‌రోడ్డులోని ఆదినాథ్ భవన్‌లో మంగళవారం జైన్ సమాజ్ ఉపవాస్ దీక్ష విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 31 రోజుల ఉపవాస దీక్షను పూర్తి చేసుకున్న బొల్లారానికి చెందిన 25 ఏళ్ల మహిమాజైన్‌ను సన్మానించి, ఆమెను అభినందించారు.



ఉపవాస దీక్షను పూర్తి చేసిన మహిమాజైన్‌ను సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

విజయ పాల ఉత్పత్తుల నాణ్యతకు కట్టుబడి ఉంటాం: ఛైర్మన్

లాలాపేట, న్యూస్‌టుడే: తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని సంస్థ నూతన ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాక డివిజన్ లాలాపేటలోని విజయ డైరీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విజయ డెయిరీ పాల ఉత్పత్తుల మీద ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ పాఠశాలలకు, హాస్టళ్లకు, జైళ్లకు, ఆసుపత్రులకు, దేవాలయాలకు అవసరమైన పాలు, పాలపదార్థములు విజయ డెయిరీ నుండి సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే జీఓ తీసుకురావడం హర్షనీయ మన్నారు. దీంతోపాటు పాడి రైతుల సంక్షేమ కోసం కృషి చేస్తామని తెలిపారు.

నిధులలేమితో స్థానిక సంస్థలు సతమతం: ఎంపీ

మేడ్చల్‌రూరల్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు నిధులలేమితో సతమతమవుతున్నాయని తద్వారా అభివృద్ధి కుంటుపడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నిర్వహించిన మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు.

పేదల బస్తీల్లో యునాని సంచార వైద్యశాల

బోరబండ, న్యూస్‌టుడే: ఎర్రగడ్డలోని చర్మవ్యాధుల యూనాని చికిత్స జాతీయ పరిశోధనకేంద్రం ఆధ్వర్యంలో పేద, బడుగువర్గాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో సంచార వైద్యశాల ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఐదురోజులు వేర్వేరు ప్రాంతాల్లో జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులు, నీరసం వంటి సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స అందిస్తున్నారు. సోమవారం యూసుఫ్‌గూడ వెంకటగిరి, మంగళవారం బోరబండ సైట్-3 కాలనీ, ఎస్పీఆర్ హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీల్లో సేవలు అందించగా, బుధవారం బోరబండ పరిసర ప్రాంతల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, గురువారం మల్కాజ్‌గిరి, శుక్రవారం బషీర్‌బాగ్ ప్రాంతాల్లో సేవలు అందించనున్నట్లు యునాని పరిశోధన కేంద్రం రీసెర్చ్ ఆఫీసర్ డా.రాజారామ్ తెలిపారు. తమవద్దకు వచ్చే రోగులకు మందులతో పాటు సూచనలు ఇస్తున్నామని అవసరమైన వారిని ఎర్రగడ్డలోని పరిశోధన కేంద్రానికి పంపిస్తామని చెప్పారు.

సామాజిక భవనంలో మందుబాబుల తిష్ఠ

అల్వాల్, న్యూస్‌టుడే: వెంకటాపురంలోని అంబేడ్కర్ సామాజిక భవనంలో రాత్రి కాగానే మందుబాబులు తిష్ఠ వేస్తున్నారు. భవనంలోని సెల్లార్‌లో మద్యం తాగుతూ సీసాలను, ఇతర వ్యర్థాలను అక్కడే చిందరవందరగా పడేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉంది. ఈ క్రమంలో సెల్లార్‌లోనే కొనసాగుతున్న బస్తీ దవాఖానాకు వచ్చే రోగులతో పాటు వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొంతకాలంగా భవనం మొదటి అంతస్తులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. ఇక్కడ కూడా అర్ధరాత్రి వరకు యువకులు తిష్ఠ వేసి మద్యం తాగుతూ కాలక్షేపం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో గొడవలు పడుతున్నారు. చాలా ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతోందననే ఆందోళనతో ఉంటున్నామని వాపోతున్నారు. కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విస్మయం చెందుతున్నారు.



భవనం చెంత వదిలేసిన మద్యం సీసాలు

కూచిపూడి నృత్యాన్ని భావితరాలకు అందించాలి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యాన్ని భావితరాలకు అందించాలని వక్తలు పేర్కొన్నారు. సుందరయ్య కళానిలయంలో కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం పార్వతీశం జయంతి నిర్వహించారు. ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డా.వేదాంతం వెంకటాచలపతి పార్వతీశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూచిపూడి నృత్య ప్రాచుర్యానికి పార్వతీశం సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. రచయిత భూపతి వెంకటేశ్వర్లు, ఏలేశ్వరం చలపతి శాస్త్రి, మృత్యుంజయ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీశం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వేదాంతం వెంకటాచలపతి. చిత్రంలో నృత్య గురువులు

సంక్షిప్త సమాచారం

స్వచ్ఛ భారత్‌కు కాలనీ సంఘాల సహకారం అవసరం

కార్ఖానా: స్వచ్ఛ భారత్‌కు కాలనీ సంఘాల సహకారం అవసరమని కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈవో పల్లవి, బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణలు పేర్కొన్నారు. బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏడో వార్డులోని బంజార కాలనీ పార్కులో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. జాయింట్ సీఈవో పల్లవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ శిక్షణ తరగతులు ప్రారంభం

ఏఎస్‌రావునగర్: ఈసీఐఎల్‌లోని ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీసెస్ సెంటర్ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ కేటగిరీకి చెందిన యువతీ, యువకులకు ఉచిత డ్రోన్ శిక్షణ తరగతులను ఆ సంస్థ జనరల్ మేనేజర్ సుబ్రమణి ప్రారంభించారు. మేనేజర్ అబ్దుల్ ఖాదర్, నోడల్ అధికారి సురేష్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే నేరం

మేడ్చల్, న్యూస్‌టుడే: లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా నేరమని బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్రాజు సూచించారు. కండ్లకోయ పోలీస్ శిక్షణ కేంద్రంలోని ట్రైనీ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా క్రమశిక్షణ కలిగిన డిపార్ట్‌మెంట్‌లో వున్నాం కాబట్టి మనం తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.

మసకబారుతున్న జ్ఞాపకాలను కాపాడుకోవాలి

రాంనగర్, న్యూస్‌టుడే: మసకబారుతున్న జ్ఞాపకాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. అల్జీమర్స్ (మతిమరుపు) దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రామకృష్ణ మఠంలో మతిమరుపుపై బాలల సేవా విభాగంలో నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చిన్నారులకు పుస్తకాలు అందజేశారు.

సామాజిక సేవలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం

గాంధీనగర్: సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వక్తలు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు మంగళవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేశారు. గ్రంథాలయంలోని పుస్తకాల విభాగాలను సరిదిద్దారు. ఎన్ఎస్ఎస్ అధికారి నర్సింగ్‌గౌడ్ మాట్లాడారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా ప్రతిభకు సంబంధించిన వివరాలు, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, 2 ఫోటోలను దరఖాస్తుకు జతి చేసి వారి కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా ధ్రువీకరించి 25న జిల్లా యువజన, క్రీడా కార్యాలయం, జింఖానా గ్రౌండ్స్‌లో సమర్పించాలని కోరారు.

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్-2024 గోల్ఫ్‌టోర్నీ 26 నుంచి



టోర్నీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గోల్కొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో 26 తేదీ నుంచి తెలంగాణా గోల్కొండ మాస్టర్స్- 2024 గోల్ఫ్‌టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గోల్ఫ్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టోర్నీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జీఏ), ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ)ల ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నీలోని విజేతలకు రూ.కోటి బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నీలో టాటాస్టీల్ పీజీటీఐ ర్యాంగింగ్ లీడర్ అహ్లావత్, మను గండాస్, ఉదయన్ మానే, శౌర్యబిను, కరన్‌ప్రతాప్ సింగ్‌లతో పాటు అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీజీటీఐ సీఈవో ఉత్తమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

టమాటా ధరలకు రెక్కలు

స్థానికంగా దిగుబడులు లేక పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి

అల్వాల్, న్యూస్‌టుడే: టమాటా ధర తారెత్తిస్తోంది. బహిరంగా మార్కెట్లతో పాటు రైతుబజార్లలోనూ రోజు రోజుకు ధర ఎగబాకుతోంది. ధర తగ్గాలంటే ఇంకో నెల ఆగాల్సిందేనని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. పంట దిగుబడులు అక్టోబరు చివరి నాటికి వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో ధర నియంత్రణలో లేవని అంటున్నారు. మంగళవారం బహిరంగ మార్కెట్లో కిలో రూ.65కు చేరగా.. రైతుబజార్‌లో నాణ్యత కలిగినది రూ.50కు పైనే విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ సూచించే ధరలు గిట్టుబాటు కావడంలేదని రైతుబజార్‌లోని వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సూచించిన ధరకంటే అధికంగా అమ్మాల్సి వస్తుందని అంటున్నారు.



కొన్ని కూరగాయల ధరలు (కిలో..రూ.లలో)

కూరగాయ	రైతుబజార్	బహిరంగ మార్కెట్
టమాటా	రూ. 43	రూ. 65
వంకాయ	రూ. 35	రూ. 55-66
చిక్కుడు	రూ. 70	రూ. 125
దొండ	రూ. 40	రూ. 60
ఉల్లి	రూ. 54	రూ. 70

భారీ వర్షాల కారణంగా..

దిగుబడులు ఒక్కసారిగా పడిపోవడంతో టమాటా ధరలు పైపైకి ఎగబాగుతున్నాయి. దీంతో ప్రతి కూరలోనూ ఉపయోగించే టమాటాను కొనలేక వినియోగదారుడు బేజారెత్తిపోతున్నాడు. సాధారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కర్నూలు, మదనపల్లి నుంచి దిగుమతి అవుతుంది. బోయిన్‌పల్లి మార్కెటుకు చేరిన సరకును కొనుగోలు చేసి రైతుజబార్‌లో అమ్ముతారు. మేడ్చల్, గజ్వేల్ తదితర ప్రాతాల్లో కొంతమేర సాగు చేసినా మే నెలలో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. సెప్టెంబరు నాటికి దిగుబడులు వస్తాయని భావించగా.. పూత సమయంలో కురిసిన భారీ వర్షాలు పంట బాగా దెబ్బతింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో గతంలో మాదిరిగా దిగుమతి చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాలపై ఆధారపడటంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

ఇతర కూరగాయలదీ అదే పరిస్థితి

సాధారణంగా జూన్ చివరి నుంచి టమాటా ధరలు కొద్దిశాతంలో పెరగుతాయి. మే నెలలో రైతుబజార్‌లో రూ.20నుంచి రూ.30వరకు కిలో టమాటా పలికింది. జూన్, జులైలో రూ.50కి చేరుకుంది. ఆగస్టులో కొద్దిశాతంలో తగ్గి సెప్టెంబరు నాటికి సాధారణ ధర పలకవచ్చని అంచనా వేశారు. కానీ పదిహేను రోజుల నుంచి రూ.40నుంచి రూ.45 మధ్య పలుకుతుంది. ఇతర కూరగాయలదీ ఇదే పరిస్థితి. ఇప్పటికే వంకాయ, చిక్కుడు, దొండ, ఉల్లి, బీన్స్ ధరలు రూ.50కి పైనే ఉంటున్నాయి. బహిరంగ మార్కెట్లో మరింత అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు రూ.500 పట్టుకుని వచ్చినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడాన్ని నిరసిస్తూ ఉద్యమం

కాచిగూడ: తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరు తొలగించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని వాసవి ఆర్ట్ థియేటర్ ఛైర్మన్, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.నీలా శ్రీధర్ ప్రకటించారు. ఆర్యవైశ్య సంఘాల నేతృత్వంలో అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆయన పేరు తొలగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు.

ప్రశాంతంగా అఖిలభారత దైవసేవకుల ప్రార్థనలు


మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

గాంధీనగర్: గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చిలో మంగళవారం అఖిలభారత దైవసేవకుల కూడికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న హెబ్రోను శాఖలకు చెందిన దైవసేవకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. చర్చి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవసేవకులు వై.జాన్‌సుబ్బారెడ్డి, జోసెఫ్‌కురియన్‌ల పర్యవేక్షణలో ప్రార్థనలు జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ట్రస్టు, సొసైటీ ఐక్యతతో కూడికలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. దైవసేవకులు జేసీ రావు, ఇమ్మాన్యుయెల్, యేసు పాదం, జాన్ స్టీవర్ట్, పీటర్ ఫ్రాన్సిస్, పీటర్ రూబెన్, పీటర్ రాయ్, శామ్యూల్ జకరియా తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

మూసీ పరివాహక బాధితుల ఆందోళన

గోల్నాక, న్యూస్‌టుడే: మూసీ పరివాహక బాధితులకు అన్యాయం చేస్తే ఊరుకోమని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య హెచ్చరించారు. భారాస బాధితులకు అండగా నిలబడుతుందన్నారు. మంగళవారం న్యూ తులసీరామ్‌నగర్ లంకలో మూసీ పరివాహక బాధితులు, భారాస డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆందోళన చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మూడు దశాబ్దాల్లో పేదలు కష్టపడి భూమి కొనుక్కుని ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.


నినాదాలు చేస్తున్న లావణ్య, శ్రీనివాస్‌గౌడ్, నేతలు

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి

లాలాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు 30 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ తెలంగాణా రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐకాస ప్రతినిధులు విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేశారు. ఓయూలో ఆయన మంగళవారం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు తమ సమస్యలను వివరించారు.

మానవ కల్యాణానికి జైన సమాజం కృషి అభినందనీయం

కంటోన్మెంట్: జీవహింస చేయకుండా సమాజంలో ధర్మం, న్యాయం వర్ధిల్లాలన్న తమ గురువుల ప్రవచనాలను పాటించే జైన్ సమాజం మానవ కళ్యాణం కోసం కృషి చేస్తుండటం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతం సిఖ్‌రోడ్డులోని ఆదినాథ్ భవన్‌లో మంగళవారం జైన్ సమాజ్ ఉపవాస్ దీక్ష విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 31 రోజుల ఉపవాస దీక్షను పూర్తి చేసుకున్న బొల్లారానికి చెందిన 25 ఏళ్ల మహిమా జైన్‌ను సన్మానించి, ఆమెను అభినందించారు.

నిఘా నేత్రాలు.. నేరాలకు అడ్డుకట్ట

రాంనగర్, న్యూస్‌టుడే: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. ఎంత తెలివిగా చేసిన నేరానైనా క్షణాల్లో వెలుగులోకి తీసుకురావడంలో నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, ఆకతాయిల అల్లర్లకు అడ్డుకట్ట వేయడంలో అవి సత్ఫలితాలనిస్తున్నాయని పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు చాలా తగ్గాయని వారు పేర్కొన్నారు. నేను సైతం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని, దీంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. గతంలో చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరిగేవని.. నిఘా నేత్రాలను ఏర్పాటుచేసినప్పటి నుంచి 90 శాతం కేసులు తగ్గాయన్నారు.

- ★ ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఇళ్లు: 1.2 లక్షలు
- ★ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు: 264
- ★ చిక్కడపల్లి ఠాణా పరిధిలో నేను సైతం నిఘా నేత్రాలు: 12031
- ★ ముషీరాబాద్ ఠాణా పరిధి కమ్యూనిటీ సీసీ కెమెరాలు: 274
- ★ ముషీరాబాద్ ఠాణా పరిధి నేను సైతం కెమెరాలు: 7,144


సీసీ కెమెరాల దృశ్యాలు

ఇటీవల ఛేదించిన కేసులు

☛ ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. సీసీ పుటేజీలను పరిశీలించి రెండు రోజుల్లో కేసును ఛేదించారు. ☛ ఇద్దరు పాత నేరస్థులు పాన్‌షాపు దుకాణ యజమానిని తీవ్రంగా కొట్టారు. ఈ ఘటన సీసీ కెమెరాలో నమోదైంది. దీని ఆధారంగా నిందితులకు నెల రోజుల జైలు శిక్ష పడింది. ☛ వేగంగా కారు నడుపుతూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సీసీ పుటేజీలను పరిశీలించి.. అజాగ్రత్తగా కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం: రాంబాబు, ముషీరాబాద్ సీఐ



నేరాల నివారణకు నిఘా నేత్రాలు దోహదపడుతున్నాయి. సంఘ విద్రోహ శక్తుల కదలికను పసిగట్టడంలో అవి ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. బస్తీల్లో కూడా వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువస్తున్నారు. కమ్యూనిటీ సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తాం. వాటిని నిత్యం పరిశీలిస్తుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

నల్లకుంట, న్యూస్‌టుడే:

? కొద్దిపాటి వరం కురిసినా నల్లకుంట చౌరస్తాలో నీరు నిలుస్తోంది. రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. – భాస్కర్, నల్లకుంట

✓ చౌరస్తా ప్రాంతాన్ని పరిశీలిస్తాం. అక్కడి రోడ్డుపై నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటాం.– మనీషా, ఏఈ, జీహెచ్ఎంసీ

పశుపోషణ పథకం అమలుకు డిమాండ్


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు, సాగర్, శోభన్

గాంధీనగర్, న్యూస్‌టుడే: పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ పాల ఉత్పత్తిదారుల సంఘం, టీజీ విజయ డెయిరీ పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న ధర్నాచౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. పాడి రైతుల బిల్లులను 15 రోజులకొకసారి ఖాతాలో జమచేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లీటరుకు రూ.5 ప్రోత్సాహాన్ని అమలు చేయాలన్నారు. పశుపోషణ పథకాన్ని అమలు చేసి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నేతలు అరిబండి ప్రసాదరావు, మూడ్ శోభన్ పాల్గొన్నారు.

'మసకబారుతున్న జ్ఞాపకాలను కాపాడుకోండి'


విద్యార్థులతో హిప్నో పద్మాకమలాకర్

రాంనగర్, న్యూస్‌టుడే: మసకబారుతున్న జ్ఞాపకాలను కాపాడుకోల్సిన అవసరం ఉందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. అల్జీమర్స్ (మతిమరుపు) దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రామకృష్ణ మఠంలో మతిమరుపుపై బాలల సేవా విభాగంలో నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అల్జీమర్స్ వ్యాధి విద్యార్థుల్లో ఎక్కువవుతోందన్నారు. విద్యార్థులు పదే పదే ప్రశ్నలు అడగడం, సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం, సోమరితనం, ప్రశాంతమైన నిద్ర లేకపోవడం, డిప్రెషన్, ఆందోళన పెరుగుతోందన్నారు. ధ్యానం, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, పజిల్స్, మెదడును ఉత్తేజపరిచే పనులపై దృష్టి మళ్లించడంతో వ్యాధి పురోగతిని నిరోధిస్తాయన్నారు. ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలను అందజేశారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిత


ఎమ్మెల్యే వెంకటేష్‌కు పత్రిక అందజేస్తున్న విజయలక్ష్మి, నిజాముద్దీన్, సుమన్

కాచిగూడ: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆట, పాటల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 25న కాచిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానున్న పోటీలకు హాజరు కావాలని మంగళవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కార్యాలయంలో ఉప విద్యాధికారిణి విజయలక్ష్మి, డిప్యూటీ ఐఓఎస్‌లు నిజాముద్దీన్, సుమన్ తదితరులు ఆహ్వాన పత్రికను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. క్రీడా రంగంలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్: (మంగళవారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట 35, ఆలుగడ్డ 50, వంకాయ 50, బెండ 45, దొండ 50, దోసకాయ 40, కాకర 60, బీర 70, సోర 30, క్యాబేజి 45, క్యాప్సికం 50, బీన్స్ 80, క్యారెట్ 50, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 50, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 320, అల్లం 60.

భాగ్యనగరానికి, భాజపాకు అవినాభావ సంబంధం


బర్కత్‌పురలో సభ్యత్వం చేయిస్తున్న ఎన్.గౌతంరావు తదితరులు


ఎంసీహెచ్ కాలనీలో నాగభూషణంచారి, నేతలు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: భాగ్యనగరానికి, భాజపాకు అవినాభావ సంబంధముందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. పార్టీ ఆవిర్భావం, జనసంఘ్ నాటి నుంచి నగరంలో భాజపాను ఆదరించి ప్రాతినిధ్యం కల్పించడమే దీనికి నిదర్శనమన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ నగరంలో ప్రతి ఇంటికి వెళ్లి భాజపా సభ్యత్వం చేయించి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో ఓటేసిన ప్రతి ఒక్కరితో సభ్యత్వం చేయించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. భాజపా జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్, సురేష్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

అంబర్‌పేట: భాజపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పార్టీ అంబర్‌పేట అధ్యక్షుడు నాగభూషణంచారి కోరారు. మంగళవారం ఎంసీహెచ్ కాలనీలో నేతలు చందు, సత్యనారాయణ, వెంకటాచారి, రేఖ తదితరులతో కలిసి ఇంటింటికి వెళ్లి భాజపా సభ్యత్వ నమోదును చేయించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భాజపాలో చేరడానికి ముందుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సామాజికసేవలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం


విద్యార్థులతో గ్రంథాలయ సిబ్బంది

గాంధీనగర్, న్యూస్‌టుడే: సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వక్తలు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు మంగళవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేశారు. గ్రంథాలయంలోని పుస్తకాల విభాగాలను సరిదిద్దారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి నర్సింగ్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నగర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి కదిరవన్ ఆదేశాల మేరకు చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంతో పాటు 10 శాఖా గ్రంథాలయాల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు పల్లవి, పద్మజ, అన్నపూర్ణ, చంద్రకళ, సుబ్బలక్ష్మి, ప్రతిభారెడ్డి, శుక్లాదేవి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం


రాజా డీలక్స్ చౌరస్తాలో..


బాగ్ లింగంపల్లి ప్రాంతంలో..


ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి విద్యానగర్ వెళ్లే రోడ్డులో..

ముషీరాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై వరద ప్రవహించింది. ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముషీరాబాద్ చౌరస్తా, రాజా డీలక్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్, వీఎస్టీ చౌరస్తా, అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డు తదితర ప్రాంతాలతోపాటు ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోనూ భారీగా వరద చేరింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. దీంతో పాదచారులు అవస్థలు పడ్డారు. పలుచోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

రాంనగర్: లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి ముషీరాబాద్ వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఆర్టీసీ క్రాస్ రోడ్డు, అశోక్‌నగర్, ముషీరాబాద్ ప్రధాన రహదారి బాకారం, గోల్కొండ చౌరస్తా, వీఎస్‌టీ నుంచి విద్యానగర్ రహదారుల్లో భారీగా వరద చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. జీహెచ్ఎంసీ విపత్తు స్పందన దళం(డీఆర్ఎఫ్) వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ప్రేయర్ పవర్ చర్చి వద్ద, ఆశీర్వాద్ అపార్టుమెంట్, బాప్టిస్టు చర్చి, అంజయ్యనగర్, నాగమయ్యకుంట, బ్రహ్మంగారి వీధి, జాంబవినగర్ సమీపంలో మూడు అడుగుల మేర వరద చేరింది. స్థానికులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

విద్యానగర్: బాగ్ అంబర్‌పేట డివిజన్ వైభవ్‌నగర్ కాలనీలో రోడ్డుపై మోకాలు లోతు వరకు వాన నీరు నిలిచింది. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్-2024 గోల్ఫ్‌టోర్నీ 26 నుంచి

గోల్కొండ: హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో 26 తేదీ నుంచి తెలంగాణా గోల్కొండ మాస్టర్స్- 2024 గోల్ఫ్‌టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గోల్ఫ్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టోర్నీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జీఏ), ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ)ల ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నీలోని విజేతలకు రూ.కోటి బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నీలో టాటాస్టీల్ పీజీటీఐ ర్యాంగింగ్ లీటర్ అహ్లవత్, మను గండాస్, ఉదయన్ మానే, శౌర్యబిను, కరన్‌ప్రతాప్ సింగ్‌లతో పాటు అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీజీటీఐ సీఈవో ఉత్తమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చట


తిలక్‌నగర్ చౌరస్తా ప్రధాన రోడ్డులో..


శారదానగర్ ప్రధాన రోడ్డులో..

బాగ్‌అంబర్‌పేట డివిజన్ శారదానగర్ ప్రధాన రహదారి, తిలక్‌నగర్ చౌరస్తాలో మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేసిన నెల రోజులకే ధ్వంసమయ్యాయి. గుంతలు ఏర్పడి కంకర తేలింది. రాకపోకలకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గుంతల్లో అదుపు తప్పి పడిపోతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. –న్యూస్‌టుడే, విద్యానగర్

భావితరాలకు కూచిపూడి నృత్యం


పార్వతీశం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వెంకటాచలపతి. చిత్రంలో నృత్య గురువులు

బాగ్‌లింగంపల్లి: కూచిపూడి నృత్యాన్ని భావితరాలకు అందించాలని వక్తలు పేర్కొన్నారు. సుందరయ్య కళానిలయంలో కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం పార్వతీశం జయంతి నిర్వహించారు. ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డా.వేదాంతం వెంకటాచలపతి వక్తలతో కలిసి పార్వతీశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూచిపూడి నృత్య ప్రాచుర్యానికి పార్వతీశం సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. పురాతన కాలంలో పురుషులు మాత్రమే కూచిపూడి నృత్యం చేసేవారిని అన్నారు. ఆయన కృషి ఫలితంగా మహిళలు కూడా కూచిపూడిలో రాణిస్తున్నారన్నారు. అనంతరం నృత్య గురువులను సత్కరించారు. రచయిత భూపతి వెంకటేశ్వర్లు, ఏలేశ్వరం చలపతి శాస్త్రి, మృత్యుంజయ శర్మ, సత్యప్రసాద్, సేతురాం, రమణసిద్ధి, రామలింగేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడ అభివృద్ధి అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ క్రీడ ప్రతిభకు సంబంధించిన వివరాలు, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, 2 ఫొటోలను దరఖాస్తుకు జత చేసి వారి కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా ధ్రువీకరించి 25న జిల్లా యువజన, క్రీడా కార్యాలయం, జింఖానా గ్రౌండ్స్‌లో సమర్పించాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఎస్ రవి 9293312848, శ్రీనివాస్ మూర్తి 9985348889 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ: ఆటో డ్రైవరు సెల్‌ఫోన్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా భిక్నూర్‌కు చెందిన షేక్ దావూద్ గుంతకల్లు-బోధన్ ప్యాసింజర్ రైలులో ఈ నెల 6న ప్రయాణించాడు. రైలు సీతాఫల్‌మండి స్టేషన్ వద్ద ఉండగా అతని సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఫోన్ ద్వారా అతని బ్యాంకు ఖాతాలోని రూ.25 వేల నగదును ఆగంతుకుడు కాజేశాడు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డ్రోన్ శిక్షణ తరగతులు ప్రారంభం

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: ఈసీఐఎల్‌లోని ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీసెస్ సెంటర్ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ కేటగిరీకి చెందిన యువతీ, యువకులకు ఉచిత డ్రోన్ శిక్షణ తరగతులను ఆ సంస్థ జనరల్ మేనేజర్ సుబ్రమణి ప్రారంభించారు. మేనేజర్ అబ్దుల్ ఖాదర్, నోడల్ అధికారి సురేష్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణం.. పరిసరాలు అపరిశుభ్రం

ముషీరాబాద్, న్యూస్‌టుడే: భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లోని జీహెచ్ఎంసీ సామాజిక భవనం అసంపూర్తి పనులతో నిరుపయోగంగా మారింది. కొన్నేళ్లుగా భవనం పూర్తికాకపోవడంతో పేదలు రోడ్లపైనే టెంట్లు వేసుకొని ఫంక్షన్స్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి పలుచోట్ల నెలకొంది.

2020లో శంకుస్థాపన.. పూర్తికాని వైనం..

ఇందిరానగర్‌లో అధిక శాతం పేదలు నివసిస్తున్నారు. గతంలో ఇందిరానగర్ మొదటి వెంచర్‌లోని సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. స్థానికుల విజ్ఞప్తి మేరకు శిథిల భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.19.10 లక్షలు మంజూరు కావడంతో 2020లో అప్పటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిల్లర్లు వేసి, శ్లాబు నిర్మించారు. విద్యుత్తు, ఫ్లోరింగ్, రంగులు తదితర పనులు చేయాల్సి ఉంది. కొంత కాలంగా మిగిలిన పనులు చేపట్టకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది.


ఇందిరానగర్‌లో పూర్తికాని సామాజిక భవనం


ప్రమాదకరంగా ప్రహరీ, పక్కన వ్యర్థాలు

ఆకతాయిలకు అడ్డాగా..

అసంపూర్తి సామాజిక భవనంలో నిర్వహణ కరవైంది. ప్రహరీ కూలి ప్రమాదకరంగా మారింది. గేటు ధ్వంసమైంది. భవన ప్రాంగణం అధ్వానంగా మారింది. ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఖాళీ స్థలంలో ఒకవైపు జీహెచ్ఎంసీ చెత్తరిక్షాలు.. మరోవైపు కొందరు స్క్రాప్ నిల్వ చేశారు. సమీపంలో చెత్త, చెదారం పేరుకుపోయింది.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడాన్ని నిరసిస్తూ ఉద్యమం


మాట్లాడుతున్న నీలా శ్రీధర్

కాచిగూడ, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరు తొలగించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని వాసవి ఆర్ట్ థియేటర్ ఛైర్మన్, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.నీలా శ్రీధర్ ప్రకటించారు. ఆర్యవైశ్య సంఘాల నేతృత్వంలో అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆయన పేరు తొలగిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'హైడ్రాతో పేదల ఇళ్లు నేలమట్టం చేయడం సరికాదు'

నల్లకుంట, న్యూస్‌టుడే: పేద, మధ్య పేదల నివాసాలను అక్రమ నిర్మాణాలంటూ హైడ్రా నేలమట్టం చేయడం సరికాదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువులు, కుంటల స్థలాలను అధికారులు ఎలా రిజిస్ట్రేషన్ చేశారని ప్రశ్నించారు.

ఉప్పల్
•ఉప్పల్ •మేడ్చల్

చెంగిచర్ల అభివృద్ధికి అండగా ఉంటా


చెంగిచర్లలో పర్యటిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

చెంగిచర్ల (బోడుప్పల్), న్యూస్‌టుడే : చెంగిచర్ల అభివృద్ధికి అండగా ఉంటానని బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం 1వ డివిజన్ కార్పొరేటర్ జంగయ్యయాదవ్‌తో కలిసి చెంగిచర్లలో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెంగిచర్ల ప్రగతికి నిధులు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.కిషోర్ గౌడ్, మున్సిపల్ అధికారులు సిబ్బంది ఉన్నారు. ● బోడుప్పల్‌లో తడి, పొడి, హానికారక చెత్తపై 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమ, మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రజాహితం, సంక్షేమానికే ప్రాధాన్యమివ్వాలి: సీపీ


శిక్షణ ఎస్సైల సమావేశంలో సుధీర్‌బాబు

కాప్రా, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రజాహితం, సంక్షేమాలకే ప్రాధాన్యమివ్వాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం రాచకొండ కమిషనరేట్‌లో కొత్తగా విధుల్లో చేరిన శిక్షణ ఎస్సైలతో ఆయన సమావేశమయ్యారు. సీపీ మాట్లాడుతూ.. సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు సత్వరన్యాయాన్ని అందించే సాధనం పోలీసు ఉద్యోగమన్నారు. ఇది గొప్ప అవకాశంగా భావించి పోలీసు వ్యవస్థకు వన్నె తెవాలని ఉద్బోదించారు. అడ్మిన్ డీసీపీ ఇందిర, ఏసీపీలు నరేందర్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

పోలీస్ అకాడమి ఛైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే


అమిత్ గర్గ్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మల్లయ్య

కాప్రా, న్యూస్‌టుడే: సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమి డైరెక్టర్‌గా నియమితులైన అమిత్ గర్గ్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సాయిబాబా ఆలయం ఛైర్మన్ మల్లయ్య మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు



జవహర్‌నగర్, న్యూస్‌టుడే : జవహర్‌నగర్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ చొరవతో కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 82 మంది పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం జవహర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కార్మికులకు అవసరమైన వైద్య సేవలు చేసి మందులు అందించినట్లు తెలిపారు. వైద్యాధికారి డా. సుప్ర, పలువురు వైద్య సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప పాల్గొన్నారు.

శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించి

మహిళలు స్వశక్తితో ఎదిగేలా చేస్తోన్న వనిత జీవన సేవా సంస్థ


మాజీ స్పీకర్ మధుసూదన చారి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్‌చారి అవార్డు నుంచి స్వీకరిస్తున్న సుభాషిణి


కుట్టుమిషన్ శిక్షణలో మహిళలు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: మహిళలు ఓ వైపు గృహిణులుగా కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే మరోవైపు తమకు ఆసక్తి ఉన్న టైలరింగ్ నేర్చుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. టైలరింగ్ నేర్చుకొని సొంతంగా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంటే ఆర్థికంగా నిలబడవచ్చని సగటు మధ్యతరగతి మహిళల ఆలోచన. ఇలాంటి ఆలోచనకే చేయూతనిచ్చిందే వనిత జీవన సేవా సంస్థ. ఆర్థిక స్వాలంబన వైపు అడుగులు వేస్తూ.. స్వశక్తితో ఎదిగేలా కృషి చేస్తోంది. సంస్థ నిర్వాహకురాలైన ఆకుల సుభాషిణి(65). సంస్థ ద్వారా కుట్టుమిషన్ రంగంలో ఉచిత శిక్షణనిస్తూ.. స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తుంది. హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్లలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. అరవై ఐదేళ్ల వయసులో అదే ఉత్సాహంతో శిక్షణనివ్వడం విశేషం.

సేవలకు ఉత్తమ సామాజికవేత్త అవార్డు..

సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు మక్స్ ఫౌండేషన్ సంస్థ 2024లో రవీంద్రభారతిలో "ఉత్తమ సామాజిక వేత్త" అవార్డు మాజీ స్పీకర్ మధుసూదనచారి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ చారి కలిసి సుభాషిణికి అందజేశారు.

స్వశక్తితో ఎదిగేలా కృషి

రామంతాపూర్‌కు చెందిన ఆకుల సుభాషిణి(65) తల్లి విద్యానగర్‌లో అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిని చూసేందుకు వెళ్లడానికి తనవద్ద డబ్బులు లేవు. తన భర్త వెంకటేశ్వర్లు డ్రైవర్ కావడంతో అతని వద్ద డబ్బులు లేవు. తెలిసిన వారి నుంచి డబ్బులు అప్పుగా తీసుకుని అతికష్టంతో అంతిమ సంస్కారానికి వెళ్లిన ఘటనను గుర్తుచేసుకుంది. మహిళలు స్వశక్తితో ఎదిగేలా కృషి చేయాలని ఆలోచించింది. తన ఆలోచనకు కార్యరూపమే వనిత జీవనసేవా సంస్థ.

2500మందికి ఉచిత టైలరింగ్ శిక్షణ..

వనిత జీవన సేవా సంస్థను సుభాషిణి 2000 సంవత్సరంలో ఏర్పాటు చేసింది. 24ఏళ్ల నుంచి 2500మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను అందించి సొంతంగా టైలరింగ్ దుకాణాలను ఏర్పాటు చేసేలా కృషి చేసింది. ఎంబ్రాయిడరీ, మగ్గం వర్కులకు శిక్షణ నిచ్చింది. ఏటా మహిళా దినోత్సవం నాడు సేవ చేసిన మహిళలకు అవార్డులు, శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ప్రశంసాపత్రాలను అందజేసింది.

నాభర్త సహకారం మరువలేనిది: ఆకుల సుభాషిణి



మహిళలందరూ స్వశక్తితో ఎదగాలనేది నా ఆకాంక్ష. మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా ఎదగాలి. ఉద్యోగం లేదని బాధపడకుండా టైలరింగ్ నేర్చుకొని సొంతంగా టైలర్ షాపు పెట్టుకొని ఆనందంగా జీవించవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో టైలరింగ్‌కు మంచి ఆదరణ ఉంది. టైలరింగ్ నేర్చుకుంటే మహిళలకు ఎంతో బాగు. నేను నా సొంత డబ్బులతో శిక్షణ కార్యక్రమాలు చేస్తున్నాను. అందుకు నాభర్త సహకారం మరువలేనిది.

నిధులలేమితో స్థానిక సంస్థలు సతమతం: ఎంపీ


కౌన్సిల్ సమావేశంలో ఈటల రాజేందర్, ఛైర్‌పర్సన్ దీపికారెడ్డి తదితరులు

మేడ్చల్‌రూరల్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు నిధులలేమితో సతమతమవుతున్నాయని తద్వారా అభివృద్ధి కుంటుపడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నిర్వహించిన మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. అంతకుముందు కౌన్సిల్ సభ్యులు మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్లపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఛైర్‌పర్సన్ దీపికారెడ్డి, వైస్ ఛైర్మన్ రమేష్, కమిషనర్ నాగిరెడ్డి కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తాం.. నివాసాల్లో ఉండండి


రాంపల్లిలో రెండు పడకల గదులను పరిశీలిస్తున్న ఛైర్మన్, కమిషనర్

నాగారం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నిర్మించిన రెండు పడక ఇళ్లలో లబ్ధిదారులు ఉండాలని తాము వసతులు కల్పిస్తామని పట్టణ కమిషనర్ రాజేంద్రకుమార్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం కలెక్టర్‌తో కమిషనర్ సమావేశం నిర్వహించారని రెండు పడక ఇళ్లను పరిశీలించి వారికి వసతులు కల్పించే ఏర్పాట్లు చేయాలని సూచించడంతో మంగళవారం కమిషనర్, ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి రాంపల్లిలోని రెండు పడక ఇళ్లను పరిశీలించారు. వైస్ ఛైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రాము, జేఏసీఎస్ డీఈలు పాల్గొన్నారు.

డ్రోన్ శిక్షణ తరగతులు ప్రారంభం



విద్యార్థులతో సంస్థ జనరల్ మేనేజర్ సుభమణి

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: ఈసీఐఎల్‌లోని ఎన్‌ఎస్‌ఐసీ టెక్నికల్ సర్వీస్ సెంటర్ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ కేటగిరికి చెందిన యువతీ, యువకులకు ఉచిత డ్రోన్ శిక్షణ తరగతులను ఆ సంస్థ జనరల్ మేనేజర్ సుభమణి ప్రారంభించారు. మేనేజర్ అబ్దుల్ ఖాదర్, నోడల్ అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల సమస్యలు పరిష్కరించాలని వినతి

హబ్సిగూడ, న్యూస్‌టుడే: ముదిరాజుల సమస్యలను పరిష్కరించాలని గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి దీపాదాస్ మున్షీకి ముదిరాజ్ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. రామంతాపూర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.


ఏఐసీసీ కార్యదర్శి దీపాదాస్ మున్షీకి వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే నేరం


మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

మేడ్చల్, న్యూస్‌టుడే: లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా నేరమని జీడిమెట్ల టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు సూచించారు. కండ్లకోయ పోలీస్ శిక్షణ కేంద్రంలోని ట్రైనీ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ కలిగిన డిపార్ట్‌మెంట్‌లో వున్నాం కాబట్టి మనం తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వరబాబు, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి రాక ఏర్పాట్లు ముమ్మరం చేయండి: కలెక్టర్


సమీక్షలో కలెక్టర్, అధికారులు

మేడ్చల్ కలెక్టరేట్: నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయంలో ఈ నెల 28న జరిగే 21వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్నందున ఏర్పాట్లు ముమ్మరం చేయాలని కలెక్టర్ గౌతమ్ పోట్రు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి సంబంధిత అధికారులతో రాష్ట్రపతి రాక ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

మేడ్చల్ కలెక్టరేట్: జిల్లాలో మాతా శిశు మరణాలను నివారించేదుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది శ్రమించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికాగుప్తా కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వైద్యా ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం


ఉప్పల్ బస్టాప్ వద్ద ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

ఉప్పల్:జాతీయ సేవా పథక(ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాలంటీర్లు పలు సేవా కార్యక్రమాలు చేశారు. మంగళవారం ఉప్పల్ బస్టాండు ప్రయాణ ప్రాంగణంలో స్వచ్ఛతయే సేవ అనే స్వచ్ఛత, పరిశుభ్రతతో పాటు మొక్కలను నాటారు.

మేడ్చల్: మైసమ్మగూడలో సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు 'స్వచ్ఛతా హీ సేవా 2024' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘట్‌కేసర్: సమాజ సేవతో గ్రామంలో ఉన్న సమస్యలను రూపుమాపటంలో ఎస్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని అనురాగ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. అర్చనామంత్రి అన్నారు. మంగవారం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, కో ఆర్డినేటర్లు, అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

ఘట్‌కేసర్, బోడుప్పల్, నాచారం, నాగారం, మేడ్చల్, న్యూస్‌టుడే

? ఇస్మాయిల్‌ఖాన్‌గూడ సాయినగర్ కాలనీలో ఎలక్ట్రిక్ స్తంభానికి (ఎంసీపీ01/121) ఉన్న విద్యుత్తు దీపాలు రాత్రి వేళ వెలగడం లేదు. –విష్ణు, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ

● సమస్య మా దృష్టికి రాలేదు. సిబ్బందితో వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -బోయపల్లి కొండల్‌రెడ్డి, ఛైర్మన్ పోచారం మున్సిపాలిటీ

? చిన్నపాటి వర్షం కురిసినా విహారికా కాలనీలోకి వరదనీరు వస్తోంది. -సత్యప్రసాద్, విహారికా కాలనీ, మేడిపల్లి

● సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. –త్రిల్లేశ్వర్‌రావు, కమిషనర్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థ

? నాచారం భవానీనగర్ వీధి నం.3 నుంచి పటేల్‌కుంట వరదనాలా వరకు వర్షపునీరు సాఫీగా వెళ్ళేందుకు ప్రత్యేక డ్రైనేజీ లైను ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్ మూతలపై ఉన్న రంధ్రాలను పూడ్చివేయడంతో వరద రోడ్డుపైనే పారుతోంది. పట్టణ ప్రణాళిక అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. –ముద్దసాని రాంరెడ్డి, భవానీనగర్

● మ్యాన్‌హోల్ మూతలపై రంధ్రాలను పూడ్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. –అశ్విని, న్యాక్ ఇంజినీర్, నాచారం

? రాంపల్లి సిగ్నల్ నుంచి ఘట్‌కేసర్ వెళ్లే మార్గంలో సత్యనారాయణ కాలనీ ప్రధాన దారిపై వర్షాలకు నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. – సాగర్, నేతాజీనగర్

● గుంతల్లో నిలిచిన నీటిని తొలగించి సమస్య పరిష్కరిస్తాం. – రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగారంపుర

? పట్టణ ప్రధాన రహదారులకు ఇరు పక్కల వ్యాపారులు ప్రకటనల బోర్డులను రోడ్డు మధ్య వరకు పెట్టడంతో ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. – నర్సింలు, ఆర్‌ఎల్‌నగర్

● ట్రాఫిక్ పోలీసులు, టీపీవో అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగారంపుర

? గౌడవెల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి రైల్వే స్టేషన్ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. – సుధాకర్, గౌడవెల్లి

● వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. – స్వామి, కమిషనర్, గుండ్లపోచంపల్లి

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

కీసర: పని మీద ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. అహ్మద్‌గూడలో నివసించే సురమ్ హేమంత్‌కుమార్ మంగళవారం భార్య లతకు పని మీద వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. కొన్ని గంటల తర్వాత పిల్లలు, తన తల్లిని బాగా చూసుకోవాలని సెల్‌ఫోన్‌కు సందేశం పంపాడు. కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విలువైన వాహనాలు.. నిరుపయోగం



పోచారం పురపాలక సంఘంలో 2011లో రూ. లక్షలతో కొనుగోలు చేసిన వాహనాలు, రిక్షాలు మూలనపడటంతో పారిశుద్ధ్య పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వార్డుల్లో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా సాగడంలేదు. మరమ్మతులకు ఎక్కువ డబ్బులు ఖర్చవుతుండటంతో కొత్త వాటిని కొనుగోలు చేస్తామంటూ అధికారులు పాతవాటిని పట్టించుకోవడం లేదు. –న్యూస్‌టుడే, పోచారం(ఘట్‌కేసర్)

విరిగిపడిన విద్యుత్తు స్తంభం.. అంధకారంలో నూతన్‌కల్


రహదారిపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

మేడ్చల్‌రూరల్, న్యూస్‌టుడే: మేడ్చల్ మండలం నూతనకల్‌లో మంగళవారం సాయంత్రం విద్యుత్తు స్తంభం విరిగిపడింది. దీంతో గ్రామం పూర్తిగా అంధకారమైంది. మరమ్మతులు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రమాదం సంభవిస్తే రాత్రి 8 దాటిన విద్యుత్తు సిబ్బంది అక్కడికి చేరుకోలేదన్నారు.

జోరు వర్షం.. రహదారులు జలమయం


బోడుప్పల్ కాలనీలో ..


నాచారం: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ..


రామంతాపూర్ చర్చికాలనీలో నిలిచిన నీరు


ఉప్పల్ కూడలిలో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న సీపీ సుధీర్‌బాబు

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

(శామీర్‌పేట): మద్యం మత్తులో ఓ ఆటో డ్రైవర్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడకు చెందిన రాయిమల్లేశ్(48) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. రోజూ మద్యం తాగుతూ ఇంట్లో గొడవలకు దిగేవాడు. రోజు మాదిరిగానే తాగి వచ్చి కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగాడు. ఇంట్లో అందరు నిద్రించగానే ఓగదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం

శామీర్‌పేట, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలం కేంద్రానికి చెందిన బందెల జ్యోతి-రాజు దంపతుల పెద్ద కుమారుడు ఉమేశ్‌చంద్ర(22). కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి తన గదిలోనే పడుకొనొ మరుసటి రోజు ఉదయం 10గంటలకు తన కుమారుడు నిద్ర లేవకపోవటంతో మృతుని తల్లి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శామీర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫినాయిల్ అమ్మేందుకు వచ్చి వృద్ధురాలి నగలు చోరీ

శామీర్‌పేట: ఓ ఇంటిని అద్దెకు ఇప్పించి సహకరించిన వృద్ధురాలి నగలు చోరీ చేసుకుపోయారు. మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడ గ్రామానికి గుర్తు తెలియని భార్యాభర్తలు తమ పిల్లలతో కలిసి ఫినాయిల్ విక్రయించుకునేందుకు ఐదు రోజుల క్రితం వలసొచ్చారు. కొత్తవారికి ఇళ్లు ఏవరు అద్దెకు ఇవ్వరని చిన్నపిల్లలతో బ్రతుకు దెరువుకు వచ్చారని ఆ గ్రామానికి చెందిన చెవ్వ రాములమ్మ(68) తన ఇంటి పక్క వారితో మాట్లాడి ఇంటిని అద్దెకు ఇప్పించింది. భర్త మృతిచెండటంతో రాములమ్మ ఒంటరిగా ఉంటుంది. అద్దెకు దిగిన ఆ భార్యాభర్తలు రాములమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలు, వెండి కాళ్ల పట్టీలు కాజేసేందుకు పథకం వేశారు. సోమవారం రాత్రి తన కుమారుడి పుట్టిన రోజు ఉన్నందున కేక్ కట్ చేసేందుకు వృద్ధురాలిని రమ్మన్నారు. ఇంట్లోకి వెళ్లిన రాములమ్మకు మద్యం ఫ్రూట్ తాగించారు. మత్తులోకి జారుకోగానే అరవకుండ నోట్లో గుడ్డలు కుక్కి ఆమె మెడలోంచి 7 తులాల బంగారం, 30 తులాల వెండి నగలు తీసుకునేందుకు ప్రయత్నించారు. రాకపోవటంతో బలంగా లాగారు. గొంతునొక్కడంతో వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి చేరింది. చనిపోయిందని భావించిన వారు నగలు అపహరించుకుని పోయారు. కొంత సమయానికి స్పృహలోకి వచ్చిన ఆమె కిటికి నుంచి కేకలు వేయటంతో సంబంధికులు, స్థానికులు గుర్తించి గాయపడిన వృద్ధురాలుని సిద్దిపేట జిల్లా ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, పేట్‌బషిరాబాద్ ఏసీపీ రాములు పరిశీలించారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైటెన్షన్ వైర్లు తగిలి యువకుడి మృతి

మేడ్చల్: ప్రమాదవశాత్తు విద్యుత్తు హై టెన్షన్ వైర్లు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. నూతన్‌కల్‌లో నివసించే తాళ్లపల్లి సురేందర్ పెద్ద కొడుకు వినీత్‌గుప్తా(18). మంగళవారం ఇంటిపై నుంచి ఇనుప రాడ్డు దింపే క్రమంలో రాడ్డు ఇంటి గోడలకు అనుకొని ఉన్న హైటెన్షన్ విద్యుత్తు వైర్లకు తగిలింది. షార్ట్ సర్క్యూట్‌తో కావడంతో భవనంపైనుంచి కిందపడ్డాడు. వెంటనే సీపీఆర్ చేసి మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం

వర్షంతో జాగ్రత్తగా ఉండాలి

ఘట్‌కేసర్ : భారీ వర్షాలకు పురపాలక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లిపావని యాదవ్ పేర్కొన్నారు. విద్యుత్తు స్తంభాలకు, శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లకు దూరంగా ఉండాలన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పేర్కొన్నారు. మంగళవారం మూడోవార్డులో రూ.5లక్షలతో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను స్థానిక కౌన్సిలర్ బొక్కా సంగీతారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి ప్రారంభించారు.

రైతు సంఘం మాజీ ఎండీపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల రైతు సంఘం మాజీ మేనేజింగ్ డైరెక్టర్ మజ్జిగ కరుణాకర్ అవినీతికి పాల్పడ్డారని అతనిపై చర్యలు తీసుకోవాలని సంఘం డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్‌కు మంగళవారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

హబ్సిగూడ: రామంతాపూర్ మార్కెట్ గల్లీలో అక్రమ నిర్మాణాలను ఉప్పల్ టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. రోడ్లను ఆక్రమించుకుని దుకాణాలను, షెడ్లను ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవని ఉప్పల్ ఉపకమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందనలు

నాచారం: మేడ్చల్ జిల్లా ఖోఖో పోటీలకు మల్లాపూర్ మోడ్రన్ స్కూల్‌కు చెందిన 12మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ ముత్యంరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో క్రీడాకారులను ఆయన సత్కరించారు.

367 కుక్కలకు టీకా

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక టీకా కార్యక్రమంలో 367 కుక్కలకు టీకా వేసినట్లు కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని ఛైర్ పర్సన్ దీపిక రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పెంపుడు జంతువులకు తప్పకుండా టీకా వేయించాలన్నారు.

సాయం పొందిన వారి దృష్టిలో దైవంగా నిలిచేది సేవ మాత్రమే..

మేడ్చల్, న్యూస్‌టుడే: సమాజంలో నలుగురికి మనల్ని ఆదర్శంగా చూపించేది సాయం పొందిన వారి దృష్టిలో దైవంగా నిలిపేది సేవ మాత్రమేనని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కండ్లకోయ సీఎమ్మార్ ఐటీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు జాతీయ సేవా దినోత్సవంలో భాగంగా 'స్వచ్ఛతా హీ సేవ' పేరుతో నగరంలోని స్టేట్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలను క్రమబద్ధీకరించి, ఆవరణలో చెత్తచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

జాతీయ రహదారులు అభివృద్ధి చేయండి



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఈనాడు, దిల్లీ: తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 4 రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కోరారు. మంగళవారం దిల్లీలో ఆయన్ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలోని 7 రహదారుల మరమ్మతులకు కేంద్ర రహదారుల మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి రూ.315 కోట్లు విడుదల చేయాలని కోరారు. స్పీకర్ వెంట పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఉన్నారు.

టీవీ ఛానల్ యజమాని ఇంట్లో ఐటీ సోదాలు

మూసాపేట, న్యూస్‌టుడే: బీఆర్‌ఎస్ న్యూస్ ఛానల్ అధినేత, వ్యాపారవేత్త, తెదేపా నేత బొల్లా రామకృష్ణ నివాసంలో ఐటీ అధికారులు మంగళవారం సోదాలు జరిపారు. మూసాపేట రెయిన్‌బో విస్టాస్ రాక్‌గార్డెన్స్ గేటెడ్ సముదాయం ఎ బ్లాకులోని 101లో రామకృష్ణ కుటుంబం నివసిస్తోంది. ఆయన న్యూస్‌ఛానెల్‌తోపాటు ఆసుపత్రి, స్థిరాస్తి సంస్థ వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కాగా భారీగా ఆస్తులు ఉన్నప్పటికీ ఆదాయపన్ను చెల్లించడం లేదనే ఆరోపణలతో మంగళవారం తెల్లవారుజామున మూడు వాహనాల్లో 8 మంది ఐటీ అధికారులు రామకృష్ణ ఇంటికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు చేసి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. రామకృష్ణ సమీప బంధువైన ఇదే కాలనీలోని ఏ బ్లాక్ 407లో ఉంటున్న గట్టు రాజేశ్ ఇంట్లో కూడా సోదాలు జరిగాయి.

జాతీయ లోక్ అదాలత్ 28న

ఈనాడు, హైదరాబాద్: ఈనెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల్ని పరిష్కరించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. కేసుల పరిష్కారం ద్వారా సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాల్లో క్రిమినల్ కేసులు, వివాదాలకు సంబంధించి పెండింగ్ కేసుల్ని సామరస్యంగా పరిష్కరిస్తారని వివరించారు.

సమకాలీన రాజకీయాల్లో ఆదర్శప్రాయుడు ఏచూరి



మాట్లాడుతున్న బి.మహేశ్‌కుమార్‌గౌడ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: సమకాలీన రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని, ఆయన లేని లోటు తీర్చలేనిదని వక్తలన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. పార్టీ సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ అధ్యక్షతన జరిగిన సభలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏచూరి సామాన్య కార్యకర్త స్థాయి నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జి.నర్సింహారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, వనజ, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నగరవ్యాప్తంగా స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ



విధానాన్ని పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: నగర నీటి సరఫరాలో స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీని విస్తృతం చేసేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. సనత్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆటోమేటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతి (స్మార్ట్ వాల్వ్ సాంకేతికత) సత్ఫలితాలను ఇస్తుండటంతో నగరంలో అనేక చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం సనత్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన వాల్వ్‌ను పరిశీలించారు. పనితీరు, నిర్వహణ, తదితర అంశాలను క్షేత్రస్థాయి లైన్‌మెన్లను అడిగి తెలుసుకున్నారు.

మాన్యువల్‌గా ఇబ్బంది.. నీటి సరఫరాలో వేలాది వాల్వుల నిర్వహణ తప్పనిసరి. 1000-2000 నివాస భవనాలకు సుమారు 30 వాల్వులు ఏర్పాటు చేశారు. సరఫరా ప్రారంభం, నిలిపివేయడానికి లైన్‌మెన్లు ప్రతి వాల్వ్‌ను పరిశీలించాలి. వాల్వుల గుంతలో రోడ్లకు పక్కగా ఏర్పాటుచేయగా, విస్తరణలో భాగంగా నేడు రోడ్లపైకి వచ్చాయి. వాల్వుల వద్ద పనిచేస్తున్న పలు పుర లైన్‌మెన్లు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో ప్రయోగాత్మకంగా సనత్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. దీని పనితీరుని సమగ్రంగా నిర్వహించడం, నీటి నాణ్యత, ఫ్లోరిన్ శాతం, సరఫరా లోపాలను గుర్తించడానికి ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆ వాల్వులు సెన్సార్లను కలిగి ఉండటంతో లైన్‌మెన్, సంబంధిత అధికారుల మొబైల్‌కు అనుసంధానించి సరఫరాను నిత్యం గమనించొచ్చు. సౌరశక్తితో పనిచేస్తుండటం, బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో నిర్వహణలో విద్యుత్తు సరఫరా సమస్యలుండవు. ఎండీ అశోక్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించారు. సీవరేజ్ నెట్‌వర్క్, పైపులైనును పరిశీలించారు.

యూట్యూబర్ హర్షసాయిపై అత్యాచారం కేసు



నార్సింగి, న్యూస్‌టుడే: యూట్యూబర్ హర్షసాయిపై అత్యాచారం కేసు నమోదైంది. తనపై అత్యాచారం చేశాడని, నగ్నచిత్రాలు సేకరించి బ్లాక్‌మెయిల్ చేశాడని సినీ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. సినిమాల్లో అవకాశాల కోసం ముంబయికి చెందిన యువతి కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చింది. ఒక రియాల్టీ షోలో పాల్గొంది. ఒక ప్రైవేటు పార్టీలో కలిసి స్నేహంగా ఉంటూ పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారం చేసినట్లు, పెద్ద మొత్తంలో డబ్బు తీసుకున్నట్లు యువతి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. యువతిని పోలీసులు కొండాపూర్‌లోని ప్రాంతీయ ఆసుపత్రికి వైద్యపరీక్షల నిమిత్తం తరలించారు. హర్షసాయి తండ్రిపైనా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విశాఖకు చెందిన హర్షసాయి పేదలకు ఆర్థిక సాయం చేస్తూ వీడియోలు తన ఛానెల్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఇతను హీరోగా బాధిత యువతి హీరోయిన్‌గా గతంలో ఒక సినిమాను ప్రారంభించారు.

ప్రతి చెట్టు.. లెక్క తేలేట్టు..



షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం నుంచి కేబీఆర్ పార్కు వరకు పైవంతెన నిర్మాణానికి సర్వే జరుగుతోంది. అందుకు ఆ మార్గంలో డివైడర్లలో చెట్లు ఎన్ని ఉన్నాయో తెలిసేలా మార్కింగ్ వేశారిలా

కూడలి.. వాహనం నెమ్మదిగా కదిలి..



సైబర్ టవర్స్ నుంచి కొత్తగూడ వైపు, బయోడైవర్సిటీ వైపు నుంచి వస్తున్న వాహనాల రద్దీ కారణంగా రహేజా మైండ్ స్పేస్ కూడలిలో బారులు తీరాయి. నెమ్మదిగా కదులుతూ కనిపించాయి

ప్రసాదం పసందేనా?

ఈనాడు, హైదరాబాద్

ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతపై ఇచ్చే బోగ్(బ్లిస్‌ఫుల్ హైజెనిక్ ఆఫరింగ్ టు గాడ్) పత్రాల జారీని జీహెచ్ఎంసీ నిలిపివేసింది. ఏడాది క్రితం ఫిబ్రవరిలో 10 ఆలయాలకు ఫుడ్ లైసెన్సులు, 8 దేవాలయాలకు బోగ్ పత్రాలు జారీ చేయగా ఇతర దేవాలయాలను పరిశీలించకపోవడం గమనార్హం. తిరుపతి లడ్డూ ప్రసాదం అంశం తెరపైకి రావడంతో నగరంలోని ఆలయాల్లో ప్రసాదాల పంపిణీపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లడ్డూ ప్రసాదం



పులిహోర

పరీక్షించడం ఇలా..

తొలిదశలో భక్తులు అధికంగా వచ్చే దేవాలయాలను గుర్తించాలి. నీటి, సరకుల నాణ్యత, స్టోరేజీ, వంటగదిలో పరిశుభ్రతపై సూచనలివ్వాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి రిజిస్టర్ అయిన సంస్థల ద్వారా ప్రసాదం తయారు చేసే ఆలయ సిబ్బందికి ఫాస్ట్రాక్ శిక్షణ అందించాలి. అనంతరం ఫుడ్ లైసెన్సులు జారీ చేసి, రిపోర్టుల ఆధారంగా బోగ్ పత్రాలు జారీ చేయాలి. గ్రేటర్‌లో 1500కుపైగా ఆలయాలున్నాయి. రద్దీ అధికంగా ఉండేవి 100 వరకు ఉండగా కేవలం 8 ఆలయాల్లో బోగ్ పత్రాలు జారీ అయ్యాయి.

- బోగ్ పత్రాల జారీని నిలిపివేసిన బల్దియా
- నాణ్యత విషయంలో భక్తుల ఆందోళన

ఫుడ్ లైసెన్సులు జారీ అయిన దేవాలయాలివే..

మహాకాళి దేవస్థానం - సికింద్రాబాద్, ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం - బల్కంపేట, హనుమాన్ దేవస్థానం - కర్మన్‌ఘాట్, వీర హనుమాన్ దేవస్థానం - ఎస్పీరోడ్డు, హనుమాన్ దేవస్థానం - సనత్‌నగర్, పెద్దమ్మ దేవాలయం - జూబ్లీహిల్స్, హనుమాన్ దేవాలయం - వివేక్‌నగర్, లక్ష్మీగణపతి దేవస్థానం - ఆర్టీసీ క్రాస్‌రోడ్, శ్రీసాయిబాబ సమాజం - మినిస్టర్‌రోడ్డు, శ్రీగణేష్ దేవాలయం - సికింద్రాబాద్.

విజయ డెయిరీ నుంచే నెయ్యి సేకరించాలి

ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడితే చర్యలు తప్పవంటూ ప్రభుత్వం హెచ్చరించింది. విజయడైరీ నుంచే నెయ్యిని సేకరించాలని.. మధ్యవర్తులుంటే తొలగించాలని ఉన్నతాధికారులు ఈవోలకు సూచించారు.

- బల్కంపేట్ దేవాలయానికి ఆది, మంగళవారాల్లో 50వేల మంది, శుక్రవారం 20వేల మంది భక్తులు వస్తుంటారు. ఆయా రోజుల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల పులిహోర, క్వింటా లడ్డూలు విక్రయిస్తారు. వంటశాలలో 8 మంది పనిచేస్తుండగా ఇద్దరిని ఫాస్ట్రాక్ శిక్షణకు పంపించారు. లడ్డూ ప్రసాదం కోసం ఏటా 10వేల లీటర్ల నెయ్యిని వాడుతామని ఆలయ అధికారులు తెలిపారు.
- సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని మంగళ, శుక్రవారాల్లో 5-6 వేల మంది భక్తులు సందర్శిస్తుంటారు. రోజూ 15-70 కిలోల పులిహోర, 500 లడ్డూల విక్రయాలు సాగుతాయి. ఇక్కడ కిలో లడ్డూ తయారీకి 750 మిల్లీలీటర్ల నెయ్యిని వినియోగిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.
- సికింద్రాబాద్‌లోని గణేష్ దేవాలయంలో శుక్రవారం, సెలవు రోజుల్లో 1500 నుంచి 2వేల మంది వస్తుంటారు. రోజూ 500 లడ్డూలు, 500 పులిహోర ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

40 ఏళ్లు నిండితే మహిళలు మమ్మోగ్రఫీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఉమా చిగురుపాటి

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రొమ్ముక్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. 40 ఏళ్లు నిండిన ప్రతి మహిళ రొమ్ముక్యాన్సర్‌ను గుర్తించే మమ్మోగ్రఫీ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి అని సూచించారు. మంగళవారం ఫార్మాస్యూటికల్ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, ఏషియన్ మెడికల్ ఫౌండేషన్, యుసీ బ్రెస్ట్ ఫౌండేషన్ సహకారంతో ‘‘బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్’’ పేరిట రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ (మొబైల్ వాహనాన్ని) ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డా.నాగేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఏఐజీ బ్రెస్ట్ హెల్త్ సెంటర్ ఆంకాలజిస్ట్ డా.ప్రజ్ఞ చిగురుపాటి, ఏఐజీ ఆసుపత్రి వైస్‌ఛైర్మన్ పి.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న నాగమారుతిశర్మ. చిత్రంలో శైలజామిత్ర, కళా జనార్దనమూర్తి, చక్రపాణి, శ్రీలత

వాడుక భాషకు పట్టం

గాంధీనగర్ , న్యూస్‌టుడే: తెలుగు భాషలో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడు మహాకవి గురజాడ అప్పారావు అని విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయగానసభ నిర్వహణలో కళా సంగీత నాట్యవేదికలో అభ్యుదయ కవి గురజాడ అప్పారావు యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభ్యుదయ సాహిత్య వైతాళికుడని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహిత్యకారుడని అన్నారు. ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారన్నారు. గురజాడ కన్యాశుల్కం నాటకానికి సాహితీలోకంలో ప్రత్యేక స్థానముందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైలజామిత్ర, చక్రపాణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ప్రయాసలు





హబ్సిగూడ మెట్రోస్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రయాసలు పడుతూ వెళ్లారు


అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష విజయాలు



ప్రదర్శన తిలకిస్తున్న డా.సోమనాథ్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత దేశం అతి తక్కువ బడ్జెట్‌తో విజయాలు సాధిస్తోందని ఇస్రో ఛైర్మన్ డా.ఎస్.సోమనాథ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ తెలుగు రీజియన్ మళయాళీ అసోసియేషన్ (సీటీఆర్ఎంఏ), హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ (హెచ్ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో ‘స్పేస్ టూన్’ పేరిట కార్టూన్ ప్రదర్శనను రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దని ఆర్యభట్ట నుంచి చంద్రయాన్-3 వరకు ప్రగతిని సాధించినట్లేనని ఇందుకు ప్రభుత్వ సహకారం ఎంతో ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సీటీఆర్ఎంఏ, టీఈడీఎస్, క్లిక్ అధ్యక్షుడు లిబి బెంజిమెన్, కేరళ కార్టూన్ అకాడమి ఛైర్మన్ సుధీర్‌నాథ్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ శంకర్, కార్యదర్శి మృత్యుంజయ్ పాల్గొన్నారు.

రూ. 251 కోట్లు వృథా



చెరువు ఎగువన డంపింగ్‌యార్డు

ఈనాడు, హైదరాబాద్: డంపింగ్‌యార్డు నిర్లక్ష్యంతో రూ.251 కోట్ల ప్రజాధనం వృథాగా మారింది. మల్కారం చెరువు శుద్ధి పనులను ఇటీవలే జీహెచ్ఎంసీ పూర్తి చేసింది. మూడేళ్లు శ్రమించి మురుగు మొత్తాన్ని శుద్ధి చేసిందని అనుకునేలోపే డంపింగ్‌యార్డు వల్ల చెరువు మళ్లీ కాలుష్య జలాలతో నిండిపోయింది. వద్దంటున్నా వినకుండా తటాకం పక్కనున్న స్థలంలో లక్ష టన్నులకుపైగా చెత్తను కుప్పగా పోయడంతో ఇటీవలి వర్షాలకు వ్యర్థాల నుంచి వెలువడిన వరద నీరంతా చెరువును ముంచెత్తింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2009లో శామీర్‌పేట మండలం, జవహర్‌నగర్ గ్రామంలో 338 ఎకరాలను కేటాయించింది. అప్పట్నుంచి నగరంలో ఉత్పత్తయ్యే చెత్త అంతా అక్కడికే తరలుతోంది. 2012లో రాంకీ సంస్థ నిర్వహణ పనులు చేపట్టింది. చెత్త కుప్పల మురుగును శుద్ధి చేయకుండా వదిలేయడం వల్ల పక్కనున్న మల్కారం చెరువు కలుషితమైందని స్థానికులు వాపోయారు. అయినప్పటికీ అధికారులు రాంకీ సంస్థ యాజమాన్యానికి సంబంధించిన మరో సంస్థకు చెరువు శుద్ధి పనులను అప్పగించారు. 3 నెలల క్రితం పని పూర్తయినట్లు వెల్లడించారు. అంతలోనే చెరువు మళ్లీ మురుగుతో నిండిపోయింది. రోజువారీ వ్యర్థాలను నిల్వ చేసేందుకు స్థలం కొరవడిందని, చెరువు పక్కనున్న ఖాళీ స్థలంలో నిల్వ చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

మల్లంపేటలో మహిళ దారుణ హత్య



దుండిగల్, న్యూస్‌టుడే: పట్టపగలు అపార్ట్‌మెంట్లోని ఓ ఫ్లాట్‌లో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన బొద్దుల సత్యనారాయణ, **శారద**(50) దంపతులు. వారికి ఇద్దరు సంతానం కాగా కుమార్తెకు వివాహమైంది. ఐదు సంవత్సరాల క్రితం సత్యనారాయణ మృతి చెందాడు. ఆమె తన కుమారుడు సాయివినయ్‌తో కలిసి మల్లంపేట గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నం.2 లో శ్రీ వంశీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్లో ఉంటోంది. స్థానిక ప్రధాన రహదారి పక్కన విఘ్నేశ్వర మిల్క్ పాయింట్ పేరిట దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం తల్లిని మిల్క్ పాయింట్ వద్ద వదిలి కుమారుడు విధులకు వెళ్లాడు. మిల్క్ పాయింట్ మూసి ఉందని అదే రోజు సాయంత్రం పలువురు కస్టమర్లు అతనికి ఫోన్ చేశారు. దీంతో అతను పలుమార్లు తన తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో.. అపార్ట్‌మెంట్లోని తమ ఫ్లాట్ పక్కన ఉండే నరేశ్‌కు సమాచారం ఇచ్చాడు. నరేశ్ వెళ్లి చూడగా మంచంపై శారద మృతి చెంది ఉంది. కుమారుడితో కలిసి ప్రతిరోజు ఉదయం మిల్క్ పాయింట్‌కి వెళ్లి తిరిగి రాత్రి 9 గంటల ప్రాంతంలో కుమారుడితో కలిసి శారద ఇంటికి వచ్చేది. సోమవారం ఉదయం దుకాణం తెరిచిన కొద్దిసేపటికే మూసివేసింది. 10 గంటల ప్రాంతంలో మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తితో కలిసి అపార్ట్‌మెంట్లోకి వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. మృతురాలితో అతను వాట్సాప్ కాల్ చేసి మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు.

కాపురాల్లో సైబర్ చిచ్చు

సైబర్ నేరాలు కుటుంబాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. బాధితుల పట్ల కుటుంబ సభ్యుల సూటిపోటి మాటలు మరింత కుంగదీస్తున్నాయి. ఆలుమగలు విడిపోయే పరిస్థితి. పిల్లల చదువులు, వివాహాల కోసం దాచుకున్నదంతా పోగొట్టావంటూ మొదలవుతున్న కలహాలు బంధాలను మరింత దిగజారుస్తున్నాయి. - ఈనాడు, హైదరాబాద్

90 శాతం కేసుల్లో విద్యావంతులే బాధితులు



90 శాతం సైబర్ కేసుల్లో విద్యావంతులే బాధితులుగా ఉంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 85 వేల కేసులు నమోదవ్వగా అందులో 3 వేల మంది బాధితులు గృహిణులు. టాస్కుల పేరుతో ఇంటి నుంచే సంపాదన, నకిలీ ప్రకటనలు తదితర మోసాల్లో వీరు బాధితులు. కొందరు గృహిణులు తమ దగ్గర డబ్బు లేకున్నా తెలిసినవారి దగ్గర అప్పు చేసి, ఇంట్లో బంగారం, భర్త దాచిన నగదును నేరగాళ్లకు పంపిస్తున్నారు.

చేసిన అప్పుతీర్చలేక.. మహిళలకు కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఒకెత్తయితే పురుషులది దీనస్థితి. మోసమని తెలియక కొందరు ఆస్తులు తాకట్టుపెట్టి మోసపోతున్నారు. రుణదాతల ఒత్తిడి భరించలేక మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు అప్పటికప్పుడు బ్యాంకుల నుంచి వ్యక్తిగత రుణాలు తీసుకుని మరీ నేరస్థులకు పంపిస్తున్నారు. మోసపోయామని తెలుసుకొని భార్యను అదనపు కట్నం కావాలని వేధించడం, చిన్న విషయాలకు చేయి చేసుకోవడం వంటి సమస్యలు మొదలవుతున్నాయి.

కొన్ని ఉదాహరణలు..

- ఖైరతాబాద్‌కు చెందిన ఓ మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో రూ.4.5 లక్షలు పోగొట్టుకుంది. మోసపోయినట్లు గుర్తించిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పిల్లల కోసం దాచిన డబ్బు పోగొట్టావంటూ భర్త సూటిపోటి మాటలతో వేధించడం మొదలుపెట్టాడు. నిత్యం పరిస్థితి విడాకుల వరకూ వెళ్లింది. చిన్నపిల్లలు ఇబ్బందిపడతారని పెద్దలు సర్దిచెప్పడంతో కలిసి ఉంటున్నారు.
- పెట్టుబడులకు లాభాలిస్తామని సైబర్ నేరగాళ్ల ప్రకటన నమ్మి నగరవాసి రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మధ్య తరగతి నేపథ్యమే అయినా వ్యాపారి లాభాలకు ఆశపడి అప్పులు చేసి మరీ నేరగాళ్లకు డబ్బు పంపాడు. చివరకు మోసమని తెలియడంతో అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితి. కుటుంబ సభ్యులు ఇంటి పెద్దను తీవ్రంగా నిందించారు. దీంతో ఆయన మనస్తాపానికి గురై ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు.

అండగా నిలవాలి

కుటుంబానికి ఆసరాగా ఉండాలని ఎక్కువ మంది మహిళలు, గృహిణులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. సైబర్ నేరాల బారినపడితే ఆలస్యం చేయకుండా ఫిర్యాదుచేయాలి. డబ్బు కోల్పోయామని కుంగిపోవద్దు. కుటుంబ సభ్యులు సూటిపోటి మాటలు అనకుండా అండగా నిలవాలి.

- ధార కవిత, హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ

లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించాలి



లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రం వద్ద వీహెచ్, దిడ్డి రాంబాబు, కాంగ్రెస్ నేతలు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ జరిగిందన్న ప్రచారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు హిమాయత్‌నగర్ లిబర్టీలోని తితిదే వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నాలుగు గంటల దీక్ష చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు దిడ్డి రాంబాబు, సంబుల శ్రీకాంత్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, పులి జగన్, రమేష్ తదితరులున్నారు.

కుల గణనతోనే బీసీల సంక్షేమం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కోదండరాం, గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: కుల గణనతోనే బీసీల సంక్షేమం, సామాజిక న్యాయం, కులాలవారీగా నిధుల కేటాయింపు సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం తెలిపింది. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందగోపాల్, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ కార్యదర్శి రాపోల్ జ్ఞానేశ్వర్ తదితరులు ఈ నెల 25న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న ‘సమగ్ర కుల గణన- సామాజిక న్యాయం’ అఖిలపక్ష సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం ఆవిష్కరించారు.

స్నాప్‌చాట్‌లో బాలిక నగ్న వీడియోలు



నిందితుడు అఖీలుద్దీన్

ఈనాడు, హైదరాబాద్: బాలిక నగ్న వీడియోలు సేకరించి స్నాప్‌చాట్‌లో ఇతరులకు షేర్ చేస్తున్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్‌క్రైమ్ డీసీపీ ధార కవిత, ఏసీపీ చాంద్‌బాషా తెలిపిన ప్రకారం పాతబస్తీ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన అఖీలుద్దీన్ (21) ఎలక్ట్రీషియన్. బండ్లగూడ ప్రాంతానికి చెందిన ఒక బాలికతో పరిచయం పెంచుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత బాలికకు స్నాప్‌చాట్ ద్వారా వీడియో కాల్ చేసి ఆమె వ్యక్తిగత, నగ్న వీడియోలు సేకరించాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు.

జల వనరుల్లోని నిర్మాణాలను బహిర్గతపరచాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసిన, చెరువుల్లో నిర్మించిన భవనాల వివరాలను బహిర్గతం చేస్తే వినియోగదారులు అప్రమత్తమై కొనుగోలుకు దూరంగా ఉంటారని తెలంగాణ నేషనల్ రియల్ ఎస్టేట్ కౌన్సిల్(నరెడ్కో) ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గం సత్వ నాలెడ్జ్ సిటీలోని సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి ఆ సంస్థ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అలాంటి నిర్మాణాల గురించి తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

ఫైనల్స్‌కు చేరిన ఖోఖో జట్లు



సెమీ ఫైనల్స్‌లో ఆడుతున్న బాలికలు

నిజాంపేట, న్యూస్‌టుడే: బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో మూడు రోజులుగా సాగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో టోర్నమెంట్ పోటీలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. సెమీ ఫైనల్స్‌లో మొత్తం 70 జట్లు తలపడ్డాయి. అండర్-17 బాలల జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకోగా.. అండర్-14 జట్లు ఇప్పటికే సెమీ ఫైనల్స్ పూర్తిచేసుకుని ఫైనల్స్‌కు చేరాయి.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125–00	డ్రెస్డ్ 213–00	
రిటైల్ 147–00	స్కిన్‌లెస్ 243–00	

డీలర్ల పేరుపై పురుగు మందుల సంస్థ రుణాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: తమకు తెలియకుండా ఓ పురుగు మందుల సంస్థ తమ పేరిట రుణాలు తీసుకుని మోసానికి పాల్పడిందని తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు డీలర్లు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఆదిత్య దేశ్‌పాండే ల్యాబ్ టు ల్యాండ్ పేరుతో పురుగు మందుల వ్యాపారం మొదలుపెట్టారు. ఏడాది క్రితం రాయదుర్గం టీహబ్‌లో కార్యాలయం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని డీలర్ల నుంచి ఖాళీ చెక్కులు, వారి కేవైసీ వివరాలు సేకరించారు. డీలర్లు నగదు చెల్లించి సరకులు తీసుకోగా యాజమాన్యం మాత్రం డీలర్ల పేరిట రుణాలు తీసుకుని వాడుకుంది. కిస్తీలు చెల్లించాలని ఫైనాన్స్ సంస్థల నుంచి డీలర్లకు మెసేజ్‌లు రావడంతో వారు అవాక్కయ్యారు. డీలర్లుగా నమోదు చేసిన ఉద్యోగులను దీనిపై ప్రశ్నించారు. దీంతో జిల్లాస్థాయి ఉద్యోగులు మార్చిలో టీహబ్‌కు వచ్చి చూసేసరికి కార్యాలయం మూసి ఉండడంతో రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన డీలర్లు 50 మంది వరకు రాయదుర్గం పీఎస్‌కు వచ్చి తమ పేరుపై రుణాలు తీసుకుని మోసగించిన ఆ సంస్థపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

స్కీము వెనుక రూ.6.7 కోట్ల స్కాము

18 మంది నుంచి వసూలు చేసిన డీబీ స్టాక్ కన్సల్టెన్సీ

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడి పెడితే ఏడాదికి 120 శాతం చొప్పున వడ్డీ ఇస్తామంటూ ప్రచారం చేసిన డీబీ స్టాక్ కన్సల్టెన్సీ సంస్థ బిచాణా ఎత్తేసింది. మొత్తం 18 మంది రూ.6.7 కోట్లు వసూలు చేసిన సంస్థ యజమాని పరారయ్యాడు. ఈ సంస్థ అసోం కేంద్రంగా నడుస్తూ తెలుగు రాష్ట్రాల్లోనూ మోసాలు చేసినట్లు సమాచారం. బాధితుల సంఖ్య, మోసం విలువ ఇంకా భారీగా ఉండొచ్చని తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. పుప్పాలగూడకు చెందిన షామై పంచాక్షర్ (37) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అసోంలోని గువాహటి కేంద్రంగా దీపాంకర్ బర్మన్ అనే వ్యక్తి డీబీ స్టాక్ బ్రోకింగ్ కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించారు. నగరంలోని కేపీహెచ్‌బీలోనూ శాఖ ఉంది. తమ సంస్థ 4 రకాల స్కీములు ప్రారంభించిందని, పెట్టుబడులు పెడితే ఏడాదికి 120 శాతం, 6 నెలలకు 54 శాతం, 3 నెలలకు 24 శాతం, నెలకు 7 శాతం చొప్పున వడ్డీ ఇస్తామని దీపాంకర్ ప్రచారం చేశాడు. దీనికి పంచాక్షర్ ఆకర్షితుడయ్యాడు. గత ఏప్రిల్‌లో దీపాంకర్ ఖాతాలకు రూ.11.10 లక్షలు బదిలీ చేశాడు. ఈ సమయంలోనే గువాహటిలో సంస్థను స్థానిక పోలీసులు జప్తు చేశారని, దీపాంకర్ పరారైనట్లు పంచాక్షర్ తెలుసుకున్నాడు. కేపీహెచ్‌బీ కార్యాలయానికి వెళ్లగా తన లాగే మరో 17 మంది రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినట్లు వెల్లడైంది. బాధితుల ఫిర్యాదు మేరకు దీపాంకర్ మీద కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి: పీఆర్టీయూ



ఈవీ నర్సింహారెడ్డికి వినిపత్రం ఇస్తున్న హర్షవర్దన్‌రెడ్డి తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ హైదరాబాద్ జిల్లా శాఖ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కోరింది. పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో పలువురు ఆయనకు సమస్యలు వివరించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల సాయంత్రం 4 గంటలకు వదలడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, మధ్యాహ్నం భోజన సమయం 15 నిమిషాలు తగ్గించి ప్రాథమిక పాఠశాల పిల్లలను 3.45 గంటలకు వదిలేస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి, చక్రారెడ్డి, బాలాజీ, వెంకట్‌రెడ్డి, బి.రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



నాగమల్లును సన్మానిస్తున్న ప్రిన్సిపల్ జ్యోత్స్నప్రభ, అధ్యాపకులు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎందరో మహానుభావులు సమాజానికి చేసిన సేవల ఫలితంగానే, నేడు ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు అన్నారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ జ్యోత్స్నప్రభ అధ్యక్షత జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ నాగమల్లు మాట్లాడుతూ.. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తాను రాసిన సామాజిక చైతన్య గీతాలను పాడి విద్యార్థులను ఉత్తేజపరిచారు. సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, బి.నరసింహ, యాదగిరి రెడ్డి, శారదాదేవి పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

ధ్యానాంజనేయ ఆలయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా పూజలు

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో ప్రేమ్‌కుమార్ రావు ఆధ్వర్యంలో స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో ముందుకు సాగాలన్నారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



సౌమ్యమిశ్రాకు పండితుల ఆశీర్వచనాలు

సంక్షిప్త సమాచారం

ఆంధ్రాబ్యాంక్ కాలనీ కార్యవర్గం ఎన్నిక



సైదాబాద్: తెలంగాణ కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం సైదాబాద్ డివిజన్ ఆంధ్రాబ్యాంక్ కాలనీ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా కేవీ కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటరెడ్డి, కార్యదర్శిగా వీవీఎస్ శర్మగా, కోశాధికారిగా డి.రాజశేఖర్, సంఘం సభ్యులుగా కె.అశోక్ బాబు, బి.కుమార్, ప్రకాశ్ చవాన్ తదితరులు ఎన్నికైనట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

బండ్లగూడ: ప్రయాణికుల అవసరాలు, సూచనలు తెలుసుకునేందుకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ బండ్లగూడ డిపో మేనేజర్ టి.వెంకటేశం తెలిపారు. బుధవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య 99592 24058 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలు తెలియజేయాలని మేనేజర్ సూచించారు.

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

వనస్థలిపురం: దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేస్తున్నట్లు శాంతినికేతన్ దివ్యాంగ పాఠశాల నిర్వాహకులు రమేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దివ్యాంగన్ ఏడీఐపీ పథకంలో భాగంగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ శ్రీనివాసకాలనీలోని శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో పంపిణీ ఉంటుందని తెలిపారు. వివరాలకు 92469 13303 నంబరులో సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రి: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడా ప్రతిభకు సంబంధించిన వివరాలు, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, 2 ఫొటోలను దరఖాస్తుకు జత చేసి శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా ధ్రువీకరించి 25న జిల్లా యువజన, క్రీడా కార్యాలయం, జింఖానా గ్రౌండ్స్‌లో అందజేయాలి. వివరాలకు 92933 12848, 9985348889లో సంప్రదించాలి.

ప్రజావాణికి 360 విన్నపాలు

సోమాజిగూడ: ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 360 వినతులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య తదితరులు ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-138, విద్యుత్తు- 38, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి- 36, ఎస్సీ సంక్షేమం-26, మున్సిపల్ శాఖ-17, ఇతర శాఖలకు-105 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య కేంద్రాలు

స్థలం కేటాయింపులో ఇబ్బందులు..

ప్రభుత్వ స్థలం కేటాయింపులోనే ఇబ్బందులు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టిలోనూ ఉంది. నిధులు సైతం మంజూరయ్యాయి. అందరి సమన్వయంతో త్వరలోనే శాశ్వత భవనాలు ఏర్పాటయ్యేలా కృషిచేస్తాం. – రఘునాథస్వామి, డీఎంహెచ్‌వో

నాగోలు, న్యూస్‌టుడే: ప్రజలకు మేలైన వైద్య సేవలు అందిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా.. అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవ చూపకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇదీ పరిస్థితి..

కొత్తపేట, నాగోల్ సాయినగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఓ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఆయా కేంద్రాలకు నిత్యం వంద మంది రోగులు వస్తున్నారు. గర్భిణులకు పరీక్షలు, పిల్లలకు వ్యాక్సినేషన్, బీపీ, షుగర్ బాధితులకు మందులు అందజేస్తున్నారు. కొత్తపేట భవనాన్ని ఖాళీ చేయాలంటూ రెండేళ్లుగా యజమాని ఒత్తిడి చేస్తున్నా, మరో అద్దె భవనం లభించకపోవడంతో అందులోనే కొనసాగిస్తున్నారు. ఇరుకైన భవనం కావడంతో సరైన సౌకర్యాలు లేవు. తద్వారా ఇక్కడ పరీక్షలు చేయించుకుంటున్న గర్భిణులు, ప్రసవానికి ఉప్పల్ వరకు వెళ్లాల్సి వస్తోంది.

- నాగోలు పరిధిలోని నువ్వుల బండలో ఓ అద్దె భవనంలో బస్తీ దవాఖానా నడుస్తోంది. వర్షాలకు పైకప్పు కూలడంతో నెల రోజుల క్రితం మూసేశారు.
- మోహన్‌నగర్ పరిధి ప్రజయ్ ఫేజ్-1లో, భరత్‌నగర్ ఫేజ్-1లోని బస్తీ దవాఖానాలు సైతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.
- చైతన్యపురి సమీపంలోని మున్సిపల్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పల్లె దవాఖానా వైద్యుడు ఇటీవల నాచారానికి బదిలీ కావడంతో డాక్టర్ లేక ఆసుపత్రి మూతబడింది.

నిధులు మంజూరైనా..

మేడ్చల్ జిల్లా పరిధిలో 17 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి రెండేళ్ల కిందటే రూ.60 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం ప్రభుత్వ స్థలాన్ని చూపాలని స్థానికులు, వైద్యులు.. ఆయా విభాగాల అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతులు చేశారు. స్థలం కేటాయిస్తే అన్ని విభాగాలతో పాటు గర్భిణులకు లేబర్ రూం, శిశువుల కోసం ప్రత్యేక గది, డే కేర్ ఇలా.. అన్ని వసతులను అందుబాటులోకి వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడం ఇబ్బందులు తప్పడం లేదని, అవసరమైన స్థలాన్ని అన్వేషిస్తున్నామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030

మలక్‌పేట: 80085 73284

హయత్‌నగర్: 98336 64897

కర్మన్‌ఘాట్: 94400 32872

బండ్లగూడ: 96034 78579

మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, బండ్లగూడ వనస్థలిపురం, సైదాబాద్

? ఫత్తుల్లాగూడ గ్రీన్ లీవ్స్ విల్లాస్, డీఆర్ఎఫ్ కేంద్రం తదితర మార్గాల్లో వీధిదీపాలు పగలు వెలుగుతున్నాయి. రాత్రి వెలగడం లేదు. అంధకారంతో అవస్థలు పడుతున్నాం. – మోహన్‌రావు, జైపురి కాలనీ

✔ వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి.. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. –పున్నానాయక్, ఈఈ, వీధిదీపాల విభాగం

? బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం సమీపంలోని రాఘవేంద్రస్వామి గడి వెనక వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై వరద ఏరులై పారుతోంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – రాజశేఖర్, సచివాలయనగర్

✔ వర్షం వచ్చిన ప్రతిసారి సిబ్బంది మట్టి తొలగిస్తున్నారు. శాశ్వత పరిష్కార చర్యలు చేపడతాం.–రాజగోపాల్, డీజీఎం, జలమండలి

? సైదాబాద్-సరూర్‌నగర్ మార్గంలోని ఫరాహ్ కేఫ్ నుంచి మస్జిద్-ఏ-ఖుబా వైపునకు వెళ్లే మార్గంలో కొన్ని రోజులుగా మురుగు పారుతోంది. అంతర్జాలంలో అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా స్పందించాలి. –సిరాజుద్దీన్, సైదాబాద్

✔ క్షేత్ర స్థాయి సిబ్బందిని పంపించి.. మురుగు నియంత్రణ చర్యలు చేపడతాం. – శ్రవణ్‌కుమార్, మేనేజర్, జలమండలి

? అక్బర్‌బాగ్ డివిజన్ బాఖర్‌బాగ్ కాలనీ ఉద్యాన సమీపంలో చెత్త, ఇతర వ్యర్థాలు పడేస్తున్నారు. – అఖిలజ్యోతి, అక్బర్‌బాగ్

✔ క్షేత్రస్థాయికి పారిశుద్ధ్య పర్యవేక్షకుడిని పంపించి, తగిన పరిష్కార చర్యలు తీసుకుంటాం. – అనురాధ, ఏఎంవోహెచ్, మలక్‌పేట

రహదారి అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం

సైదాబాద్ చౌరస్తాలో రహదారి అధ్వానంగా మారింది. పూర్తిగా కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు నరకం చవిచూస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి జారిపడినా.. వెనక వచ్చే వాహనాలతో ముప్పు తప్పదు.



కనిపించని చెత్తశుద్ధి!

మూసారాంబాగ్ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సలీంనగర్ మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలు..



కేటీ నగర్‌లో కొమ్మలు..

సలీంనగర్, శాలివాహన నగర్, కట్టెలమండి, గడ్డిఅన్నారం బస్తీ, ఇంద్రానగర్ బస్తీ, ప్రతాప్ నగర్ ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది. పారిశుద్ధ్య కార్మికుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మూసారాంబాగ్

ఐకమత్యంతో బీసీల హక్కుల సాధన

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీ జనగణన జరిగి తీరుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో కంకణబద్ధులై ఉన్నారని వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు హామీ ఇచ్చారు. రవీంద్రభారతిలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో మంగళవారం 'సబ్బండ వర్గాల సంబరం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సామాజిక వర్గాల కార్పొరేషన్ ఛైర్మన్లకు ఆత్మీయ సత్కారాలు నిర్వహించారు. అనంతరం పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలు ఐక్యంగా హక్కులు సాధించుకోవచ్చన్నారు. రాష్ట్ర మత్స్యకార సహకార సంస్థ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి అని పేర్కొన్నారు. తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీజీఐఐసీ ఛైర్మన్ టి.నిర్మల జగ్గారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత ఐలమ్మ, పలు కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

నృత్యదర్శకుడు జానీ కస్టడీ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

చంచల్‌గూడ, రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న సినీ నృత్య దర్శకుడు జానీని కస్టడీకి ఇవ్వాలని నార్సింగి పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనల అనంతరం కోర్టు తదుపరి ఉత్తర్వుల కోసం విచారణను నేటికి (బుధవారానికి) వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్ సైతం నేడు విచారణకు రానుంది. మంగళవారం ములాఖత్‌లో జానీని ఆయన భార్య అయేషా కలిశారు. సహాయ నృత్య దర్శకురాలిపై అత్యాచారం, బెదిరింపుల ఆరోపణలపై అరెస్టైన జానీ చంచల్‌గూడ జైలులో ఉన్న విషయం తెలిసిందే.

ఎడతెరిపిలేని వర్షం

● పలు కాలనీలు జలమయం



ఆనంద్‌నగర్ సమీప శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్‌లో





కర్మన్‌ఘాట్, బండ్లగూడ, న్యూస్‌టుడే: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు కాలనీల్లో నడుము లోతు వరద పారింది. హస్తినాపురం డివిజన్ ఏపీఎస్ఈబీ కాలనీ, పీఎన్ఆర్ కాలనీ, ద్వారకా నగర్ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ వర్షం కురిసింది. వీధుల్లో పెద్ద ఎత్తున వరద ప్రవహించింది. వరద ఇళ్లలోకి చేరకుండా ఏపీఎస్ఈబీ కాలనీ వాసులు తమ నివాసాల ఎదుట ఇసుక బస్తాలు ఏర్పాటుచేసుకున్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధి పద్మావతి కాలనీ, ఆనంద్‌నగర్ సమీపంలోని శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్‌లో నడుము లోతు వరద పారింది.



ఏపీఎస్ఈబీ కాలనీలో..

8 గంటలు శ్రమించి.. 9 నెలల చిన్నారి గుండె పదిలం చేసి

నిమ్స్, న్యూస్‌టుడే: తొమ్మిది నెలల చిన్నారికి అత్యంత అరుదైన గుండె సమస్యను శాశ్వతంగా నయం చేశారు నిమ్స్ వైద్యులు. ఆసుపత్రిలో బ్రిటన్ వైద్య బృందం సారథ్యంలో చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నాలుగు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేశారు. ఓ 9 నెలల చిన్నారి గుండెకి మంచి రక్తం సరఫరా కాకపోవడంతో పని తీరు మందగించింది. ఈ విషయం గుర్తించిన వైద్య బృందం ఉదయం 9 గంటల నుంచి ఎనిమిది గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స పూర్తి చేసింది. కొన్నివారాల్లో చిన్నారి పూర్తిగా కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. ఈ బృందంలో బ్రిటన్ వైద్యులు రమణ ధన్నపనేనితో పాటు నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, ప్రొఫెసర్ గోపాల్ ఉన్నారు.

పాడుతా.. తీయగాతో వెలుగులోకి ఎందరో గాయకులు




రామాచారి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఈటీవీలో ప్రసారమయ్యే 'పాడుతా.. తీయగా' ద్వారా ఎందరో గాయకులు వెలుగులోకి వచ్చి, సినీ రంగంలో రాణిస్తున్నారని ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కె.వి.రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో పద్మవిభూషణ్ డా.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా గాయకుడు, సంగీత దర్శకుడు కొమండూరి రామాచారికి 'కిన్నెర- బాలు' పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. 27 ఏళ్లుగా 'పాడుతా.. తీయగా' కార్యక్రమం ద్వారా రామాచారి, ఉషా వంటి ఎందరో గాయనీ గాయకులు సంగీత ప్రపంచానికి పరిచయం అయ్యారన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. బాలసుబ్రమణ్యం ఎదుగుదల చూసి ఓర్వలేక ఈర్ష్య పడేవాళ్లు ఎక్కువ మంది ఉన్నారన్నారు. సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం, శ్రీడెవలపర్స్ ఎండీ భోగరాజుమూర్తి మాట్లాడారు. కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ స్వాగతం పలికారు. రామాచారి ఆధ్వర్యంలో లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమి విద్యార్థులు సమర్పించిన సంగీత విభావరి ఆకట్టుకుంది.

క్యాచ్‌పిట్ మూత ధ్వంసం

సైదాబాద్ డివిజన్ సాయిరామ్ కాలనీలోని సాయిబాబా దేవస్థానం సమీపంలో వరద కాల్వపై ఉన్న క్యాచ్‌పిట్ మూత ధ్వంసమైంది. ప్రమాదాల నివారణకు స్థానికులు రాతి బండను అడ్డుగా పెట్టారు. అధికారులు స్పందించి తక్షణమే మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సైదాబాద్



భౌభౌలతో బెంబేలు



మలక్‌పేటలోని పలు వీధుల్లో శునకాలు బెడద అధికమైంది. గుంపులుగా సంచరిస్తూ స్థానికులపై దాడి చేస్తూ గాయ పరుస్తున్నాయి. అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సైదాబాద్

బాలికతో అసభ్య ప్రవర్తన.. ఆటోడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు



రంగారెడ్డి జిల్లా కోర్టులు: ఒంటరిగా వెళ్తున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12,500 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత బర్ల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం నామాపురం గ్రామానికి చెందిన **భీమనపల్లి రాజు** (23) పెద్ద అంబర్‌పేటలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2018 మే 3న కొత్తగూడెం ఆటో స్టాండ్ సమీపం నుంచి ఓ బాలిక (13) ఒంటరిగా వెళ్తుండగా, ఆమెను బలవంతంగా పాత భవనంలోకి లాక్కెళ్లి అనుచితంగా ప్రవర్తించాడు. బాలిక కేకలతో స్థానికులు రావడంతో పారిపోయాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తుదితీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని న్యాయమూర్తి ఆదేశించారు.

నిర్మాణం పూర్తయినా.. నిరుపయోగంగానే..!

హయత్‌నగర్, న్యూస్‌టుడే: హయత్‌నగర్ పాత గ్రామంలో జవహర్‌లాల్ నెహ్రూ యూత్ క్లబ్‌కు భవనం ఉండేది. శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. దాని స్థానంలో యువజన సంఘానికి, సీనియర్ సిటిజన్లకు నూతన భవనం నిర్మించాలని నిర్ణయించారు. అప్పటి కార్పొరేటర్ తిరుమలరెడ్డి రూ.15 లక్షలు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రూ.23 లక్షలు కేటాయించడంతో పనులు ప్రారంభించారు. 2020 ఫిబ్రవరి 22న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భూమిపూజ చేశారు. రూ.38 లక్షల వ్యయంతో భవనం నిర్మాణం పూర్తయినా.. నేటికీ వినియోగంలోకి రాలేదు.



హయత్‌నగర్ పాత గ్రామంలో భవనం

వినియోగంలోకి తీసుకొస్తాం..

– కళ్లెం నవజీవన్‌రెడ్డి, కార్పొరేటర్, హయత్‌నగర్

భవనం నిర్మాణం గతంలోనే పూర్తైంది. కొన్ని కారణాలతో ప్రారంభోత్సవంలో జాప్యం చోటుచేసుకుంది. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో మరింత ఆలస్యమైంది. మరోసారి రంగులు వేయించి, సాధ్యమైనంత త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం.

పేరు విషయంలో వివాదం..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. అయితే భవనంపై విశ్రాంత ఉద్యోగుల భవనంగా నామకరణం చేస్తుండగా, స్థానికంగా కొందరు వ్యతిరేకించారు. విశ్రాంత ఉద్యోగులకు బదులుగా సీనియర్ సిటిజన్, జవహర్‌లాల్ నెహ్రూ యూత్ క్లబ్‌గా పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది. తాజాగా ఈ విషయంలో స్థానికులంతా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. విశ్రాంత ఉద్యోగుల భవనం కాకుండా సీనియర్ సిటిజన్ భవనంగా నామకరణం చేయాలని అంగీకరించినట్లు తెలుస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్ సీనియర్ సిటిజన్లకు, మొదటి అంతస్తు యువజన సంఘం కార్యకలాపాలకు వినియోగించాలని నిర్ణయించినట్లు స్థానిక నేత ఒకరు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

నివాసాల మధ్య వ్యభిచారగృహం నిర్వహణ.. ఇద్దరి అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారగృహం నిర్వహిస్తుండగా.. పోలీసులు దాడిచేసిన ఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన రావిశెట్టి దయాకర్(35) వృత్తిరీత్యా ఆటోడ్రైవరు. మూడు నెలల క్రితం నగరానికి వచ్చి మన్సూరాబాద్ పరిధిలోని హిమపురి కాలనీలో అద్దెకు దిగాడు. సులువుగా డబ్బు సంపాదించేందుకు వ్యభిచార గృహం నిర్వహించాలని పథకం వేశాడు. యువతులను రప్పించి ఇంట్లోనే వ్యభిచారం చేయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు సోమవారం సాయంత్రం దయాకర్‌తో పాటు ఉప్పల్‌కు చెందిన విటుడు సుదర్శన్(44)ను అరెస్టు చేశారు. ఓ యువతిని రక్షించి రెస్క్యూ హోంకు తరలించారు.

పాఠశాల ఎదుట ఆందోళన

సైదాబాద్: సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ పాఠశాల ఎదుట పలువురు ఆందోళన చేపట్టారు. సైదాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలోని పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. పోటీల పేరిట మత ప్రచారం నిర్వహించారంటూ రెండో తరగతి విద్యార్థి తండ్రి ఆర్.వెంకటేశ్వర్‌రావు, స్థానిక బీజేవైఎం నాయకులు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు అక్రమంగా చొరబడి దాడి చేయడంతో పాటు దుర్భాషలాడారని ప్రధానోపాధ్యాయురాలు సైతం ఫిర్యాదు అందజేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అడ్మిన్ ఎస్సై పి.వెంకటేశ్వర్లు తెలిపారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు: కలెక్టర్


మాట్లాడుతున్న అనుదీప్ దురిశెట్టి

గన్‌ఫౌండ్రి: తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థి కోసం సంవత్సరానికి లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందని, పిల్లలకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులను సూచించారు. మంగళవారం ప్రభుత్వ అలియా మోడల్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్ తదితర అధికారులతో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గతంలో హైదరాబాద్‌లోని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తక్కువగా ఉండేదని, దీనిపై దృష్టి సారించడం వల్ల నమోదు శాతం పెరిగిందని వివరించారు. జిల్లా విద్యాధికారి ఆర్.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

సౌత్ ఇండియన్ థాలీలో జెర్రి



అబిడ్స్, న్యూస్‌టుడే: ఓ హోటల్‌లో భోజనం చేస్తున్న కస్టమర్‌కు పప్పులో జెర్రి ప్రత్యక్షమైంది. సిబ్బందితో వాదించినా నిలదీయడంతో మంగళవారం సికింద్రాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఆబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌కు వచ్చి సౌత్ ఇండియన్ థాలీ(భోజనం) ఆర్డరు చేశారు. భోజనం చేస్తుండగా వారిలో ఒకరి ప్లేటులో పప్పుతో పాటు జెర్రి కనిపించింది. అప్పటికే అర్ధ భోజనం చేస్తున్న వారికి విషయం తెలిసి అందరు ఆందోళనకు దిగారు. జీహెచ్ఎంసీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు.

మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో తక్షణ ప్రవేశాలు నేటి నుంచి

కార్వాన్, న్యూస్‌టుడే: మల్లేపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లోని వివిధ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు బుధవారం నుంచి ఇంటర్వ్యూలు, స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పుష్పాల జ్యోతిరాణి తెలిపారు. 28 వరకు దరఖాస్తులు సమర్పణ కొనసాగుతుందన్నారు. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, అడ్విన్స్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్) ట్రేడ్ (కోర్సు)ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ నియమనిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలను మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో లేదా వెబ్‌సైట్ https://iti.telangana.gov.in లో పొందవచ్చు.

హజ్‌యాత్ర- 2025 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు 30 వరకు పొడిగింపు

జియాగూడ, న్యూస్‌టుడే: ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్‌యాత్ర- 2025 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు తేదీని ఈనెల 23వ నుంచి 30 వరకు పొడిగించినట్లు తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్‌షా గులాం అఫ్జల్ బియాబానీ (ఖుస్రోపాషా) ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియాకి చెందిన www.hajcommittee.gov.in వెబ్‌సైట్‌లో ఐఫోన్, హజ్ సువిధ- ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పూర్తి వివరాలకు నాంపల్లిలోని హజ్ భవన్‌లో నేరుగా లేదా 040-23298793 ఫోన్ నంబర్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు

ప్రధాన రహదారుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

35 ఆటోలు అవసరం


సీతారాంబాగ్ బైరాక్-దత్తాత్రేయ కమాన్ రోడ్డులో..

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: ప్రధాన రహదారుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఎక్కడపడితే అక్కడ చెత్త డంప్ చేస్తూ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు చెబుతున్నారు. అయితే వాహనాల్లో తరలించిన గంటలోపే తిరిగి చెత్తచెదారం రోడ్లపై ఏర్పడుతోంది. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలు, వీధులను శుభ్రం చేసే కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా కుప్పల తొలగింపునకు మోక్షం లభించడం లేదు. 'స్వచ్ఛ హైదరాబాద్'లో భాగంగా బహిరంగ ప్రదేశాలు, ప్రధాన రహదారులపై ఉన్న వర్నబుల్ పాయింట్స్(చెత్త కుండలు)కు అధికారులు గతంలోనే పుల్‌స్టాప్ పెట్టినప్పటికీ సమస్య ఇంకా జఠిలమవుతూనే ఉంది. పెద్దఎత్తున చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్న గార్బేజీ వర్నబుల్ పాయింట్లు(జీవీపీ) మెహిదీపట్నం సర్కిల్ పరిధిలో ఇంకా 86 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో పాటు, చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోల వారు కూడా జీవీపీ పాయింట్ల వద్ద డంప్ చేస్తూ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నారు.

గ్రేటర్ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని మెహిదీపట్నం(నాంపల్లి) సర్కిల్‌లో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 2.80 లక్షల జనాభా, 72వేల గృహాలు ఉన్నాయి. సర్కిల్ మొత్తంలో 350-400 మెట్రిక్ టన్నుల చెత్త ప్రతిరోజూ జమఅవుతోంది. ఇళ్ల నుంచి చెత్త సేకరించేందుకు మెహిదీపట్నంలో 180 స్వచ్ఛ ఆటోలు అవసరం. అయితే ప్రస్తుతం 145 మాత్రమే ఉన్నాయి. మరో 35 ఆటోల కోసం అధికారులు గత మూడు ఏళ్లుగా గ్రేటర్ కమిషనర్‌కు ఆర్జీలు పెడుతూనే ఉన్నారు. మెహిదీపట్నం, రింగురోడ్డు, గుడిమల్కాపూర్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో రోజూ చెత్త సేకరించడం సాధ్యం కావడం లేదు. జీవీపీల వద్ద కురుస్తున్న వానలకు చెత్త తడిసిపోయి ఇళ్లలోకి చేరుతుంటే ప్రజలు పడే పాట్లు వర్ణనాతీతం.


జిర్రా రహదారిలో దుస్థితి

కొత్త ఆటోల కోసం ప్రతిపాదనలు
– డా.ఏజాజ్ ఖాసీం, ఏఎంఓహెచ్

మెహిదీపట్నం(నాంపల్లి) సర్కిల్ పరిధిలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ఈ విషయంలో కాలనీ, బస్తీ సంఘాల వారితో నిరంతరం సంప్రదిస్తున్నాం. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పారవేయకుండా స్వచ్ఛ ఆటో కార్మికులకే ఇవ్వాలి. మరికొన్ని ఆటోల కోసం గ్రేటర్ కమిషనర్‌కు నివేదికలు సమర్పించాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9005818018

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: ? ఉస్మానియా ప్రభుత్వ దంత వైద్యశాల ప్రధాన ద్వారం ముందు కొంత మంది ఆటోడ్రైవర్లు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. – మధుసూదన్, గోషామహల్

✓ ఆటోలు నిలుపకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.
– డా.ఎస్.ఎస్.యాదవ్, ప్రిన్సిపల్ దంత వైద్య కళాశాల

క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతామని రూ.1.66 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతామని రూ.1.66 లక్షలు కొట్టేశారని బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి ఇండస్ ఇండ్ బ్యాంక్ క్రెడిట్ కార్డు ప్రతినిధినంటూ ఫోన్ వచ్చింది. కార్డు పరిమితి పెంచుకునే అవకాశం వచ్చిందని చెప్పాడు. అది నిజమే అనుకొని బాధితుడు తన క్రెడిట్ కార్డు నంబరు, వివరాలను చెప్పాడు. కొద్ది సేపటికే తన ఖాతాలోంచి రూ.1.66 లక్షలు విత్‌డ్రా అయినట్లు సందేశం వచ్చింది. వెంటనే బాధితుడు బ్యాంక్‌కు ఫోన్ చేసి కార్డును బ్లాక్ చేయించాడు. ఆతర్వాత పోలీసులకు ఫిర్యాదు నమోదు చేశాడు.

కొరియర్ పార్సిల్‌లో నిషేధిత వస్తువులని...

నారాయణగూడ, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి ఆగంతుకుడు తాను ముంబయి కస్టమ్స్ అధికారినంటూ ఫోన్ చేశాడు. ''మీ పేరిట ఉన్న కొరియర్ పార్సిల్‌లో ఏటీఎం కార్డులు, ఏండీఎంఏ (మత్తు పదార్థం), పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్‌లు వంటి అక్రమ వస్తువులు ఉన్నాయి'' అని చెప్పాడు. కొద్ది సేపటికే బాధితుడికి స్కైప్ వీడియో కాల్ వచ్చింది. అందులో ముంబయి పోలీసునంటూ ఓవ్యక్తి పరిచయం చేసుకున్నాడు. ఆన్‌లైన్ స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉందని, ఉద్యోగిని బెదిరించి తన పేరు, బ్యాంక్ వివరాలన్నీ తెలుసుకున్నాడు. కొంత డబ్బు ప్రభుత్వ సురక్షిత ఖాతాలో జమా చేయాల్సి ఉంటుందని నమ్మించి రూ.1.60 లక్షలు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేయించుకున్నాడు. చివరకు అది మోసమని తెలిసి బాధితుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఫుడ్ డెలివరీ బాయ్‌పై దాడి.. కేసు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: ఫుడ్ డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన చాక్నా సెంటర్ నిర్వాహకుడికి న్యాయస్థానం జరిమానా విధించింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కథనం ప్రకారం.. అత్తాపూర్‌కి నివాసి షేక్ అబ్దుల్ నసీం ఫుడ్ డెలివరీ బాయ్ పనిచేస్తుంటాడు. 21న చాక్నా కోసం బంజారాహిల్స్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి ఆర్డర్ వచ్చింది. మల్లేపల్లిలోని మోయిన్ చాక్నా సెంటర్‌కు వచ్చి ఆర్డర్ డెలివరీ చేయాల్సిందిగా యజమాని సల్మాన్‌హుస్సేన్‌ను కోరాడు. 40 నిమిషాల సమయం పడుతుందని యజమాని చెప్పాడు. కొద్ది సమయం తర్వాత మళ్లీ అడగడంతో కోపగించుకున్న సల్మాన్ డెలివరి బాయ్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి నిందితుడిని నాంపల్లిలోని 2వ ప్రత్యేక జ్యుడిషియల్ కోర్టులో హాజరుపరచగా రూ.10,050 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.స్వామి తీర్పు చెప్పారు.

పేదల బస్తీల్లో యునానీ సంచార వైద్యశాల


ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీలో సంచార వైద్యశాల

బోరబండ, న్యూస్‌టుడే: ఎర్రగడ్డలోని చర్మవ్యాధుల యునానీ చికిత్స జాతీయ పరిశోధనకేంద్రం ఆధ్వర్యంలో పేద, బడుగువర్గాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో సంచార వైద్యశాల ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఐదురోజులు వేర్వేరు ప్రాంతాల్లో జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులు, నీరసం వంటి సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స అందిస్తున్నారు. సోమవారం యూసుఫ్‌గూడ వెంకటగిరి, మంగళవారం బోరబండ సైట్-3 కాలనీ, ఎస్పీఆర్ హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీల్లో సేవలు అందించగా, బుధవారం బోరబండ పరిసర ప్రాంతల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, గురువారం మల్కాజ్‌గిరి, శుక్రవారం బషీర్‌బాగ్ ప్రాంతాల్లో సేవలు అందించనున్నట్లు యునానీ పరిశోధన కేంద్రం రీసెర్చ్ ఆఫీసర్ డా.రాజారామ్ తెలిపారు. తమవద్దకు వచ్చే రోగులకు మందులతో పాటు సూచనలు ఇస్తున్నామని అవసరమైన వారిని ఎర్రగడ్డలోని పరిశోధన కేంద్రానికి పంపిస్తామని చెప్పారు.

తారురోడ్డుకు పగుళ్లు... రాకపోకలకు తంటాలు

కొనసాగుతున్న ఫలక్‌నుమా వంతెన మరమ్మతులు


పనులను పర్యవేక్షిస్తున్న జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న, పోలీసు అధికారులు


కుంగుతున్న రోడ్డు

కేశవగిరి, న్యూస్‌టుడే: ఫలక్‌నుమా ఆర్వోబీ కట్టపై ఒకవైపు పనులు పూర్తవడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రెండోవైపు నూతన సమాంతర బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆధునికీకరణ పూర్తయిన ఆర్వోబీ రోడ్డుకు రక్షణగా ఇసుక సంచులను ఏర్పాటు చేసి మట్టి తవ్వి పనులు చేపడుతున్నారు. భారీ వర్షానికి సోమవారం రాత్రి వరద పోటెత్తడంతో ఇసుక సంచులు కిందకు జారాయి. అదే సమయంలో రోడ్డు కింద కొంత మట్టి కొట్టుకుపోగా తారు రోడ్డుకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తిగా పగుళ్లు ఏర్పడ్డాయని వదంతులు వ్యాపించడంతో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. బహదూర్‌పుర నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, ఇతర నేతలు రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యగా రహదారిపై భారీ వాహనాలు, బస్సుల రాకపోకలను నిషేధించారు. మంగళవారం కట్టవద్ద మరమ్మతు పనులను రైల్వే అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, ఫలక్‌నమా ట్రాఫిక్ సీఐ ఎన్.మోహన్‌రావు పర్యవేక్షించారు. మరో రెండురోజుల్లో మరమ్మతు పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

దసరా ఉత్సవ సమితి కార్యవర్గం

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా బోగి బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.అనిల్ కుమార్, కోశాధికారి పి.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా నవరాత్రులు, బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభకు సంబంధించిన వివరాలు, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, 2 ఫోటోలను దరఖాస్తుకు జతి చేసి వారి కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా ధ్రువీకరించి 25న జిల్లా యువజన, క్రీడా కార్యాలయం, జింఖానా గ్రౌండ్స్‌లో సమర్పించాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఎస్ రవి 9293312848, శ్రీనివాస్ మూర్తి 9985348889 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కిషన్‌గంజ్ నాలాలో మట్టిని తొలగించాలని వినతి

బేగంబజార్, న్యూస్‌టుడే: కిషన్‌గంజ్ నాలాలో పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలను తొలగించాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ బల్దియా ఇంజినీర్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి కిషన్‌గంజ్ నాలా, రిసాలా అబ్దుల్లాతోప్‌ఖాన తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వర్షం కురిసిన ప్రతీసారి వరద ప్రవాహంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నివేదిక ఇచ్చామని కార్పొరేటర్ తెలిపారు. నేతలు గోపాల్, కౌశిక్, కట్టప్ప, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం రైతుబజార్‌లో కూరగాయల ధరలు

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: (సోమవారం నాటి ధరలు, కిలో రూ.లో)టమాటా 43, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, కాకరకాయ 45, బీరకాయ 45, క్యాబేజీ 23, బీన్స్ 60, క్యారెట్ 43, దొండ 40, చిక్కుడుకాయ 70, గోకరకాయ 40, బీట్‌రూట్ 25, క్యాప్సికం 65, ఆలుగడ్డ 40, కీర 28, దోసకాయ 23, సొరకాయ 17, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 55, చామగడ్డ 35

లక్ష్యం నెరవేరాలంటే.. ప్రతిభ, పట్టుదల అవసరం


రాఖీ కంకారియాను సత్కరిస్తున్న సురేష్‌కుమార్ సింఘాల్, దర్పణ్ వాసుదేవ్, కె.కె.మహేశ్వరి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: అనుకున్న రంగంలో రాణించడానికి ప్రతిభ, యోగ్యతే కాదూ.. సాధించాలనే పట్టుదల అవసరమని వక్తలన్నారు. మంగళవారం సాయంత్రం రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో 'కాటలిస్ట్ ఎఫెక్ట్' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిపుణుడు దర్పణ్ వాసుదేవ్ మాట్లాడుతూ.. కష్టపడి కాదు.. ఇష్టపడి పని చేయాలన్నారు. వ్యాపారాన్ని ఒక కళగా చూడండి, కళాకారుడిగా మారండి, అప్పుడే అద్భుతాలు చూస్తారన్నారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. పెట్టుబడులు పెట్టి నాణ్యత విషయంలో రాజీపడకూడదని పేర్కొన్నారు. ఎఫ్‌టీసీసీఐ టూరిజం కమిటీ ఛైర్‌పర్సన్ రాఖీ కాంకారియా, ఎఫ్‌టీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ కె.కె.మహేశ్వరి పాల్గొన్నారు.

పాదబాటపై దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత

సుల్తాన్‌బజార్: పాదబాటపై దొరికిన పర్సును ఇద్దరు చిరు వ్యాపారులు పోలీసులకు అప్పగించి మానవత్వాన్ని చాటుకున్నారు. 22న మధ్యాహ్నం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల బస్టాప్ సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై పడి ఉన్న పర్సును స్థానికంగా చిరు వ్యాపారం నిర్వహించే రమేశ్, ఆనంద్ కుమార్‌లకు దొరికింది. అందులో మూడున్నర తులాల నగలతో పాటు నగదు ఉన్నట్టు గుర్తించి స్థానిక సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించారు. పర్సు పోగొట్టుకున్నవారు ఠాణాలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి పేర్కొన్నారు.

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్- 2024 గోల్ఫ్‌టోర్నీ 26 నుంచి


టోర్నీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గోల్కొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో 26 తేదీ నుంచి తెలంగాణ గోల్కొండ మాస్టర్స్- 2024 గోల్ఫ్‌టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గోల్ఫ్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టోర్నీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జీఏ), ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ)ల ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నీలోని విజేతలకు రూ.కోటి బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నీలో టాటాస్టీల్ పీజీటీఐ ర్యాంగింగ్ లీటర్ అహ్లావత్, మను గందాస్, ఉదయన్ మానే, శౌర్య బిను, కరన్‌ప్రతాప్ సింగ్‌లతో పాటు అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీజీటీఐ సీఈవో ఉత్తమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పేషెంట్లతో ఉస్మానియా కిటకిట

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్దదైన ఉస్మానియా ధర్మాసుపత్రి ఇన్‌పేషెంట్ల రద్దీతో కిటకిటలాడుతుంది. పాత భవనం మూసివేయడంతో రోగులకు సరైనన్ని పడకలు కరవయ్యాయి. సోమవారం 170 మంది మంగళవారం సాయంత్రం ఏడున్నర గంటల వరకు 190 మంది రికార్డు స్థాయిలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స నిమిత్తం చేరడం గమనార్హం. నగరం శివారుతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు, వారి వెంట వచ్చిన కుటుంబీకులు, పరామర్శించేందుకు వచ్చే సందర్శకులతో ఉస్మానియాలోని ఓపీ, కులీకుతుబ్‌షా భవనాల్లోని వార్డుల్లో రద్దీతో కిటకిటలాడుతోంది. పడకల్లేకపోవడంతో (ఫ్లోర్‌బెడ్స్) నేలపైనే రోగులు చికిత్సలు పొందుతున్నారు.

రోగులకు అసౌకర్యం కలగకుండా చికిత్సలు అందజేస్తున్నాం
– డా.రాకేశ్ సహాయ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

ఆసుపత్రిలో సాధారణంగా రోజూ 140 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతుంటారు. రెండు రోజులుగా వారి సంఖ్య పెరిగింది. అందుకు తగినట్లుగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ఏకరూప దుస్తుల పంపిణీ



కేశవగిరి, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (హెచ్‌డీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టనున్న 68వ బండ్లగూడ మండల స్థాయి ఆటల పోటీల్లో పాల్గొనబోతున్న చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తుల(జర్సీ)ను పంపిణీ చేశారు. చాంద్రాయణగుట్ట మున్సిపల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో బండ్లగూడ రేంజ్-1 ఉప విద్యాశాఖాధికారి ఎస్.లక్ష్మణ్‌సింగ్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నారాయణ పాల్గొన్నారు. బుధవారం నుంచి పాతబస్తీ అలియాబాద్‌లోని శారదా విద్యాలయంలో ఈ పోటీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వి.శ్రీనునాయక్, ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యమాల ద్వారానే మహిళలపై దాడుల నిరోధం


మాట్లాడుతున్న శ్రీదేవి చిత్రంలో శ్రీనివాస్, సంధ్య, అనసూయ, అరుణ

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: మహిళలపై అత్యాచారాలు, దాడులు, రోజురోజుకీ పెరిగిపోతున్నాయని పలు మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బలమైన ఉద్యమాల ద్వారానే మహిళలపై జరుగుతున్న దాడులను నిరోధించవచ్చని తెలిపారు. ఈ మేరకు చైతన్య మహిళా సంఘం 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు వి.సంధ్య హాజరయ్యారు. మహిళలు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలకు తగిన రక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో కన్వీనర్ శ్రీదేవి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు కళల్లో ప్రావీణ్యం సాధించాలి


కళాకారులను సత్కరించిన వసుంధర, మాధవీమాల తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పిల్లలు చదువులతో పాటు కళల్లో ప్రావీణ్యాన్ని సాధించాలని, అప్పుడే భారతీయ మూలాల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందని వక్తలన్నారు. మంగళవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో తెలంగాణ సంగీత, నాటక అకాడమి సౌజన్యంతో జాతీయ స్థాయి సంగీత నృత్య పోటీలు జరిగాయి. రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర హాజరై భారతనాట్య గురువులు హరిమంగళంపల్లి, సత్యనేమానీలకు సమితి పక్షాన సత్కరించి మాట్లాడారు. యువ కళాకారులందరూ మన సాంస్కృతిక రాయబారులని అన్నారు. అతిథులు నర్తకి మాధవీమాల, బి.విశాలాక్షి పాల్గొన్నారు. కార్యక్రమానికి సుధామాల అధ్యక్షత వహించగా నాట్యగురువులు మధుమతి కులకర్ణి, సంధ్యారాణి, స్నేహ రాంచందర్, లక్ష్మీ మానస భారతనాట్య కార్యక్రమానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

డ్రైనేజీలు పొంగి.. ఇబ్బందులు తెచ్చి



చాంద్రాయణగుట్ట: వర్షాలకు పాతబస్తీలో డ్రైనేజీలు నిండి పొంగుతున్నాయి. ఓ వైపు వర్షపు నీరు, మురుగు రోడ్లపై పారుతుండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఛత్రినాక నుంచి ఉప్పుగూడ ఆర్‌యూబీ వెళ్లే మార్గంలో వివేకానంద నగర్ కమాన్ వద్ద డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్డుపై వరదలా పారుతోంది. అధికారులు స్పందించి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నవోదయ సేవా సంఘం బస్తీ కమిటీ ఎన్నిక

బేగంబజార్, న్యూస్‌టుడే: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సుదీర్ఘకాలం పోరాట ఉద్యమాల ఫలితాలను మాదిగలంతా సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె.రాములు అన్నారు. మంగళ్‌హాట్ ఇందిరానగర్‌లోని నవోదయ సేవా సంఘం బస్తీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించే రామకృష్ణ 543 ఓట్లతో కమిటీ అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఎన్నికల కమిటీ ఛైర్మన్‌గా కె.రాములు, అధికారిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సమన్వయకర్తగా లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఎం.రామకృష్ణకు అభినందనలు తెలియజేస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన: ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన యాదయ్య

మొయినాబాద్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను 33మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనతో అన్ని వర్గాల ప్రజల కష్టాలు దూరమవుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ గౌతంకుమార్, ఎంపీడీవో సంధ్య, పీసీసీ సభ్యుడు దర్శన్, పట్నం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

చేవెళ్ల, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ వాటర్‌మెన్లకు ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని వాటర్‌మెన్లకు ఇస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే మరమ్మతులు చేయాలని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ రాజేశ్, డీఈఈ శిరీష, ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఏఈలు చంద్రమోహన్‌రెడ్డి, ప్రఫుల్, గీతా ప్రవంతి, ఏపీఓ వీరాసింగ్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు



ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపల్ చిన్నపురెడ్డి

చేవెళ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో చేవెళ్ల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ చిన్నపురెడ్డి తెలిపారు. అండర్-14 విభాగంలో ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించి ట్రోఫీ అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని విద్యార్థులకు సూచించారు.

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

షాబాద్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డా.దామోదర్ తెలిపారు. మంగళవారం చందనవెల్లి, షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఏఈఓ వీరాసింగ్, వైద్యులు స్వర్ణలత, మెహరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రతను నిర్లక్ష్యం చేయొద్దు

శంషాబాద్: పారిశుద్ధ్య కార్మికులు తమ వ్యక్తిగత శుభ్రతను నిర్లక్ష్యం చేయొద్దని ప్రభుత్వ వైద్యాధికారి దివ్యశ్రీ పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మంగళవారం మున్సిపల్ కేంద్రంలో అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు, భద్రత సామగ్రిని అందజేశారు. పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

హిమాయత్‌సాగర్‌కు వరద తాకిడి



అమ్మాపూర్ వద్ద ఈసీ వాగులో పారుతున్న నీరు

మొయినాబాద్, బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: హిమాయత్‌సాగర్ జలాశయానికి వరద ప్రవాహం చేరుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వానలతో ఎగువ ప్రాంతాలైన మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్ మండలాల నుంచి ఈసీ వాగులో వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో జలాశయంలోకి నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. మంగళవారం రాత్రి వరకు జలాశయం నీటిమట్టం 1762.20అడుగులకు చేరినట్లు జలమండలి అధికారులు తెలిపారు. ప్రవాహం మరింత పెరిగితే గ్రస్టుగేట్లను ఎత్తే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

బడి బస్సులు భద్రమేనా..?

● తరచూ ప్రమాదాలకు గురవుతున్న వైనం ● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



రోడ్డు పక్కకు కూరుకుపోయిన బస్సు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల డివిజన్ పరిధిలో పాఠశాలల బస్సులు ఇటీవల తరచూ ప్రమాదాలకు గురవుతుండటంతో విద్యార్థుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీలు నిర్వహించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులతో నెట్టుకొస్తుండటంతో అవి ఎక్కడపడితే అక్కడే మొరాయిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం చేవెళ్ల మండలంలోని ఇక్కారెడ్డిగూడ నుంచి విద్యార్థులతో వస్తున్న ఓ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. అంతకు ముందు ఓ పాఠశాల బస్సు చేవెళ్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో మరమ్మతులకు గురైంది. ఇలాంటి ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పరిమితికి మించి ప్రయాణం..

చేవెళ్ల పట్టణ కేంద్రంలో 8 ప్రైవేట్ పాఠశాలలు, 60కి పైగా బస్సులు ఉన్నాయి. సుమారు 3వేల విద్యార్థులు ఆయా పాఠశాలల బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. యాజమాన్యాలు దూరాన్ని బట్టి విద్యార్థుల నుంచి బస్సు ఫీజులను వసూలు చేస్తున్నాయి. అయితే చాలా వరకు ఫిట్‌నెస్ లేని బస్సులతోనే నెట్టుకొస్తున్నారు. ఒక్కో బస్సులో పరిమితికి మించి చిన్నారులను ఎక్కిస్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ అభ్యంతరం చెబుతున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

పట్టించుకోని విద్యాశాఖ...

ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ పర్యవేక్షణ కొరవడింది. అధికారులెవరూ ప్రైవేటు బడుల వైపు చూడకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆర్టీఏ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించకపోవడంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులను ఉపయోగిస్తున్నాయి. దీంతో అవి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల ప్రమాదానికి కారణమైన ఓ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ లేదంటూ ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. తనిఖీలు నిర్వహించి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కాదని పలువురు తెలిపారు.

రసాయనాల వాడకంతో నేల నిస్సారం

చేవెళ్ల, న్యూస్‌టుడే: అధిక మోతాదులో రసాయన ఎరువుల వాడకంతో నేల నిస్సారమవుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త టి.లక్ష్మణ్ తెలిపారు. ప్రొ.జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం (తాండూరు) ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, పంటల చీడపీడల నివారణలో జీవ రసాయనాల ప్రాముఖ్యతపై మంగళవారం చేవెళ్లలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చనేది అపోహ మాత్రమే అన్నారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వాడకంతో నేల సారవంతాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు, వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈఓలు బాల కోటేశ్వర్‌రావు, స్వాతిప్రియ, రమ్య, రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

కొత్తూరు, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న గోదాం పై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఇనుములనర్వ గ్రామంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అఫిజాల్ మియా(40) ఏడాది క్రితం ఇనుములనర్వ గ్రామానికి వచ్చి మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 23న గ్రామ శివారులో నిర్మిస్తున్న గోదాంలో పని చేసేందుకు గుత్తేదారు వద్ద చేరాడు. అదే రోజు ప్రమాదవశాత్తు గోదాంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మియా అల్లుడు మాలిక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాంట్రాక్టర్ జాగ్రత్తలు తీసుకోకుండా పని చేయించడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

నవాబ్‌పేట: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నవాబుపేట మండల పరిధిలోని గురుకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ వివరాల మేరకు.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన చెక్కల అంజయ్య(35), ఇదే గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మయ్యతో కలిసి గురుకుంట గ్రామ శివారులోని మేకలకుంట దగ్గర చేపల పట్టేందుకు సోమవారం వెళ్లారు. అంజయ్య చేపలు పట్టేందుకు కుంటలో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలిపిన కుంటలో వెతకగా మంగళవారం శవం లభించినట్లు తెలిపారు. మృతుని భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో...

మొయినాబాద్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మొయినాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిగూడకు చెందిన దాసర్ల యాదయ్య(45) కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి తమ్ముడు నరసింహతో ఇద్దరూ విషయంలో గొడవ జరిగింది. అనంతరం యాదయ్య నిద్రించాడు. మంగళవారం ఉదయం లేచి చూసే సరికి మృతిచెందాడు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

కొందుర్గు: పిడుగు పాటుకు ఆవు మృతి చెందిన సంఘటన తంగెళ్లపల్లిలో చోటుచేసుకుంది. బాధిత రైతు గొల్లలింగం వివరాల మేరకు.. సోమవారం రాత్రి పశువుల కొట్టంపై పిడుగు పడి ఆవు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవు విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎస్పీపల్లిని సందర్శించిన టీజీఎస్ఐఆర్డీ



పర్యటిస్తున్న జేడీ పద్మజారాణి తదితరులు

కొత్తూరు, న్యూస్‌టుడే: గ్రామీణ స్థితిగతులు, అభివృద్ధి ప్రణాళికలపై డాక్యుమెంటరీ కోసం తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్(టీజీఎస్ఐఆర్డీ)సంయుక్త సంచాలకులు పద్మజారాణి మంగళవారం కొత్తూరు మండలంలోని ఎస్పీపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామీణ వాతావరణం, సమస్యలు, వాటి పరిష్కారం దిశగా వేసిన అడుగులు, పురోగతిపై రాజీవ్ ప్రజా ప్రతినిధులకు, నూతన అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఓ పంచాయతీని ఉదాహరణగా తీసుకుని డాక్యుమెంటరీ రూపొందించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఎస్పీపల్లితో పాటు కేశంపేట మండలంలోని కొందార్డిపల్లి గ్రామాన్ని సైతం వారు సందర్శించారు. ఎస్పీపల్లి మాజీ సర్పంచి అంబటి ప్రభాకర్ తన హయాంలో ఎదురైన సమస్యలు, జరిగిన అభివృద్ధి, గ్రామీణ పరిస్థితులను వివరించారు. ఎంపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అంజయ్య

నందిగామ: గ్రామాల్లో వాటర్ పైప్‌లైన్ లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అంజయ్య అన్నారు. నందిగామ మండల కేంద్రంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ డివిజన్‌స్థాయి గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ..గ్రామ మంచినీటి సహాయకుల ఎప్పటికప్పుడు మండల, నియోజకవర్గ స్థాయి అధికారుల సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. శిక్షణ నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుమతి తెలిపారు. మిషన్ భగీరథ ఈఈ రాజేశ్, ఎంపీఓ తేజ్‌సింగ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు



మొక్క నాటి నీరు పోస్తున్న కార్మికుడు

నార్సింగి, న్యూస్‌టుడే: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి చెత్త ఆటో వెళ్లి తడి, పొడి చెత్త తీసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు శానిటరీ సూపర్ వైజర్ అల్లిరామ్ తెలిపారు. చెత్త తీసుకురావడానికి 65 ఆటోలు పనిచేస్తున్నాయని, రోజూ 38 టన్నుల చెత్త సేకరిస్తున్నామన్నారు. చెత్త వేసిన చోట్ల శుభ్రం చేసి ముగ్గులు వేశారు. పూలకుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తెగిన కట్ట.. నిలిచిన రాకపోకలు



కొందుర్గు మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వెంకిర్యాల-తంగెళ్లపల్లి వాగు కట్ట తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచాయి.

-న్యూస్‌టుడే, కొందుర్గు

ఎంఎంటీఎస్‌ను షాద్‌నగర్ వరకు పొడిగించాలి



డీకే అరుణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

షాద్‌నగర్ న్యూస్‌టుడే: శంషాబాద్ వరకు నడుస్తోన్న ఎంఎంటీఎస్ రైలును షాద్‌నగర్ వరకు పొడిగించాలని ఎంపీ డీకే అరుణకు భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని ఎంపీ స్వగృహంలో వినతిపత్రం ఇవ్వగా ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. హంద్రీ ఎక్స్‌ప్రెస్‌ను మలక్‌పేటలో నిలిపేలా చూడాలని కోరగా రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీ పేర్కొన్నారని వివరించారు. భాజపా నాయకులు శ్రీనివాస్, మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై భర్త దాడి

కొత్తూరు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త తీవ్రంగా కొట్టిన సంఘటన తిమ్మాపూర్‌లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్త భార్యపై అనుమానంతో ఇంట్లో టీవీ సౌండ్ పెంచి ప్లాస్టిక్ పైపుతో కొట్టడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. కాళ్లు, చేతులు, ఛాతీ భాగాల్లో చర్మం కమిలిపోయింది. ప్రస్తుతం ఆమెకు చికిత్స జరుగుతోందని.. కోలుకున్న అనంతరం పూర్తి వివరాలు సేకరిస్తామని ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తుతెలియని మృతదేహం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లభ్యమైంది. అత్తాపూర్ పిస్తాహౌస్ ముందు ఓ వ్యక్తి పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి చూడగా అతడు మృతిచెంది ఉన్నాడు. మృతుడికి సుమారు 40 ఏళ్ల ఉంటాయని, బనియన్ పైన గోధుమరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే అత్తాపూర్ ఠాణాకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడిపై దాడి

శంషాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహపై దాడి చేసిన సంఘటన శంషాబాద్ మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. ముచ్చింతల్‌కు చెందిన నరసింహ కారులో శంషాబాద్ నుంచి ఇంటికి బయలుదేరారు. జిమ్స్ ఆసుపత్రి వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన కత్తుల జనార్దన్ తన అనుచరులతో కలిసి కారును అడ్డగించి దాడి చేశారు. మాట మాట పెరగడంతో కోపోద్రిక్తుడైన జనార్దన్, అతని అనుచరులు రాళ్లు, కర్రలతో దాడి చేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జిమ్స్ హోమియోపతి కళాశాల విద్యార్థులకు మద్దతుగా యాజమాన్యాన్ని నిలదీసినందుకు దాడి చేయించారని నరసింహ ఆరోపించారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ప్లాస్టిక్ వినియోగించొద్దని, చెత్త వేరు చేసి, వ్యర్థపదార్థాలను తొలగించాలని ర్యాలీ చేపట్టారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీ పత్రాల అందజేత

కొందుర్గు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల అమలవుతాయని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వైస్‌ఛైర్మన్ సయ్యద్ సాదిక్, కాంగ్రెస్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు మంగళవారం శ్రీరంగాపూర్‌లో మహాలక్ష్మి పథకం రాయితీ గ్యాస్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

డిగ్రీలో ప్రవేశాలకు గడువు పెంపు

చేవెళ్ల: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కాంచనలత తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్, సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

చేవెళ్ల: మద్యం తాగి వాహనాలు నడుపుతూ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వాహనదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి సాంబశివుడు అన్నారు. పోలీసుల తనిఖీల్లో చేవెళ్ల, శంకర్‌పల్లి, మొకిల, మొయినాబాద్ ఠాణాల పరిధిలో పట్టుబడిన వారి కోసం మంగళవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా కేసుల్లో పట్టుబడిన 108 మంది నుంచి రూ.2,93,500 జరిమానా వసూలు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

బస్సు సర్వీసులు నడపాలని విజ్ఞప్తి

బండ్లగూడజాగీర్: బండ్లగూడజాగీర్ నగరపాలిక పరిధిలోని కిస్మత్‌పూర్, ఆరెమైసమ్మ, సాయిబాబాకాలనీ, డిఫెన్స్‌కాలనీల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని స్థానికులు అధికారులను విన్నవించారు. మంగళవారం బస్సు భవన్‌లో చీఫ్ ఆపరేషన్ అధికారి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.

వసతులు కల్పించాలని..

జిల్లెడు చౌదరిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు బీజేవైఎం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ, మంచినీటి సరఫరా, క్రీడా స్థలం సరిచేయాలని కోరారు.

'భాజపాను బలోపేతం చేద్దాం'

చేవెళ్ల, న్యూస్‌టుడే: బూత్ స్థాయిలో భాజపాని బలోపేతం చేసినప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటవచ్చని భాజపా సీనియర్ నాయకుడు సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి, తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, మక్తగూడ గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మనోహర్‌రెడ్డి, లచ్చయ్యగౌడ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

చేగూర్‌లో స్వచ్ఛతా హీ సేవ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మండలం చేగూరు గ్రామంలో ముచ్చింతల జిమ్స్ మెడికల్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామస్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఔషధాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజేశ్వర్, కార్యదర్శి వీణ, ఎన్ఎస్ఎస్ విరాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో శ్రమదానం

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాన్ని మంగళవారం బండ్లగూడజాగీర్ నగరపాలిక పరిధిలో దర్గాఖలీజ్‌ఖాన్‌లో నిర్వహించారు. మాస్ క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఆజీజ్‌నగర్‌లోని కేవీకేహెచ్ యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర, స్థానిక కార్పొరేటర్ అస్లం బిన్ అబ్దుల్లా, డీఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, ఆర్‌ఓ శివ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయండి

కేశంపేట, న్యూస్‌టుడే: బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానాల్లో కొత్తవారిని సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు నోడల్ అధికారి చంద్రశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలి

శంషాబాద్: శ్రామికుల హక్కుల సాధన కోసం కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.బాలరాజు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, నాయకులు సీతారామయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన.. జనం హైరానా



రాధానగర్‌లో నిలిచిన వరద

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: మంగళవారం కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొన్ని రోడ్లపై వరద ప్రవాహానికి కోతకు గురయ్యాయి. వినాయకనగర్, మెడిసిటీ, కేకేనగర్, సంగం సిటీ, ఆదర్శనగర్, రాధానగర్, భవానీకాలనీ, హనుమాన్‌నగర్, బైరాగిగూడ, బాగ్యనగర్ కాలనీలు గత మూడు రోజులుగా కురుస్తోన్న వానలతో జలమయం అయ్యాయి. వరద ప్రవాహం బయటకు వెళ్లే మార్గాలు లేకపోవడంతో ఇళ్లల్లోకి వరద చేరింది. కాల్వలు, నాలాలను పునరుద్ధరించాల్సిన అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

మొక్కల పెంపకంపై అధ్యయనం


యాచారంలో పర్యటిస్తున్న అధికారులు

యాచారం, న్యూస్‌టుడే: యాచారం మండలంలో మొక్కల పెంపకం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను పంచాయతీరాజ్ (గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐరా సొల్యూషన్స్) ప్రతినిధులు మంగళవారం అధ్యయనం చేశారు. అంతర్జాతీయ కార్బన్ క్రెడిట్ ఒప్పందంలో భాగంగా ఈ అధ్యయనం చేపట్టినట్లు ప్రతినిధులు చెప్పారు. గున్‌గల్, గడ్డమల్లయ్యగూడెం, చౌదర్‌పల్లి, యాచారం గ్రామాల్లో అధికారులు పర్యటించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

పీసీసీ అధ్యక్షుడికి మాజీ ఎమ్మెల్యే సన్మానం


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న తీగల

మీర్‌పేట, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.మహేష్ కుమార్‌గౌడ్‌ను మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మంగళవారం సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని ఆయన.. తీగలను కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు పల్లె పాండుగౌడ్, రవిగౌడ్, సిద్దాల బాలప్ప, జంగయ్యగౌడ్, నాగేందర్‌గౌడ్, ప్రమోద్, సత్యనారాయణ, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు నేడు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కప్పాడ్‌లో బుధవారం ఉదయం 11గంటలకు ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి నవీన తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వస్తారని తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: చిరుధాన్యాలు, అంకురాలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని సీడీపీవో తులసి, డాక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం చర్లపటేల్‌గూడలో మహిళా సంఘాల సభ్యులకు రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

బొంగులూరులో చెత్త తొలగింపు

ఆదిభట్ల: బొంగులూరు ఔటర్ రింగ్‌రోడ్ జంక్షన్ వద్ద మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, అధికారులు చెత్త తొలగించారు. పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

యాచారం: పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు యాచారం ఎంపీవో శ్రీలత చెప్పారు. మంగళవారం మాల్, మంతన్ గౌరెల్లి, నల్లవెల్లి, తమ్మలోనిగూడెం, కేసీ తాండాల్లో పారిశుద్ధ్య కార్మికులకు యాచారంలో వైద్య పరీక్షలు చేయించారు.

విజయ డెయిరీకి నిధుల మంజూరు

మాడ్గుల: మాడ్గుల విజయ డెయిరీకి రూ.30 లక్షలు మంజూరయ్యాయని డెయిరీ ఛైర్మన్ బి.సాయిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి.కిషన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలు మంజూరయ్యాయన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

మహేశ్వరం: అమీర్‌పేటకు చెందిన గజ్జెల యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. యాదయ్యతో కలిసి 1998లో పదోతరగతి చదువుకున్న మిత్రులు.. రూ.31 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

పేదలకు ఉప్పల ట్రస్టు సాయం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలంలో ఉప్పల ట్రస్టు నుంచి మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్.. పలువురు పేదలకు ఇంటి నిర్మాణ సామగ్రి అందించారు.

కొత్త రేషన్ కార్డులు.. చిగురిస్తున్న ఆశలు



మహేశ్వరం, న్యూస్‌టుడే: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడితే కొత్తవి మంజూరు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. మంత్రులు, అధికారులతో ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలని, అక్టోబరు 2 నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారితో పాటు కొత్తవారు దరఖాస్తు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొన్ని తహసీల్దార్ లాగిన్లలో.. మరికొన్ని డీఎస్‌వో లాగిన్లలో ఉన్నాయి. కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 50,706 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆహార భద్రతకు భరోసా..

పేదల ఆర్థిక పరిస్థితికి రేషన్ కార్డులు అద్దం పడతాయి.. ఆహారభద్రతకు భరోసా కల్పిస్తాయి. దీంతోనే పలు పథకాలు అందుతాయి. కార్పొరేట్ దవాఖానాల్లో ఉచిత వైద్యం పొందడానికి దోహదపడతాయి. విద్యార్థులకు అవసరమయ్యే ఆదాయ ధ్రువపత్రాలకు ప్రామాణికంగా మారుతున్నాయి. ఎంతో లబ్ధి చేకూర్చే ఈ కార్డుల పంపిణీని కొన్నేళ్ల క్రితం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. చాలామంది ఎదురు చూస్తున్న తరుణంలో కొత్త సర్కారు తీపికబురు చెప్పింది.

• పెండింగ్‌లో 50,706 దరఖాస్తులు
• అక్టోబరు 2 నుంచి మళ్లీ స్వీకరణకు ఏర్పాట్లు

కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల వారీగా దరఖాస్తులు..

సరూర్‌నగర్:	42,271
బాలాపూర్:	3,297
కందుకూరు:	2,043
మహేశ్వరం:	1,495
ఆమనగల్:	547
కడ్తాల్:	541
తలకొండపల్లి:	512

పథకాలకు దూరం..

వేలాది మంది కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తవి ఇవ్వకపోవడం, పాత వాటిలో మార్పులు, చేర్పులకు వీలుకాక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. గతంలో చిన్నారుల పేర్ల నమోదుకు, నూతన కార్డులకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభించలేదు. కొత్తగా వివాహం చేసుకున్నవారు, దశాబ్దకాలంగా జన్మించిన చిన్నారుల పేర్లు కార్డుల్లో చేర్చేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు.

అధిక ధరకు బియ్యం దుకాణాల్లో కొంటున్నాం

– నందిగామ సమంత, కొళ్లపడకల్

ఆహార భద్రత కార్డు లేక మార్కెట్‌లో ఎక్కువ ధరకు బియ్యం కొనాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ ప్రకటనతో ఈసారైన కార్డు మంజూరవుతుందని ఆశగా ఉంది. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసినా కార్డు రాలేదు. త్వరగా ఇవ్వాలి.

రైతు సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే


రైతులకు పనిముట్లు ఇస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పలువురి రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. మంగళవారం తుర్కయంజాల్‌లో రైతుసంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు కొత్త కుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం రూ.4.20కోట్ల లాభాల్లో నడవడం అభినందనీయమన్నారు. అనంతరం 3672 మంది రైతులకు రూ.21,62,578లను డివిడెండు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, సీఈఓ రాందాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో లార్డ్స్ పాఠశాల విద్యార్థి ప్రతిభ


జిల్లెలగూడలో విద్యార్థిని అభినందిస్తున్న బీరప్ప

మీర్‌పేట: చదువుతో పాటు మనోవిజ్ఞాన పోటీల్లో విద్యార్థులు రాణించాలని జిల్లెలగూడ లార్డ్స్ విద్యాసంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్‌ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లాస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో రెండవస్థానం సాధించిన పాఠశాల విద్యార్థి మనోజ్ఞను మంగళవారం వారు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రధానోపాధ్యాయుడు మరియన్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం.. ప్రయాణికులకు ఆటంకం


బొంగులూరు వద్ద సాగర్ రహదారిపై భారీగా నిలిచిన వరద

ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. బొంగులూరు సమీపంలోని వేద గార్డెన్ వద్ద ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో భారత్ గార్డెన్ సమీపంలో రోడ్డుపై నీరు చేరింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల గంటకుపైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ◆ నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. పిడుగు పడి.. పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. వివిధ గ్రామాల్లోని ఇళ్లల్లో గృహోపకరణాలు దెబ్బతిన్నాయి.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి

యాచారం: యాచారం మండలం కిషన్‌పల్లిలో పిడుగుపాటుతో రెండు పాడి ఆవులు మృతి చెందాయి. రైతు కలకొండ నర్సింహ సోమవారం రాత్రి ఆవులను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈక్రమంలోనే ఆవులు కట్టేసిన స్థలానికి కొద్దిదూరంలో పిడుగు పడింది. రెండు ఆవులు ప్రాణాలువదిలాయి. తహసీల్దారు అయ్యప్పకు రైతు ఫిర్యాదు చేశాడు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని పేర్కొన్నాడు.

ఓటరు జాబితాపై సమీక్ష

ఆదిభట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాతోపాటు పలు అంశాలపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా ఎన్నికల విభాగం అధికారి నాగార్జున పాల్గొన్నారు.

మరమ్మతులకు వినతి

ఆమనగల్లు, కడ్తాల్, న్యూస్‌టుడే: జాతీయ రహదారికి మరమ్మతులు చేయాలని కడ్తాల్ మండలానికి చెందిన యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు కోరారు. ఈ మేరకు వారు.. రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

లయన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

తలకొండపల్లి: లింగరావుపల్లిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి రీజియన్ ఛైర్మన్ శ్రీను ప్రారంభించారు.

సత్కారాలతో మరింత బాధ్యత


చిలుక మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురం వాసవీ కాలనీలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని, మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, డైరెక్టర్లు బండి మధుసూదన్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, గణేష్‌నాయక్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సైదులు, ముప్పిడి లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంచాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంచాలలో ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. – మంచాల, న్యూస్‌టుడే

పిగ్లిపూర్‌లో భూ వివాదం.. పరస్పర దాడులు


గాయపడిన పిగ్లిపూర్ వ్యక్తి


గాయపడి..

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లిపూర్‌లోని ఓ లేఅవుట్‌లో రైతులు, స్థిరాస్తి వెంచర్ నిర్వాహకుల మధ్య చెలరేగిన వివాదం పరస్పరం దాడులకు దారితీసింది. తీవ్ర ఉద్రిక్తతకు కారణమైన ఈ ఘటన మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లిపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు ఏర్పాటు చేసిన ఓ స్థిరాస్తి లేఅవుట్‌లోకి వెళ్లిన గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇవి తమకు ప్రభుత్వం సీలింగ్ పట్టాలిచ్చిన భూములని పేర్కొన్నారు. స్థిరాస్తి సంస్థ వారిని అడ్డుకొని ట్రాక్టర్‌తో రోడ్లను దున్నే ప్రయత్నం చేశారు. స్థిరాస్తి సంస్థ ఉద్యోగులు.. రైతులను అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం.. రాళ్లు, కర్రలతో దాడుల వరకు వెళ్లింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి, ఇరు వర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అటు రైతులు, ఇటు స్థిరాస్తి సంస్థ యాజమాన్యం పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

స్థిరాస్తి సంస్థ యాజమాన్యంతో పాటు రైతులపై కేసులు

సర్వే నంబరు 17లో తమకు ప్రభుత్వం సీలింగ్ పట్టాలు ఇచ్చిందని రైతులు పేర్కొంటుండగా.. 17 బై1లో తాము కొనుగోలు చేసిన 42 ఎకరాల పట్టా భూముల్లోని 27 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ అనుమతులతో లేఅవుట్ ఏర్పాటు చేసినట్లు ఎంజీవై స్థిరాస్తి సంస్థ యాజమాన్యం పేర్కొంటోంది. తమ భూములని వెళితే స్థిరాస్తి సంస్థ నిర్వాహకులు.. తమపై దాడులకు పాల్పడ్డారని రైతులు ఆరోపించారు. దౌర్జన్యంగా లేఅవుట్‌లోకి ప్రవేశించి రోడ్లను ధ్వంసం చేస్తుంటే అడ్డుకున్న తమ సిబ్బందిపై రైతులు దాడి చేశారని ఎంజీవై సంస్థ యాజమాన్యం ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో ఇరువర్గాల్లోని పలువురుకి గాయాలయ్యాయి. రైతుల్లో ముత్తయ్య, నర్సింహ, సత్యనారాయణ, శంకర్‌తో పాటు మరికొందరు గాయపడగా, ఎంజీవై సంస్థ లేఅవుట్ సూపర్‌వైజర్ లోకేష్‌తో పాటు పలువురు సిబ్బందికి గాయాలైనట్లు ఫిర్యాదుల్లో వారు పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు.. రైతుల ఫిర్యాదుతో ఎంజీవై స్థిరాస్తి సంస్థ యాజమాన్యం, సిబ్బందితో పాటు పిగ్లిపూర్ గ్రామానికి చెందిన కొందరిపై అట్రాసిటీ కేసు, ఘటనలో గాయపడిన ఎంజీవై స్థిరాస్తి సంస్థ సిబ్బంది ఫిర్యాదుతో పలువురు రైతులపైనా కేసులు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపారు.


అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుస్టేషన్ వద్ద..

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం	80085 73290
ఇబ్రహీంపట్నం	80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్	98481 98888

ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

బాలాపూర్, కందుకూరు, ఆర్కేపురం, మంచాల, న్యూస్‌టుడే:

? బడంగ్‌పేట గాంధీనగర్-నాదర్‌గుల్ వరకు రహదారి అధ్వానంగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. – బాలకృష్ణ, నాదర్‌గుల్

◆ విస్తరణలో భాగంగా డివైడర్ పనులు జరుగుతున్నాయి. అవి త్వరగా పూర్తి చేస్తాం.– యాదయ్య, డీఈ, బడంగ్‌పేట కార్పొరేషన్.

? లేమూరు నుంచి రాచులూరు వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.–సతీష్‌రెడ్డి, ఏఈ

? గూడూరు గేటు సమీపంలోని గురుకుల పాఠశాల బస్సులు నిలిపేలా చర్యలు చేపట్టండి. –గురుకుల ఉపాధ్యాయురాలు

◆ ప్రయాణికులు ఉన్న చోట బస్సులు నిలిపేలా డిపో మేనేజర్లతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. – సరిత, ఎంపీడీఓ, కందుకూరు

? అల్కాపురి కాలనీ రోడ్డు నం-1లో మ్యాన్‌హోల్ పొంగుతోంది. – శ్రీనివాస్, అల్కాపురి కాలనీ

◆ వెంటనే సమస్య పరిష్కరిస్తాం – సురేష్, ఆర్కేపురం జలమండలి మేనేజర్

? మంచాల సహకార సంఘంలో రూ.లక్ష రుణం నాలుగేళ్ల క్రితం తీసుకున్నాను. అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదు.– బీరప్ప, ఆరుట్ల.

◆ కొన్ని సాంకేతిక కారణాలతో కొందరికి కాలేదు. త్వరలోనే రుణం మాఫీ అవుతుంది. – శ్రీనివాస్, సీఈఓ, మంచాల సహకార సంఘం

మహేశ్వరం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రావని ఎంపీడీవో శైలజారెడ్డి అన్నారు. దుబ్బచర్ల పంచాయతీలో మంగళవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ● పోషణ మాసోత్సవాల్లో భాగంగా మహేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతపై ఎంపీడీవో శైలజారెడ్డి అవగాహన కల్పించారు. సీడీపీవో శాంతిశ్రీ, డా.మల్లికార్జున్, కార్యదర్శి సుజాత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే వ్యాధులు దూరం


మహేశ్వరంలో చిరుధాన్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శైలజారెడ్డి

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎంపీడీఓ

మంచాల, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. మంగళవారం ముచ్చర్లకుంట తండాలో పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో సీఎం భార్య గీత జన్మదిన వేడుక

మాడ్గుల, న్యూస్‌టుడే: మాడ్గుల ఆడపడుచు, ముఖ్యమంత్రి రేవంత్ సతీమణి గీత జన్మదిన వేడుకను మంగళవారం మాడ్గులలో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద కేకు కోసి వేడుక నిర్వహించారు. ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


మాడ్గులలో కేకు కోస్తున్న గ్రామస్థులు

బాలాపూర్ గణేశ్ హుండీ ఆదాయం రూ.18 లక్షలు

బాలాపూర్, న్యూస్‌టుడే: బాలాపూర్ గణేశ్ హుండీ ఆదాయం రూ.18.06 లక్షలు వచ్చినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. నవరాత్రుల్లో రాష్ట్రవ్యాప్తంగా భక్తులు ఇక్కడకు వచ్చి మొక్కులు చెల్లించుకున్న విషయం తెలిసిందే. ఉత్సవ సమితి హుండీలను మంగళవారం లెక్కించింది. ఉత్సవాలు విజయవంతంగా జరిగిన సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, ఇతర సభ్యులు.. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లకు, బల్దియా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ భూపతి, ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తదితరులను సన్మానించారు.


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

భవన నిర్మాణాలకు నిధులివ్వాలి

మాడ్గుల, తలకొండపల్లి, న్యూస్‌టుడే: తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు. హైదరాబాద్‌లో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెల్జాల్‌కు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

కందుకూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ పేట్ల పరిశ్రమలో యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేమూరులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. లేమూరు గ్రామానికి చెందిన కందికంటి సాయికుమార్(22) గ్రామంలో ప్లాస్టిక్ పేట్ల పరిశ్రమ ఏర్పాటు నెలకొల్పి జీవనం సాగిస్తున్నాడు. సాయికుమార్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మిషన్‌మీద పడి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో సీఐ సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు సమస్యలపై ఆందోళన

తలకొండపల్లి: చుక్కాపూర్‌లో చిన్నపాటి వర్షానికే విద్యుత్తు సరఫరా నిలిచిపోతోందని.. సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు.. మంగళవారం విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ధర్నా చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు డి.యాదయ్య, జె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

కడ్తాల్: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ హైవే సీనియర్ ఇంజినీర్ సాయికుమార్ సూచించారు. కడ్తాల్ పాఠశాలలో మంగళవారం శుభ్రత, రోడ్డు భద్రతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు, నేషనల్‌హైవే అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ గణపతి లడ్డూ పంపిణీ

బాలాపూర్, న్యూస్‌టుడే: బాలాపూర్ గణేశ్ చేతిలోని లడ్డూను కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్న విషయం తెలిసిందే. బాలాపూర్‌లో మంగళవారం లడ్డూను గ్రామస్థులకు ఆయన స్వయంగా పంపిణీ చేశారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ఇబ్రహీంపట్నం: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇంఛార్జి ప్రిన్సిపల్ సురేష్ తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

పెద్దఅంబర్‌పేట్ ఛైర్‌పర్సన్ స్వప్న తొలగింపు

పెద్దఅంబర్‌పేట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న.. ఆ పదవిని కోల్పోయారు. ఈ మేరకు ఆమెను పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దఅంబర్‌పేట్‌లో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఆమెకు వ్యతిరేకంగా వివిధ పార్టీలకు చెందిన 17 మంది కౌన్సిలర్లు ఈనెల 13న జరిగిన అవిశ్వాస బలపరీక్షలో చేతులెత్తారు. ఆర్డీఓ నివేదిక మేరకు ఆదేశాలు వెలువడ్డాయి.



రహదారి.. గుంతల మయం

హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి ముచ్చర్ల గేటు వద్ద అధ్వానంగా మారింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, కందుకూరు

వ్యాధుల నివారణకు చర్యలు: ఆమ్రపాలి

ఈనాడు, హైదరాబాద్: నగరంలో నానాటికీ విస్తరిస్తోన్న కీటక జనిత వ్యాధుల కట్టడికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వైద్యాధికారులతో కలిసి డెంగీ, గన్యా, మలేరియా జ్వరాల నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్తీ దవాఖానాలు, స్థానిక ప్రజారోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రజలు వాటి ద్వారా సత్వర వైద్య సేవలు అందుకుంటున్నారని, జ్వరం పరీక్షల ఫలితాలను 24 గంటల్లో ఇచ్చేట్లు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు సైతం ఇంట్లో దోమలు ఉత్పత్తి కాకుండా, చుట్టూ ఉన్న నీటి నిల్వలను తొలగించుకోవాలని, పొడి వాతావరణంతో దోమల సమస్య దూరమవుతుందని సూచించారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఐకమత్యంతో బీసీల హక్కుల సాధన



గురునాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు

రవీంద్రభారతి: రాష్ట్రంలో బీసీ జనగణన జరిగి తీరుతుందని, రేవంత్‌రెడ్డి ఈ విషయంలో కంకణబద్ధులై ఉన్నారని వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు హామీ ఇచ్చారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో సబ్బండ వర్గాల సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సామాజిక వర్గాల కార్పొరేషన్ ఛైర్మన్లకు ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. రాష్ట్ర మత్స్యకార సహకార సంస్థ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తియుగంధర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీజీబీసీ ఛైర్మన్ టి.నిర్మలజగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, న్యూస్‌టుడే:

? బంజారాహిల్స్ రోడ్డు నం.14 శ్రీవేంకటేశ్వరనగర్‌లో కొన్ని నెలలుగా వీధిదీపం వెలగడం లేదు. దీంతో చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించగలరు.

– శ్రీనివాసరావు, స్థానికుడు, బంజారాహిల్స్

✔ ఆ ప్రదేశంలో నెలకొన్న సమస్య గురించి మాకెవ్వరూ ఫిర్యాదు చేయలేదు. ఎక్కడైనా సాంకేతిక లోపం తలెత్తిందేమో. సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధి దీపాల విభాగం), సర్కిల్–18

? బంజారాహిల్స్ రోడ్డు నం.13లోని వైట్ హౌస్ వెనుక ప్రాంతంలో చెత్త పేరుకుపోతుంది. కొంతమంది చెత్తను ఇక్కడికి తీసుకొచ్చి వేస్తున్నారు. దుర్వాసనతో పాటు పందుల బెడద పెరిగిపోయింది.

– రామారావు, స్థానికుడు, బంజారాహిల్స్

✔ పరిశీలించి, చెత్తను తరలించే ఏర్పాటు చేస్తాం.

– అమిత్, పారిశుద్ధ్య సూపర్‌వైజర్, సర్కిల్-18.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ప్రగతి నగర్‌లోని శ్రీసాయిరామ్ మ్యానర్ అపార్ట్‌మెంట్ సమీపంలో ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని వివరిస్తూ 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' శీర్షికన 'ఈనాడు' ప్రచురించిన కథనానికి స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు మరమ్మతులు చేయించారు.

నిందితులు.. కేరాఫ్ వాట్సాప్ గ్రూపులు!



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ముఖ్యమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంతో పాటు నిందితులను పట్టించడంలోనూ వాట్సాప్ గ్రూపులు ప్రస్తుతం కీలకంగా మారుతున్నాయి. మధురానగర్ ఠాణా పరిధిలో ఇటీవల జరిగిన రెండు సంఘటనల్లో అవే క్రియాశీలకంగా మారాయి. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంది. సామాజిక మాధ్యమాల్లో అందరూ స్పందిస్తున్నారు. ఫ్యామిలీ గ్రూప్, ఫ్రెండ్స్, కాలనీ సంక్షేమ సంఘం, అపార్ట్‌మెంట్ వాసులు, రాజకీయ పార్టీలు ఇలా ఇతరత్ర గ్రూపులను ఏర్పాటు చేసుకుని సమాచారాలను పంచుకుంటున్నారు.

కెమెరాలు అద్దెకు తీసుకొని మోసం..

కెమెరాలను అద్దెకు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న ఇద్దరిని వాట్సప్‌గ్రూప్ పట్టించింది. కల్యాణ్‌నగర్, అమీర్‌పేట్ ప్రాంతాల్లోని రెండు దుకాణాల్లో ఇద్దరు వ్యక్తులు కెమెరాలను రోజువారి అద్దెకు తీసుకున్నారు. ఐడీ ప్రూఫ్‌గా ఆధార్ కార్డులను ఇచ్చారు. నిందితులు కెమెరాలను తిరిగి ఇవ్వలేదు. చరవాణిలోనూ స్పందించకపోవడంతో కెమెరాలను అద్దెకు తీసుకుని మోసగిస్తున్నారని అద్దెకిచ్చే వ్యాపారుల గ్రూప్‌లో నిందితుల ఆధార్‌కార్డులను ఉంచారు. అప్పటి ఉంచి వ్యాపారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎల్లారెడ్డిగూడలోని షాపుకు ఇద్దరు వ్యక్తులు వచ్చి కెమెరాలు అద్దెకు కావాలని ఆధార్‌కార్డులను ఇవ్వడంతో అప్రమత్తమైన వ్యాపారి నిందితులను పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు.

నీటి ట్యాప్‌ల దొంగ పట్టివేత..

మధురానగర్ ఠాణా పరిధిలోని యాదగిరినగర్ బస్తీ వాసులు ఓ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బస్తీలో నిత్యం ఏదో ఒకచోట ఇళ్లలోని నీటి నల్లా(ట్యాప్)లు చోరీకి గురవుతున్నాయి. వాటిని చోరీ చేస్తున్న నిందితుడిని సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించి ఆ దృశ్యాలను బస్తీకి చెందిన గ్రూపులో షేర్ చేసి అందరినీ అప్రమత్తం చేశారు. ఓ వీధిలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి గ్రూప్‌లోని వీడియోలో ఉన్న నిందితుడు ఒక్కడే అని నిర్ధారించుకున్న బస్తీ వాసులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందాలి: కలెక్టర్



పాఠశాలలో పత్రాలను పరిశీలిస్తున్న అనుదీప్ దురిశెట్టి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ మండలం రాజభవన్ ఎదురుగల ఎంఎస్‌మక్తాలోని సోమాజిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 10వ తరగతి వరకు ఒకే చోట తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం ఉండటంతో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటున్నారు. పాఠశాల వెనుక గల కమ్యూనిటీ హాల్‌లో తరచూ కార్యక్రమాలతో విద్యాబోధన అంతరాయం కలుగుతోందని చెప్పారు. విద్యార్థుల సౌకర్యం కోసం పాత పాఠశాల స్థలంలో అన్ని హంగులతో నూతన పాఠశాల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తీరుపై ఆరా తీశారు. కార్పొరేటర్ విజయారెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేసి ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.40లక్షలు మంజూరు చేశారని తెలిపారు. డీఈఓ ఆర్.రోహిణి, ఈఈ షఫీ మియా, ప్రధానోపాధ్యాయులు మహమూద్‌అలీ, గయాసొద్దీన్, బస్తీ అధ్యక్షుడు ఎస్‌కే షరీఫ్ పాల్గొన్నారు.

పనీర్‌లో నట్టు.. శాకాహారం ఆర్డరు ఇస్తే మాంసాహారం



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తినడానికి హోటల్‌కు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలలోని వేర్వేరు హోటళ్లలో చోటుచేసుకున్న ఈ సంఘటనలపై వారు 'ఎక్స్' వేదికగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్‌లోని కాకే ది హట్టి హోటల్‌కు వెళ్లిన తనకు పనీర్‌లో నట్టు వచ్చిందని తన్మయ్ బాండియా అనే ఖాతాదారుడు వాపోయాడు. యజమానిని ప్రశ్నిస్తే అనుకోకుండా పడిపోయి ఉంటుందని సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఘటనలో బంజారాహిల్స్‌లోని బార్బిక్యూ నేషన్‌లో శాకాహార భోజనం ఆర్డర్ చేస్తే తనకు మాంసాహార పార్శిల్ వచ్చిందని, ప్లేటులో పెట్టుకొని తినే సమయంలో దీనిని గుర్తించామని అంకుష్ గోయల్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎక్స్‌లో తెలంగాణ సీఎస్‌కు ట్యాగ్ చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రెండు హోటళ్లలో చోటుచేసుకున్న ఈ సంఘటనలు నెట్టింట ఇప్పుడు వైరల్‌గా మారాయి.

45 ఠాణాలకు ట్రైనీ ఎస్సైలు



జూబ్లీహిల్స్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసిన ట్రైనీ ఎస్సైలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఇటీవలే పాసింగ్ ఔట్ పరేడ్ పూర్తి చేసుకున్న పలువురికి నగరంలోని వివిధ ఠాణాలలో ట్రైనీ ఎస్సైలుగా అవకాశం కల్పించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 45 ఠాణాలకు బ్యాచ్-1 నుంచి 73 మంది, బ్యాచ్-2లో 25 మందిని పంపించారు. గ్రేడ్-ఎ ఠాణాలకు ముగ్గురు, నలుగురు ట్రైనీ ఎస్సైలను కేటాయించారు. ఇప్పటికే పశ్చిమ మండలం, ఉత్తర మండలాల్లోని చాలా ఠాణాల్లో ఎస్సైల సంఖ్య తక్కువగా ఉండటంతో విధుల్లో ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కొన్ని సందర్భాలలో ప్రతి మూడు, నాలుగు రోజులకు ఒకసారి రాత్రి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తాజా కేటాయింపుల మేరకు పశ్చిమ మండలంలోని జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ ఠాణాలకు ముగ్గురు చొప్పున, బంజారాహిల్స్, పంజాగుట్ట ఠాణాలకు నలుగురేసి, ఎస్సార్‌నగర్, మధురానగర్ ఠాణాలకు ఇద్దరి వంతున మంగళవారం రిపోర్ట్ చేశారు. ఈ ఠాణాల్లో నెల రోజుల శిక్షణ అనంతరం గ్రేహౌండ్స్ శిక్షణకు వెళ్లి తిరిగి మరో నాలుగైదు నెలలపాటు ప్రస్తుతం కేటాయించిన ఠాణాల్లో వీరంతా విధులు నిర్వహించనున్నారు.

'పాడుతా.. తీయగా'తో వెలుగులోకి ఎందరో గాయకులు



రామాచారి దంపతులను సత్కరిస్తున్న డా.కె.వి.రమణాచారి, ఆర్పీ పట్నాయక్, ఓలేటి పార్వతీశం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఈటీవీలో ప్రసారమయ్యే 'పాడుతా.. తీయగా' ద్వారా ఎందరో గాయకులు వెలుగులోకి వచ్చి సినీ రంగంలో రాణిస్తున్నారని ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి. రమణాచారి అన్నారు. మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో పద్మవిభూషణ్ డా.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా గాయకుడు, సంగీత దర్శకుడు కొమండూరి రామాచారికి 'కిన్నెర-బాలు' పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. 27 ఏళ్లుగా పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా రామాచారి, ఉషా వంటి ఎందరో గాయనీ గాయకులు సంగీత ప్రపంచానికి పరిచయం అయ్యారన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం, శ్రీదేవల పర్స్ ఎండీ భోగరాజు మూర్తి మాట్లాడారు. కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ స్వాగతం పలికారు. అంతకు ముందు రామాచారి ఆధ్వర్యంలో లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమి విద్యార్థుల సంగీత విభావరి ఆకట్టుకుంది.

సుబ్రహ్మణ్యస్వామికి భస్మాభిషేకం



షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేట ఓయూ కాలనీ రామలింగేశ్వర ఆలయంలో మంగళవారం భస్మాభిషేకం భక్తి శ్రద్ధలతో చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

8 గంటలు శ్రమించి.. 9 నెలల చిన్నారి గుండె పదిలం చేసి

నిమ్స్, న్యూస్‌టుడే: తొమ్మిది నెలల చిన్నారికి అత్యంత అరుదైన గుండె సమస్యను శాశ్వతంగా నయం చేశారు నిమ్స్ వైద్యులు. ఆసుపత్రిలో బ్రిటన్ వైద్య బృందం సారథ్యంలో చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నాలుగు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఓ 9 నెలల చిన్నారి గుండెకి మంచి రక్తం సరఫరా కాకపోగా, ఎక్కువగా చెడు రక్తం సరఫరా కావడంతో గుండె పనితీరు మందగించింది. ఈ విషయం గుర్తించిన వైద్య బృందం ఉదయం 9 గంటల నుంచి ఎనిమిది గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స పూర్తి చేసింది. కొనిన వారాల వ్యవధిలో చిన్నారి పూర్తిగా కోలుకుంటుందని వైద్యులు భరోసా ఇచ్చారు. ఈ బృందంలో బ్రిటన్ వైద్యులు రమణ ధన్నపనేనితో పాటు నిమ్స్ కార్డియో థొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, ప్రొఫెసర్ గోపాల్ ఉన్నారు.

పేదల బస్తీల్లో యునాని సంచార వైద్యశాల



ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీలో సంచార యూనాని వైద్యశాల

బోరబండ, న్యూస్‌టుడే: ఎర్రగడ్డలోని చర్మ వ్యాధుల యునాని చికిత్స జాతీయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో పేద, బడుగువర్గాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో సంచార వైద్యశాల ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఐదురోజులు వేర్వేరు ప్రాంతాల్లో జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులు, నీరసం వంటి సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స అందిస్తున్నారు. సోమవారం యూసుఫ్‌గూడ వెంకటగిరి, మంగళవారం బోరబండ సైట్-3 కాలనీ, ఎస్పీఆర్ హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీల్లో సేవలు అందించగా, బుధవారం బోరబండ పరిసర ప్రాంతల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, గురువారం మల్కాజ్‌గిరి, శుక్రవారం బషీర్‌బాగ్ ప్రాంతాల్లో సేవలు అందించనున్నట్లు యునాని పరిశోధన కేంద్రం రీసెర్చ్ ఆఫీసర్ డా.రాజారామ్ తెలిపారు. తమవద్దకు వచ్చే రోగులకు మందులతో పాటు సూచనలు ఇస్తున్నామని అవసరమైన వారిని ఎర్రగడ్డలోని పరిశోధన కేంద్రానికి పంపిస్తామని చెప్పారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని ఓ మహిళ బోరబండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ స్వరాజ్‌నగర్‌కె చెందిన హఫీజ్‌ఖాన్ ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోకవడంతో ఆందోళన చెందిన భార్య బంధువుల, స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారం రోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డు రద్దు చేయమంటే.. నగదు దోచేశారు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డు రద్దు చేయమని బ్యాంకు అధికారులకు తెలియజేస్తే సైబర్ నేరగాళ్లు నగదు దోచేసిన ఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్యాణ్‌నగర్‌కాలనీలో నివసిస్తున్న ఎన్.నర్సింగరావు కారు డ్రైవర్. అతడి క్రెడిట్‌కార్డు రద్దు చేయమని ఆన్‌లైన్‌లో విన్నవించాడు. ఇది గమనించిన సైబర్ నేరగాళ్లు నర్సింగరావుకి ఫోన్ చేసి, చరవాణి నంబరుకు వచ్చిన ఓటీపీ చెపితే పని అయిపోతుందని నమ్మించారు. ఓటీపీ చెప్పిన కొన్ని క్షణాల్లో రూ.92 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా అయినట్లు వచ్చిన సందేశం రావటంతో వెంటనే బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్భాషలాడిన రికవరీ ఏజెన్సీపై ఫిర్యాదు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: అకారణంగా మహిళలను దూషించిన సుగుణ ఏజెన్సీపై బోరబండ ఠాణాలో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో నివసించే హారిక మరిది అఖిల్ హోటల్ నిర్వాహిస్తున్నాడు. హోటల్ నిర్వాహణకు అఖిల్ భారత్‌యాప్ ఖాతాలో లోన్ తీసుకోవడంతో క్యూఆర్ కోడ్ ఇచ్చారు. అఖిల్ తీసుకున్న లోన్ తిరిగి చెల్లించకపోవడంతో రికవరీ కోసం సుగుణ రికవరీ ఏజెన్సీకి అప్పగించింది. వారు ఫోన్ చేసినపుడు అఖిల్ లిఫ్ట్ చేయకపోవడంతో షూరిటీ కోసం ఇచ్చిన చరవాణి నంబర్ల ఆధారంగా హారిక నంబరుకు ఫోన్ చేసిన ఏజెన్సీ ప్రతినిధి అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బోరబండ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బోరబండ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఫసియుద్దీన్ అధికారులకు సూచించారు. సైట్-2 కాలనీ క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-19కు చెందిన వివిధ విభాగాల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

తాగునీటి సరఫరా పరిశీలన

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: జలమండలి ఓఅండ్ఎం డివిజన్-6 పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ మంగళవారం పర్యటించారు. ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా, నాణ్యత, సరఫరా స్థాయి, మురుగునీటి నిర్వహణ తదితరాలను పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపు

ఫిల్మ్‌నగర్: బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ ప్రాంతంలో విలువైన వివాదాస్పద స్థలంలో వెలిసిన ఆక్రమణల్ని షేక్‌పేట రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఏసీబీ కార్యాలయానికి ఎదురుగా 14 ఎకరాల స్థల వివాదం న్యాయస్థానంలో ఉంది. ఈ స్థలంలో కొందరు ఓ గదిని నిర్మించి గుడిసెలు వేసి స్థలం తమదేనంటూ ఆధీనంలోకి తీసుకున్నారు. అంతే కాకుండా ఈ స్థలం వద్ద నిత్యం కొందరు కాపలా ఉంటున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆక్రమణల్ని తొలగించాలని షేక్‌పేట రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ వై. అనితారెడ్డి ఆధ్వర్యంలో యంత్రాంగం అక్కడికి చేరుకుని నిర్మాణాలు తొలగించారు.

తిరుమల లడ్డూ అపవిత్రతకు పాల్పడిన వారిని శిక్షించాలి



ఖైరతాబాద్ గ్రంథాలయం కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తితిదేలో లడ్డూ అపవిత్రతకు కారణమైన వ్యక్తులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఖైరతాబాద్ శ్రీగణేశ్ ఉత్సవ కమిటీ ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం సాయంత్రం ఖైరతాబాద్ గ్రంథాలయ కూడలిలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కమిటీ నాయకులు మహేందర్ బాబు, మహేష్ యాదవ్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. లడ్డూలో అపవిత్రం విషయం హిందూ సమాజాన్ని కలిచి వేస్తుందన్నారు. ఘటనపై ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ నాయకులు అనిల్, వంశీ, ఎన్డీ నగేష్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మహాగణపతి కానుకల వివరాలు ప్రకటిస్తాం

ఖైరతాబాద్ మహా గణపతికి వచ్చిన కానుకల వివరాలను త్వరలోనే పూర్తి స్థాయిలో వెల్లడిస్తామని అడహక్ కమిటీ సభ్యుడు మహేందర్ బాబు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా సీసీ కెమెరాల నిఘాలో కానుకల లెక్కింపు ప్రక్రియ నిర్వహించినట్లు వివరించారు. కేవలం హుండీ ఆదాయమే రూ.75 లక్షలు వచ్చిందని, ప్రకటనలు, ఇతర దాతల సాయం తదితర వివరాలపై త్వరలో అడ్‌హక్ కమిటీ సమావేశమై లెక్కించాల్సి ఉందన్నారు. ఆ వివరాలన్నీ భక్తులకు తెలియజేస్తామని ప్రకటించారు.

ప్రజావాణికి 360 విన్నపాలు



సమస్యలు వివరిస్తున్న డిగ్రీ ఒప్పంద అధ్యాపకులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 360 వినతులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-138, విద్యుత్-38, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి-36, ఎస్సీ సంక్షేమం-26, మున్సిపల్ శాఖ-17, ఇతర శాఖలకు-105 వాటిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

డిగ్రీ ఒప్పంద అధ్యాపకుల గోడు పట్టించుకోండి

రాష్ట్రంలో దాదాపు 24 ఏళ్లుగా పనిచేస్తున్న డిగ్రీ ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావాణిలో విన్నవించారు. క్రమబద్ధీకరిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ముఖం చాటేసిందని, కొందరికి అర్హతలు లేకున్నా రెగ్యులర్ చేసిందని, మిగతా వారిని విస్మరించిదన్నారు. మానవతా దృక్పథంతో తమ సమస్య పరిష్కరించాలని కోరారు. విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి నిష్క్రమించారు.

రూ.10లక్షల విలువైన సీసీ కెమెరాల అందజేత



దాతలతో వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్, ఎస్.ఆర్.నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ ఠాణా పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఐజంట్ ఫార్మా డ్రగ్ రీసెర్చ్ సొల్యూషన్స్ ముందుకు వచ్చింది. వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్.ఎం. విజయ్‌కుమార్, ఎస్.ఆర్.నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ చొరవతో సామాజిక సీసీటీవీ ప్రాజెక్టులో భాగంగా రూ.10లక్షలు విలువచేసే కెమెరాలను సమకూర్చింది. అమీర్‌పేట మైత్రీవిహార్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండి శ్రీనివాస్‌వర్మ రుద్రరాజు, ఆయన కుమార్తె, సంస్థ డైరెక్టర్ సౌమ్య పోలీసు అధికారులకు వాటిని అందచేశారు.

న్యూసెన్స్ కేసులో ఇద్దరికీ 8 రోజుల జైలు

యూసుఫ్‌గూడ: వేర్వేరు కేసుల్లో న్యూసెన్స్ సృష్టించిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం ఎనిమిది రోజుల జైలుశిక్ష విధించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లోని సీవీఆర్ హాస్టల్‌లో ఉంటున్న రాజేష్‌బాబు ఈనెల 23న సాయంత్రం మధురానగర్ ప్రాంతంలో యువతులు, మహిళలను చూస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. సిటీ పోలీస్ యాక్ట్ కింద రాజేష్‌బాబుపై పెట్టి కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని 10వ స్పెషల్ కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. న్యాయమూర్తి మంద మురళీ శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు.

మరో కేసులో: రహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హాషం డ్రైవర్. ఈనెల 23న రహ్మత్‌నగర్ ప్రాంతంలోని ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 10వ స్పెషల్ కోర్టులో మంగళవారం న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో కార్పొరేటర్లు

బంజారాహిల్స్: ఈశాన్య రాష్ట్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మున్సిపల్ శాఖ చేపడుతున్న చర్యలపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డితో పాటు వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, నగరంలోని పలు డివిజన్ల కార్పొరేటర్లు 'జీహెచ్‌ఎంసీ స్టడీ టూర్' పేరిట ఇటీవల తరలివెళ్లారు. వారంతా మంగళవారం షిల్లాంగ్ పట్టణ పురపాలకశాఖ బోర్డు కార్యాలయాన్ని సందర్శించి అక్కడి అధికారులను అడిగి వివరాలు తెలుసుకొన్నారు. టూర్‌కు వెళ్లిన కార్పొరేటర్లలో రోజా, రాజు పటేల్ తదితరులు ఉన్నారు.

మొదటి పటాలంలో వార్షిక క్రీడాపోటీలు



క్రీడాకారులతో కరాచలనం చేస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పోలీస్ సిబ్బంది క్రీడలకు, వ్యాయామానికి ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యంగా, ఒత్తిడికి లోనవకుండా ఉండవచ్చని యూసుఫ్‌గూడలోని మొదటిపటాలం కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు. బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం వార్షిక క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టగ్గాఫ్‌వార్, టెన్నీస్, క్యారమ్స్, చెస్, 100, 400, 1500 పరుగు పోటీలను నిర్వహించనున్నట్లు కమాండెంట్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు అప్పారాయ్, భాస్కర్, చంద్రశేఖర్, ఆర్ఐలు శంకర్, సురేష్, సాంబయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ అవసరం



శిబిరంలో వైద్య పరీక్షలు.

షేక్‌పేట, న్యూస్‌టుడే: వయసుతో సంబంధం లేకుండా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వీటిని నిర్లక్ష్యం చేయకూడదని షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (జీనిట్స్) ప్రిన్సిపల్ డా.రమేష్ రెడ్డి అన్నారు. నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో పీక్యూ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ శారీరక వ్యాయామం, యోగా వంటి వాటికి సమయం కేటాయించాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల అకాడమిక్స్ డీన్ రామలింగారెడ్డి, అడ్మిన్ డీన్ అవధాని పాల్గొన్నారు.

శ్రీకృష్ణానగర్‌లో సీవరేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

యూసుఫ్‌గూడ: శ్రీకృష్ణానగర్‌లో సీవరేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం శ్రీకృష్ణానగర్ సీ-బ్లాకులో ఆయన పర్యటించారు. 30 ఏళ్లక్రితం వేసిన సీవరేజీ పైపులు దెబ్బతినడం, ప్రవాహం ఎక్కువ కావడం, వరద కాలువకు సీవరేజీ పైపులు అనుసంధానంగా ఉండటంతో వర్షం పడిన సమయంతో సీవరేజీ పొంగిపొర్లుతోందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవింగ్ కేసుల్లో పోలీసు, రవాణాశాఖల నిర్లక్ష్యం



రమన్‌జీత్ సింగ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన కేసుల విషయంలో పోలీసు, రవాణాశాఖలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని సామాజిక ఉద్యమకారుడు రమన్‌జీత్ సింగ్ పేర్కొన్నారు. ఈ విషయంలో మోటారు వాహన చట్టం సరిగా అమలు చేయని తీరుపై తాను హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయగా ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు వ్యాజ్యాన్ని ఈనెల 20న విచారణకు స్వీకరించిందన్నారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు రవాణా శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసిందని, నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఏటా సగటున 2.25 లక్షల డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవుతున్నాయని వివరించారు. చట్టం ప్రకారం మద్యం తాగి తొలిసారి పట్టుబడితే మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు, రెండోసారి పట్టుబడితే లైసెన్స్ పూర్తిగా రద్దు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో న్యాయవాది ఎంకే పాషా తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



జడ్పీ అపూర్వ్ చౌహాన్‌కు సమస్యలు వివరిస్తున్న బండి రమేశ్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ కోరారు. జడ్పీ అపూర్వ్ చౌహాన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాలానగర్, ఫతేనగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పలుచోట్ల రోడ్ల నిర్మాణం చేయాలన్నారు. నేతలు పుష్పారెడ్డి, లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ పీజీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు మంగళవారం విభాగం సెమినార్ హాల్లో ఘనంగా జరిగాయి. 2022-24 బ్యాచ్ ఎంఎస్సీ, ఎంటెక్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. ఆట, పాటలతో సందడి చేశారు. వర్సిటీ ప్రవేశాల విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సైదానాయక్, ఫ్యాకల్టీ రంజిత్, ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మరింత మెరుగవ్వాలి: ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో హరిశ్చంద్ర

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: విద్యాప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలని కూకట్‌పల్లి ఎంఈవో ఎం.హరిశ్చంద్ర అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కూకట్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల పరిధిలోని గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ తరగతులు మంగళవారం ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలపై వారికి ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గణితాన్ని సులభ పద్ధతుల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పడం ద్వారా, ప్రత్యేక శిక్షణతో జాతీయస్థాయిలో జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో ఫలితాలు మెరుగ్గా రాబట్టవచ్చని సూచించారు. మండల నోడల్ అధికారి కిషన్, కాంప్లెక్స్ నోడల్ అధికారి నరేందర్‌రెడ్డి, రీసోర్స్‌పర్సన్స్ నర్సింహులు, హరిణి తదితరులు పాల్గొన్నారు.

అతిథులను ఆకట్టుకునేదెలా?





జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఆడిటోరియంలో జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు నిర్వహిస్తుంటారు. అతిథులను ఆకట్టుకోవడానికి ఇక్కడ వాటర్ ఫౌంటెయిన్ నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అందులో చెత్త, నాచు పేరుకుపోయింది. పైపులు విరిగిపోవడంతో పనిచేయడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వర్సిటీ అధికారులు స్పందించి పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనల్లోనే

మోడల్ రైతుబజార్

కలగానే భరత్‌నగర్ మార్కెట్ ఆధునికీకరణ

మూసాపేట, న్యూస్‌టుడే: భరత్‌నగర్ కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ వ్యవహారం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా మారింది. ఇక్కడి మార్కెట్‌ను కైత్లాపూర్‌కు తరలించి 'మోడల్ రైతుబజార్' ను నిర్మిస్తామని రూపొందించిన ప్రతిపాదనలు ఆరేళ్లు గడుస్తున్నా కాగితాలను దాటలేదు. ఎమ్మెల్యే కృష్ణారావు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయడంతో ఈ అంశం మరోమారు తెరమీదకు వచ్చింది.

రైతుల నుంచి నేరుగా..

రైతులు పంటలను భరత్‌నగర్‌కు తెచ్చి హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తుంటారు. నగర శివారులోని చేవేళ్ల, శంకర్‌పల్లి, వికారాబాద్, తూప్రాన్, ఒంటిమామిడితోపాటు రాజమండ్రి, బెంగళూరు నుంచి కూరగాయలు, ఆకుకూరలు, మిర్చి వంటివి సరఫరా అవుతున్నాయి. షోలాపూర్ నుంచి ఉల్లిగడ్డలు, ఆగ్రా నుంచి ఆలుగడ్డలు, చెన్నై నుంచి మునగకాయలు దిగుమతి అవుతున్నాయి. తమకు వచ్చిన ధరకు కేవలం 4శాతం కమీషన్ కలుపుకొని హోల్‌సేల్ వ్యాపారులు రిటైల్ వ్యాపారులకు అమ్ముతారు. దీంతో ఈ మార్కెట్‌కు ఆదరణ దక్కుతుంది.

ప్రస్థానమిది..

1977లో కొందరు రైతులు కూరగాయల్ని ప్రస్తుత మార్కెట్ ప్రదేశంలో రోడ్డుపైనే విక్రయించేవారు. 1988 నుంచి 1991 వరకు భరత్‌నగర్-ఎర్రగడ్డ వంతెన పనులు కొనసాగడంతో మార్కెట్‌ను తాత్కాలికంగా ఎర్రగడ్డ చౌరస్తాకు మార్చారు. వంతెన ప్రారంభం కాగానే దాని కిందనే మార్కెట్‌కు ఆవాసం ఏర్పడినట్లయింది. ప్రస్తుతం ఇక్కడ అనుమతి పొందిన 74మంది వర్తకులతోపాటు 400మంది చిల్లర వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులు వంతెన దిగువన రోడ్లు భవనాల శాఖకు చెందిన ఖాళీ షెడ్లను అద్దెకు తీసుకుని హోల్‌సేల్ వ్యాపారులకు అప్పగించింది. చిల్లర వ్యాపారులకు మరో షెడ్డు నిర్మించి అద్దెలకిచ్చింది. సదరు షెడ్డుతోపాటు వంతెన కింద ఉన్న ఖాళీ ప్రదేశంలో వందలాది మంది వ్యాపారులు నిత్యం కూరగాయాలు విక్రయిస్తున్నారు. పరిసర చిల్లర వ్యాపారులు కూడా ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు.



హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు

ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

ప్రస్తుతం వంతెన కింద ఉన్న రోడ్లు, భవనాల శాఖ గోదాముల్లో హోల్‌సేల్ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. వంతెన దిగువన, దాని పక్కన మెట్రో అధికారులు నిర్మించిన షెడ్ల సముదాయంలో రిటైల్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడే మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లు ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ వ్యాపారాల్ని తరలించేందుకు మార్కెటింగ్ అధికారులు కైత్లాపూర్‌లో రాష్ట్ర గృహనిర్మాణ మండలికి చెందిన 5ఎకరాల్ని కేటాయించాల్సిందిగా ఆరేళ్ల క్రితం లేఖ రాశారు. ఇప్పటికీ స్థలం కేటాయింపు జరగలేదు.

అద్దెల భారంతో ఇబ్బందులు: కె.వెంకట్రావు, హోల్‌సేల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు



చిన్నపాటి షెడ్డుకు కూడా నెలకు అద్దె, విద్యుత్తు బిల్లులు, నిర్వహణ ఖర్చులతో రూ.20 వేలకు చేరుతుంది. లారీల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రతిపాదన అమల్లోకి వస్తే మాలాంటి వ్యాపారులతోపాటు ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుంది.

ఈనాడు మీతోడు

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

వ్యర్థాల తొలగింపు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి రంగధాముని చెరువు కట్టపై వ్యర్థాలు వదిలేయడంతో అపరిశుభ్రంగా మారింది. వినాయక నిమజ్జనంతో కొంత అపరిశుభ్రంగా, బురదగా మారగా ఈ విషయాన్ని మూసాపేట సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మూసాపేట, న్యూస్‌టుడే: మోతీనగర్ పరిధి బబ్బుగూడలో భూగర్భ మ్యాన్‌హోల్ ధ్వంసమైంది. రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మురుగు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యను జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాశ్‌కు 'ఈనాడు' వివరించింది. స్పందించిన ఆయన మంగళవారం సదరు మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరింపజేయించారు.

వర్షపు నీటి ఛాంబర్‌కు..



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డులో వర్షపు నీటి ఛాంబర్ వద్ద అధికారులు మరమ్మతులు చేపట్టారు. ధనలక్ష్మీ సెంటర్ నుంచి ఒకటో రోడ్డు వెళ్లే మలుపులో ఛాంబర్‌పై మూత కుంగింది. మలుపు కావడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. మూత కుంగితే గొయ్యి ఏర్పడే ఆస్కారముంది. దీన్ని బాగుచేయాలని 'ఈనాడు' జీహెచ్ఎంసీ ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త మూత వేయించి మరమ్మతులు చేయించారు.

గిజిగాడి గూడు చెదిరిపోకుండా..





ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చెట్లపై ఏర్పాటైన పక్షుల గూళ్లు చెదిరిపోతున్నాయి. దీంతో వాటిని పకడ్బందీగా తిరిగి నిర్మించుకుంటున్నాయి. కూకట్‌పల్లిలోని నల్ల చెరువు వద్ద ఓ చెట్టుపై పిచ్చుక గూడును పటిష్ఠంగా ఏర్పాటు చేసుకుంటూ కనిపించింది.

డొక్కు బస్సులతో ఇంకెన్నాళ్లు



పొగచూరిన మియాపూర్ డిపో బస్సు

ఈనాడు, హైదరాబాద్: డొక్కు బస్సులు నగరవాసులను హడలెత్తిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియని ఆందోళనతో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. గత రెండు నెలల్లో పదుల సంఖ్యలో మొరాయించడం, బ్రేక్‌డౌన్, సెల్ఫ్ ఇతర సమస్యలతో నడిరోడ్డుపై ఆగిపోయిన సందర్భాలున్నాయి. రోడ్డుపైకి ఎక్కిందంటే తిరిగి డిపోకు వెళ్లే వరకు డ్రైవర్, కండక్టర్‌కు టెన్షన్ తప్పడం లేదు. సిగ్నల్ వద్ద బస్సు నిలిపితే కదులుతుందో లేదా అనే అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. నగరంలో తిరిగే బస్సులే కాదు జిల్లాలకు వెళ్లే లగ్జరీ, రాజధాని వోల్వో బస్సుల్లోనూ ప్రయాణించేవారికి నరకం కనిపిస్తోంది. ఇటీవల విజయవాడ నుంచి కేపీహెచ్‌బీకి మియాపూర్ డిపో బస్సులో ఏసీ సరిగా పనిచేయలేదని, చెమటతో నరకం కనిపించిందంటూ ప్రయాణికుడు వాపోయారు. హైదరాబాద్ నుంచి నందిగామ వెళ్లిన గరుడలో ప్రయాణించిన మరో వ్యక్తికి ఈ తరహా అనుభవమే ఎదురైంది. షాక్‌అబ్జర్వర్లు పాడవ్వడంతో ప్రయాణం నరకంగా మారిందని వాపోయారు. గమ్యం చేరేవరకు శబ్దాలు కునుకుపట్టనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవింగ్ ప్యానెల్ దుస్థితి వర్ణించలేమని, విద్యుద్దీపాలు పనిచేయలేదని వాపోయారు.



బస్సులో ఏసీ పనిచేయలేదంటూ ఆర్టీసీ ఎక్స్ ఖాతాలో ప్రయాణికుడి ఫిర్యాదు

పాదచారుల వంతెన సామగ్రి తొలగింపు

స్పందనకు వందనం



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ఎట్టకేలకు జేఎన్‌టీయూ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న పాదచారుల వంతెన సామగ్రిని ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. రైతుబజారు దాటిన తర్వాత వాహనాలను రహదారిపై నిలపడం, రైతుబజారుకు వచ్చే వినియోగదారులు, వాహనదారులతో ఆ ప్రాంతంలో తీవ్ర రద్దీ నెలకొంటుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ఇటీవల రహదారిపైకి చేరిన దుకాణాలను తొలగించి రహదారి పునరుద్ధరించడంతో విశాలంగా మారింది. రైతుబజారు దాటిన తర్వాత మాత్రం పాదచారుల వంతెన నిర్మాణాలు ఆగి సుమారు ఏడేళ్లు కావొస్తోంది. అప్పటి నుంచి ఆ సామగ్రి వాహనదారులకు అడ్డంకిగా మారింది. సామగ్రి తొలగించి రహదారి విస్తరించాలని 'ఈనాడు' కథనాలు ప్రచురించింది. స్పందించిన జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకొని భారీ ట్రక్కులు తెప్పించి సామగ్రిని తరలించారు. రహదారిని విస్తరించేలా జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడతమని పోలీసులు తెలిపారు.

పేదలకు ఇళ్లు కేటాయించాలి: ఎమ్మెల్యే



అమ్మునగర్ తాండాను సందర్శించి జడ్పీ అపూర్వ్‌చౌహాన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఫతేనగర్, న్యూస్‌టుడే: వర్షాకాలంలో ముంపునకు గురవుతున్న నాలా పరివాహక అమ్మునగర్ తాండావాసులకు ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం జడ్పీ అపూర్వ్ చౌహాన్‌తో కలిసి ఆయన బస్తీలో పర్యటించారు. స్థానికంగా పరిస్థితిని ఆయనకు వివరించిన ఎమ్మెల్యే గతంలో కేసీఆర్ ప్రభుత్వం హయాంలో 130కుటుంబాలకు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించామన్నారు. మిగిలిపోయిన వారికి కైత్లాపూర్ వద్ద ఇళ్లు ఇవ్వడంతో ఇక్కడ బస్తీని ఖాళీ చేయవచ్చన్నారు. ఇళ్లు కేటాయించాల్సిన వారి వివరాలను జడ్సీకి అందజేశారు.

● కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని రాంప్రసాద్‌కు మంగళవారం శేషాద్రినగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.3లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు.

పగటి వెలుగులు.. ఆగని దుబారా



రంగధాముని చెరువు రోడ్డులో హైమాస్ట్ దీపాల వెలుగులు



మధ్యాహ్నం వెలుగుతున్న కేంద్రీకృత విద్యుత్ దీపాలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పగటి వెలుగుల రూపంలో కొన్ని మాసాలుగా కరెంటు దుబారా అధికమైంది. దీని వలన కరెంటు బిల్లుల రూపంలో ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. ఇంత జరుగుతున్నా.. సమస్య పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంది. ఎలక్ట్రికల్ గుత్తేదారు నుంచి స్పందన లేకపోవడం.. టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో అధికారులు సైతం చేసేదిలేక చేతులెత్తేశారు. మూసాపేట సర్కిల్ పరిధి కూకట్‌పల్లి రంగధాముని చెరువు రోడ్డులో జాతీయ రహదారి సమీపంలో జంక్షన్‌లో హైమాస్ట్ దీపాలు, కేంద్రీకృత విద్యుత్ దీపాల పగటి వెలుగుల కరెంటు వృథానే ఇందుకు తాజా నిదర్శనం. ఇలాంటి వెలుగులు.. మొత్తం జోన్‌లోని ఐదు సర్కిళ్లలో పలుచోట్ల దర్శనమిస్తుండడం గమనార్హం.

టీటీడీ లడ్డూ అవకతవకలపై నిరసన



వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తులు

అల్లాపూర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మోతీనగర్ సమీప పి.ఆర్.నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తులు పెద్దఎత్తున మంగళవారం నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ..సనాతన ధర్మాన్ని, ప్రతి హిందువునూ కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్ష, నిరవధిక నిరసనకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు దుత్త రవీంద్రనాథ్ ఠాగూర్, పసులేటి ప్రసాద్‌లు తెలిపారు.

తల్లి, కుమారుడిని కుటుంబసభ్యులకు అప్పగింత



కేపీహెచ్‌బీ కాలనీ, న్యూస్‌టుడే: ఇంటి నుంచి తప్పిపోయిన తల్లి, కుమారుడిని పోలీసులు వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. సోమవారం రాత్రి తల్లి, కుమారుడు నిజాంపేట్ రోడ్డులోని హోలిస్టిక్ ఆసుపత్రికి వచ్చారు. వివరాలు చెప్పకపోవడంతో ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు వివరాలు లభించకపోవడంతో ఆసుపత్రిలోనే ఉంచారు. వారిని గుర్తుపట్టిన హరి అనే వ్యక్తి నిజాంపేట రోడ్డులోని వారి చిరునామా పోలీసులకు చెప్పడంతో కుటుంబసభ్యులకు అప్పగించారు.

మోస్తరు వర్షం.. రోడ్లు జలమయం



రంగధాముని చెరువు రోడ్డుపై వర్షపు నీరు

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలో మంగళవారం కురిసిన మోస్తరు వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. వరద ప్రవాహంతో నిండిపోయి.. రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల అకస్మాత్తుగా వర్షం పడడం.. మరికొన్నిచోట్ల చినుకులు మాత్రమే పడడం.. ఇలా విభిన్న పరిస్థితులు కనిపించాయి. జాతీయ రహదారిపై చినుకులు పడగా.. రంగధాముని చెరువు రోడ్డు, మూసాపేట, ఆంజనేయనగర్ తదితర ప్రాంతాల్లో కొద్దిసేపు మోస్తరు భారీ వర్షం పడింది. ఓల్డ్‌బోయిన్‌పల్లి సమతానగర్ రోడ్డు నంబర్-5, 6లో పది నిమిషాల వర్షానికే రోడ్లు జలమయమయ్యాయి.



మూసాపేట ఆంజనేయనగర్ డబుల్ రోడ్డులో వరద



రెయిన్‌బోవిస్టాస్ జంక్షన్ వద్ద రోడ్డు జలమయం

టీడీఆర్ ఇచ్చారు.. చోద్యం చూస్తున్నారు

కైత్లాపూర్ రోడ్డు విస్తరణలో జాప్యం



హైటెక్ సిటీ రోడ్డులో కైత్లాపూర్ వద్ద ఇరుకు రోడ్డు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: మూసాపేట నుంచి హైటెక్‌సిటీకి వెళ్లే రహదారిలో కైత్లాపూర్ ఇరుకు రోడ్డు విస్తరణలో అధికారుల చొరవ కనిపించకపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే రెండు దశాబ్దాలుగా జాప్యం జరిగింది. తాజాగా స్థల సేకరణలో టీడీఆర్ ఇచ్చినప్పటికీ స్వాధీనం చేసుకోవడానికి తర్జనభర్జన పడుతున్నారు. ఒకప్పుడు లోపల పేలుడు పదార్థాలున్నాయని ఆచీతూచీ వ్యవహరించడం సమంజసం. ఇప్పుడు కంపెనీనే మూసేశారు. అంతా సవ్యంగా ఉన్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగం చోద్యం చూస్తుండడం విమర్శలకు దారి తీస్తుంది.

గోడ నిర్మాణంలో జాప్యమెందుకు?

మూసాపేట నుంచి హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీకాలనీకి వెళ్లే రహదారి మొత్తం 100అడుగుల మేర ఉన్నప్పటికీ.. కైత్లాపూర్ వద్ద 20నుంచి 30అడుగుల మేర మాత్రమే ఉండడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇక్కడ ఇరువైపులా ఉదాసిన్ మఠానికి చెందిన స్థలం ఉండడం.. గతంలో ఈ స్థలం ఐడీఎల్ అధీనంలో ఉండడంతో విస్తరణకు ససేమిరా అన్నారు. తర్వాత స్థలాన్ని ఉదాసిన్ మఠం నిర్వాహకులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో విస్తరణకు మార్గం సుగమమం కావడం.. ఎమ్మెల్యే చొరవ.. ఉదాసిన్ మఠం నిర్వాహకులు సానుకూలంగా స్పందించడంతో అధికారులు టీడీఆర్ సైతం ఇచ్చేశారు. రోడ్డు విస్తరణకు ప్రాజెక్టు అధికారులు రూ.5కోట్లతో టెండర్లు సైతం పూర్తిచేశారు. కొంత జాప్యం జరిగినా. . కరెంటు స్తంభాలు కూడా తొలగించారు. ఇక ఉన్న గోడను కూల్చి.. విస్తరించడమే. కానీ, దీని విషయంలో రెండు మాసాలుగా జాప్యం కొనసాగుతోంది. ఉన్న గోడ తొలగించాలంటే.. లోపల వైపు కొత్త గోడ నిర్మించాలని అప్పట్లో ఐడీఎల్ కంపెనీ ఇక్కడ ఉన్నప్పుడు నిబంధన పెట్టారు. కానీ, ఆ కంపెనీని మూసేసినప్పటికీ గోడ తీయడానికి కొత్త గోడ నిర్మాణానికి లింకు పెట్టడం గమనార్హం.



గోడ నిర్మాణం చేయాల్సిన స్థలం

వీరు నిర్మించరు.. వారు పట్టించుకోరు

టీడీఆర్ తీసుకున్న ఉదాసిన్ మఠం నిర్వాహకులు ఇప్పటికే గోడ నిర్మాణానికి సిద్ధమయ్యారు. కానీ, ఐడీఎల్ వారు అడ్డుకుంటున్నారని.. గోడ నిర్మించనివ్వడం లేదని జాప్యం చేస్తూ వస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. టీడీఆర్ ఇచ్చిన అధికారులు స్థలం స్వాధీనంలో చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అవసరమైతే.. పోలీసు బందోబస్తు మధ్య లోపల గోడ నిర్మాణం చేయించాల్సిన అవసరముంది.

మరోవైపు నుంచి నిర్మించొచ్చు

– గణపతి, సీపీ, కూకట్‌పల్లి జోన్

ఒకవైపు సమస్య ఉన్నప్పుడు మరోవైపు నుంచి గోడ నిర్మాణం ప్రారంభించే వీలుంది. ఆ దిశగా పనులు మొదలుపెట్టమనండి.. తాము అవసరమైనప్పుడు పోలీసులను రంగంలోకి దింపుతాం.

వెంటనే ప్రారంభిస్తాం

– రామకృష్ణ, మేనేజర్, ఉదాసిన్ మఠం

వెంటనే మరోవైపు గోడ నిర్మాణం ప్రారంభిస్తాం. తొందరలో పాత గోడ కూల్చి స్థలాన్ని అప్పగిస్తాం.

అనాలోచిత చర్యలు.. ట్రాఫిక్ ఇబ్బందులు



రెయిన్‌బోవిస్టాస్ రోడ్డులో తాజాగా మూసేసిన యూటర్న్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు.. దాని పర్యవసానాలు.. లాభ, నష్టాలపై అధ్యయనం చేయాలి. పరిశీలన తర్వాతనే ఒక నిర్ణయానికి రావాలి. కానీ, ఇదేమీ లేకుండా హడావుడిగా నిర్ణయాలు తీసుకుంటే.. సమస్యలు తప్పవు. దీనికి నిదర్శనంగా నిలుస్తున్నదే.. మూసాపేట నుంచి హైటెక్‌సిటీకి వెళ్లే ప్రధాన రహదారిలో రెయిన్‌బోవిస్టాస్ వద్ద యూటర్న్‌ల మూసివేత. దీని వలన ట్రాఫిక్ యాతనతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఇరుకుచోట యూటర్న్ ఏమిటీ?

మూసాపేట నుంచి హైటెక్‌సిటీకి వెళ్లే రహదారిలో ఐడీఎల్ జంక్షన్‌లో కొన్నేళ్ల క్రితమే యూటర్న్ మూసేశారు. రెయిన్‌బోవిస్టాస్ గేటు ముందున్న యూటర్న్‌ను కూడా రెండేళ్ల క్రితం మూశారు. ఈ రెండూ మూసి శివాలయం వద్ద ఏర్పాటుచేశారు. వాస్తవంగా ఇక్కడ కూడా రోడ్డు కొంత ఇరుకుగానే ఉంటుంది. స్వల్ప ఇబ్బందులున్నా.. వాహనాల రాకపోకలకు పెద్ద సమస్యలేమీ తలెత్తడం లేదు. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా రెయిన్‌బోవిస్టాస్ ముందు కూడా యూటర్న్ తెరిచారు. దీంతో మరింత సౌలభ్యంగా మారి రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ఇలాంటి సమయంలో మంగళవారం అకస్మాత్తుగా రెయిన్‌బోవిస్టాస్ ముందు, శివాలయం వద్ద యూటర్న్‌లు రెండూ ట్రాఫిక్ పోలీసులు మూసేశారు. సరిగ్గా కైత్లాపూర్ సమీపంలో ఇరుకు రోడ్డు ప్రారంభమయ్యేచోట.. హైటెక్‌సిటీ నుంచి వేగంగా వాహనాలొచ్చే ప్రాంతంలో యూటర్న్‌కు ఏర్పాట్లు చేశారు. దీంతో ఒక్కసారిగా రాకపోకలు స్తంభించాయి. ఇరుకున్నచోట భారీ వాహనాలు యూటర్న్ చేయడానికి సమయం పట్టడంతో వాహనాలు బారులు తీరాల్సి వచ్చింది. వాహనదారులకు ఇక్కట్లు మిగిల్చారు.

పరిశీలించి సమస్య నివారిస్తాం

– ముత్తుయాదవ్, ట్రాఫిక్ సీఐ, కూకట్‌పల్లి

పరిశీలించి, సమస్యను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం.



రెయిన్‌బో విస్టాస్ ముందు కొన్నేళ్ల క్రితం యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

నీటి సమస్యలు పరిష్కరించాలి


ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: కాలనీలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని అమీన్‌పూర్ పురపాలక పరిధి శిల్ప కాలనీవాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీకి తాగునీరు ఇవ్వాలంటే పైపులైన్లకు రూ.80లక్షలు ఖర్చు అవుతుందని జలమండలి అధికారులు లెక్కలు వేశారని చెప్పారు. ఇందుకు సంబంధించిన డబ్బులు కాలనీవాసులు భరించాల్సి ఉంటుందంటూ అధికారులు చెప్పారన్నారు. రాజు, వర్ధమాని రామకృష్ణ, శేఖర్, ప్రదీప్ ఉన్నారు.

ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలు వివరించండి


మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మాదాపూర్: పార్టీ సభ్యత్వ నమోదులో శేరిలింగంపల్లి నియోజకవర్గం ముందంజలో ఉండాలని భాజపా రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం కొండాపూర్ మసీద్‌బండలో నియోజకవర్గ భాజపా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి మాట్లాడుతూ..క్రియాశీల నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరు 2-10వేల మందిని సభ్యులుగా నమోదు చేయించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి కేంద్రం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

మండల విద్యాధికారుల నియామకం

పటాన్‌చెరు: మండల విద్యాధికారులను నియమిస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. పటాన్‌చెరు ఎంఈవో పీవీ నాగేశ్వరనాయక్, రామచంద్రాపురం పీపీ రాథోడ్, అమీన్‌పూర్ మండలానికి సుధాకర్‌లను నియమించారు.

జాబ్ మేళా 26న

చందానగర్: జీహెచ్ఎంసీ సహకారంతో చందానగర్ లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ఈనెల 26న జాబ్ మేళా నిర్వహిస్తోంది. హుడా కాలనీ వద్ద ఉన్న లైట్‌హౌస్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మొదలయ్యే ఇంటర్వ్యూలో రిటైల్, బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, సేల్స్, ఐటీ ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుంది. వివరాలకు 86881 00660 నంబరులో సంప్రదించాలని మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

వివేకానందనగర్‌కాలనీ: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం వివేకానందనగర్‌కాలనీ డివిజన్ సుమిత్రానగర్‌లో ప్రారంభమైంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.నరేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి ఆసక్తి చూపిన వారికి సభ్యత్వాన్ని అందజేశారు.

పోలీసులకు సన్మానం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు పట్టణంలో మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీ, జల్సా కార్యక్రమాల విజయవంతానికి సంపూర్ణ సహకారం అందించిన పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు ఆసిఫ్, అభిమాన్‌సింగ్, కుర్షిద్, అంబర్యలను మిలాద్-ఉన్-నబీ కమిటీ మంగళవారం ఘనంగా సత్కరించారు. పోలీసుల సహకారం మరువలేనిదని తెలిపారు.

అతివేగం.. తీస్తోంది ప్రాణం

- మల్కం చెరువు చెంత ఆందోళనకరంగా పరిస్థితి
- పైవంతెన, దాని పక్క దారి కలిసే చోట ప్రమాదాలు



రాయదుర్గం, న్యూస్‌టుడే: పైవంతెన పై నుంచి వచ్చే వాహనాలు, దాని పక్క నుంచి వాహనాలు ఒక్కసారిగా అక్కడ ఒకే దారిలోకి చేరుకుంటాయి. ఆ ప్రదేశంలో అతివేగం ప్రాణాలు హరిస్తోంది. రాయదుర్గం మల్కం చెరువు ముందున్న రహదారిపై తరచూ ప్రమాదాలతో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు ట్రాఫిక్ తక్కువగా ఉండే సమయంలోనే ఎక్కువ ప్రమాదాలు జరిగాయి.

కీలక దారి..

నగరం నుంచి నానక్‌రాంగూడ, మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి ఐటీ కారిడార్‌కు అడ్డంకులు లేకుండా రాకపోకలు సాగించేందుకు 2.8 కిలోమీటర్ల పై వంతెన నిర్మించారు. ఈ వంతెన దిగే ర్యాంపు సరిగ్గా రాయదుర్గం మల్కం చెరువు ముందే ఉంటుంది.

- అటు మెహిదీపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు, ఇటు దాని పక్కన ఉన్న దారిమీదుగా రాయదుర్గం, షేక్‌పేట, మణికొండ వైపు నుంచి వచ్చే వాహనదారులు మల్కం చెరువు ముందు ఒకే దారిపైకి చేరుకుంటారు. ఈ క్రమంలో వాహనాలు పరస్పరం ఢీకొంటున్నాయి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 7 వరకు ట్రాఫిక్ మరీ తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో వాహనాలు వేగానికి పగ్గాలే ఉండవు. ఈ క్రమంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 7 వరకూ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కళ్లు మూసి తెరిచేలోగా వాహనాలు దూసుకొస్తుంటాయి.

అపసవ్య దిశలో ప్రయాణం..

అక్కడ అతివేగమేకాక వంతెన దిగాక రెయిలింగ్ వద్ద నుంచి కొందరు రాంగ్ రూట్‌లో ఎడమవైపు మళ్లి ప్రమాదకరంగా వెనక్కి వచ్చి అక్కడి పెట్రోల్ బంకు వైపు, మల్కం చెరువు బైపాస్ రోడ్డుకు చేరుకుని మణికొండ వైపు వెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రాణాలు పోతున్నా..

- ఈనెల 15న ఉదయం 6.30కి ఫిలింనగర్‌లో ఆటో డ్రైవర్ రాజు తన ఆటోలో లక్ష్మీ(38) అనే మహిళతోపాటు ఆమె భర్త, కుమార్తె, మరో బాలికను కూర్చోబెట్టుకుని రాయదుర్గం ఐటీ క్షేత్రానికి బయల్దేరారు. రాయదుర్గం మీదుగా పైవంతెన పక్కన ఉన్న దారి నుంచి వస్తూ మల్కం చెరువు ముందు వంతెనపై నుంచి దిగుతున్న స్కూటీని ఢీకొట్టారు. మలుపులో ఆటో అదుపుతప్పి.. రోడ్డు పక్కన నిలిపిన మరో వాహనాన్ని ఢీకొట్టి పల్టీలు కొట్టడంతో లక్ష్మీ మృతి చెందగా మిగతావారు తీవ్రంగా గాయపడ్డారు. స్కూటీ నడిపిస్తున్న మహ్మద్ షకీల్ కూడా గాయపడ్డాడు.

- తరచూ చిన్న ప్రమాదాలనేకం జరుగుతుండడంతో పలువురు గాయపడుతున్నారు. ఇంతా జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు నివారణ చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

- ఏడాది క్రితం అదే ప్రాంతంలో రోడ్డు దాటుతున్న పాదచారిని ఓ వాహనం ఢీకొనడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు.

ఇలా చేస్తే మేలు..

- పైవంతెన పైనుంచి వచ్చే, దాని పక్కన ఉన్న దారిలోంచి వచ్చే వాహనాలు కలిసే మల్కం చెరువు ముందున్న రహదారిలో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సూచికలు ఏర్పాటు చేయాలి.
- పైవంతెన చెంత రాంగ్ రూట్‌లో వెళ్లకుండా వాహనదారులపై చర్యలు తీసుకోవాలి.
- వేగపరిమితి నిర్ధారించి సూచికలు ఏర్పాటు చేయాలి. తెల్లవారుజాము, ఉదయం అధికంగా ప్రమాదాల నేపథ్యంలో రేడియం సూచికలు ఏర్పాటు చేస్తే శ్రేయస్కరం. వాహనదారుల స్వీయ వేగ నియంత్రణ పాటించాలి. ఎట్టిపరిస్థితిలోనూ రాంగ్‌రూట్‌లో వెళ్లకూడదు.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

మాదాపూర్, న్యూస్‌టుడే: ? కొండాపూర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యూటర్న్ మూసివేయడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డు దాటేందుకు వీల్లేకుండా రోడ్డు మధ్యలో ఎత్తైన దిమ్మెలు పెట్టారు. రోగులు, అంబులెన్స్ రోడ్డు దాటేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలి. – నాగేశ్వరరావు, కొండాపూర్

✓ కొండాపూర్-మసీద్‌బండ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ అధికం కావడంతో యూటర్న్ మూసివేయాల్సి వచ్చింది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వాహనాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.
–రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ గచ్చిబౌలి

చందానగర్, న్యూస్‌టుడే: ? వేమనరెడ్డికాలనీ, ఉదయపాలిగాన్, ఎంఎన్ఆర్ స్కూల్ ప్రాంతాల్లో కోతులు అపార్ట్‌మెంట్స్‌లోకి వస్తున్నాయి. – సుజాత, చందానగర్

✓ సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. – బాసిత్, వెటర్నరీ ఆఫీసర్ జీహెచ్ఎంసీ

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: ? గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని జవహర్ నవోదయ స్కూల్ ఎదురుగా ఉన్న సాయిరాం నగర్ ప్రాంతంలో ఓ భవన యజమాని రోడ్డుపై వ్యర్థాలు పోసి తొలగించడం లేదు. –సత్యనారాయణరావు, సాయిరాంనగర్, నల్లగండ్ల

✓ సిబ్బందికి ఆదేశాలిచ్చి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.–శ్రీకాంత్‌రెడ్డి, సహాయ వైద్యాధికారి, శేరిలింగంపల్లి సర్కిల్

రాష్ట్రపతి రాక.. డ్రోన్స్‌పై నిషేధం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగర పర్యటన నేపథ్యంలో ఈనెల 28వ తేదీన శామీర్‌పేట్, అల్వాల్, మేడ్చల్ ఠాణాల పరిధిలో రిమోట్‌తో నియంత్రించే డ్రోన్లు, పారాగ్లైడర్స్, మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగరవేతపై నిషేధం విధిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. శామీర్‌పేట్ నల్సార్ వర్సిటీ 21 స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొనడమేకాక, బొల్లారం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవ్ 2024ను రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా వాటిని ఎగరవేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

సందడిగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం



పటాన్‌చెరు, న్యూస్‌టుడే: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాలు సందడిగా జరిగాయి. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆర్‌సీఎం రాజు మాట్లాడుతూ చదువుతున్న సమయంలోనే సేవా కార్యక్రమాలపై మక్కువ పెంచుకునేటట్టు అధ్యాపకులు కృషి చేయాలని చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేటట్టు విద్యార్థులు ప్రచారం చేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల శుభ్రత నాగరికతకు ఒక చిహ్నమన్నారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ డైరెక్టర్ డీవీవీఎస్ ఆర్ వర్మ, సమన్వయకర్త భార్గవి తదితరులు ఉన్నారు.

తేలిపోయిన నాణ్యత



వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ మలుపు వద్ద ఇటీవల మ్యాన్‌హోల్ నిర్మించారు. నాణ్యత పాటించకపోవడంతో నిర్మించిన కొన్ని రోజులకే సిమెంట్ ఊడిపోతుంది. మ్యాన్‌హోల్ పగిలిపోయే అవకాశం ఉంది. మళ్లీ కొత్తగా నిర్మించాల్సి వస్తుంది. అధికారులు పరిశీలించి నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డొక్కు బస్సులతో ఇంకెన్నాళ్లు


పొగచూరిన మియాపూర్ డిపో బస్సు

ఈనాడు, హైదరాబాద్: డొక్కు బస్సులు నగరవాసులను హడలెత్తిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియని ఆందోళనతో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. గత రెండు నెలల్లో పదుల సంఖ్యలో మొరాయించడం, బ్రేక్ డౌన్, సెల్ఫ్ ఇతర సమస్యలతో నడిరోడ్డుపై ఆగిపోయిన సందర్భాలున్నాయి. రోడ్డుపైకి ఎక్కిందంటే తిరిగి డిపోకు వెళ్లే వరకు డ్రైవర్, కండక్టర్‌కు టెన్షన్ తప్పడం లేదు. సిగ్నల్ వద్ద బస్సు నిలిపితే కదులుతుందో లేదా అనే అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. నగరంలో తిరిగే బస్సులే కాదు జిల్లాలకు వెళ్లే లగ్జరీ, రాజధాని వోల్వో బస్సుల్లోనూ ప్రయాణించేవారికి నరకం కనిపిస్తోంది. ఇటీవల విజయవాడ నుంచి కేపీహెచ్‌బీకి మియాపూర్ డిపో బస్సులో ఏసీ సరిగా పనిచేయలేదని, నాలుగు గంటల పాటు చెమటతో నరకం కనిపించిందంటూ ప్రయాణికుడు వాపోయారు. హైదరాబాద్ నుంచి నందిగామ వెళ్లిన గరుడలో ప్రయాణించిన మరో వ్యక్తికి ఈ తరహా అనుభవమే ఎదురైంది. షాక్‌అబ్జర్వర్లు పాడవ్వడంతో ప్రయాణం నరకంగా మారిందని వాపోయారు. గమ్యం చేరేవరకు శబ్దాలు కునుకుపట్టనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవింగ్ ప్యానెల్ దుస్థితి వర్ణించలేమని, విద్యుద్దీపాలు పనిచేయలేదని వాపోయారు.

పంచాయతీ కార్యదర్శిపై వేటు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: నిషేధించిన భూమిలో ఇంటి నంబర్లు ఇవ్వడంతోపాటు నిర్మాణాలకు అనుమతించారన్న కారణంతో పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామ కార్యదర్శి లక్ష్మణాచారిని సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కోహిర్ గ్రామంలో పనిచేస్తున్న సమయంలో నిషేధించిన వక్ఫ్ భూమిలో 212 ఇంటి నంబర్లు జారీ చేశారు. దీనిపై అక్బర్ అనే వ్యక్తి జులై 23న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు ఆగస్టు 12న షోకాజ్ నోటీసు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాల మేరకు డీపీవో సాయిబాబా పంచాయతీ కార్యదర్శి లక్ష్మణాచారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యువత సేవాభావంతో మెలగాలి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత బాధ్యతతో ఉండి ఇతరుల పట్ల ప్రేమ, సేవాభావంతో మెలగాలని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ వడ్లూరి శ్రీనివాస్ అధ్యక్షతన జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి వెంకటేశం ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. వైస్‌ప్రిన్సిపాల్ ప్రవీణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వాచ్‌మెన్ మృతి

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాచ్‌మెన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట గ్రామానికి చెందిన సిరిగాపురం సాయిలు(47) అమీన్‌పూర్ పురపాలక పరిధి కిష్టారెడ్డిపేటలో ఉంటూ వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. ఈనెల 17న సాయంత్రం నిత్యావసర సరకులు తేవడానికి బీరంగూడకు నడుచుకుంటూ బయల్దేరాడు. మార్గమధ్యలో నవ్య చౌరస్తా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడు పాపయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తుతెలియని యువకుడి దుర్మరణం..

మియాపూర్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ నుంచి కూకట్‌పల్లి వెళుతున్న మార్గంలో మంగళవారం మియాపూర్ మెట్రో బస్టాప్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని సుమారు 35 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. మృతుని వద్ద గుర్తింపు వివరాలేవి లభ్యం కాలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిర్మాణరంగ కూలీ అయి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని తెలిపారు.

చందానగర్‌లో మరొకరు..

శేరిలింగంపల్లి: చందానగర్ ఠాణా పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగండ్ల మరుగుదొడ్ల వద్ద అమర్(40) కొన్నినెలలుగా పని చేస్తున్నాడు. 21న మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు.

సామాన్యులకు ఉపయుక్తంగా ఫంక్షన్ హాల్


అధికారులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్‌లో రూ.3కోట్లతో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్క్ పనులను మంగళవారం ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఫంక్షన్ హాల్ నిర్మాణంతో పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: పలు డివిజన్లకు చెందిన ఇద్దరికి మంగళవారం వివేకానందనగర్‌కాలనీలో ఎమ్మెల్యే గాంధీ సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. హఫీజ్‌పేట హుడాకాలనీకి చెందిన చైతన్యకు రూ.5లక్షలు, మాదాపూర్ సాయినగర్ నివాసి ఈశ్వర్‌కు రూ.లక్ష చెక్కులు పంపిణీ చేశారు.

- పీఏసీ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా గచ్చిబౌలి గ్రామవాసులు నయిమ్, యూసఫ్ తదితరులు ఎమ్మెల్యే గాంధీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం దివ్యాంగులకు విద్యా, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ది ఎంపవర్డ్ కమిటీ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్(ఈసీడీఏపీ), చెన్నైకి చెందిన హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్(హెచ్‌టీబీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ కార్పొరేట్ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హాజరై దివ్యాంగులకు ఉపాధి అవకాశాలతోపాటు ఉన్నత విద్యపై సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నవరం పాల్గొన్నారు.

జీవన్మృతురాలి అవయవాల దానం


అనిత

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: జీవన్మృతురాలి అవయవాలు దానం చేసేందుకు ఆమె కుటుంబం ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంది. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఇందిరమ్మకాలనీకి చెందిన అనిత(33) పాశమైలారం పారిశ్రామికవాడలో కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈనెల 19న ఉదయం విధులకు నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను పటాన్‌చెరులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం సనత్‌నగర్ ఈఎస్ఐలో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. అవయవదానంపై వైద్యులు అవగాహన కల్పించడంతో పుట్టెడు దుఃఖంలోనూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారు అంగీకరించారు. జీవన్‌దాన్ ట్రస్టు సాయంతో అనిత అవయవాలను సేకరించారు. భార్య, భర్తలు ఇద్దరు కష్టపడి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి అనిత చనిపోవడంతో పదమూడేళ్లలోపున్న ఇద్దరు పిల్లలు బిక్కుబిక్కుమంటున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం దృష్టికి డీలర్ల సమస్యలు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: రేషన్ డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరులో మంగళవారం జరిగిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పల్లె నుంచి పట్నం వరకూ నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని చెప్పారు. సీఎంతో సంప్రదించి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయించేలా చూస్తానన్నారు. ముఖ్యంగా రూ.5 వేల గౌరవవేతనం, క్వింటాకు రూ.300 కమీషన్ లాంటి హామీల అమలుకు కృషిచేస్తానని తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు, ప్రతీ రేషన్ డీలర్‌కు రూ.10 లక్షల బీమా, ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిలు, కరోనా సమయంలో మృతిచెందిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని కోరారు. రేషన్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధానకార్యదర్శి విశ్వంబర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ స్వార్థంతో సాయుధ పోరాటంపై అసత్య ప్రచారం



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీరయ్య, శోభన్ తదితరులు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిందే తెలంగాణ సాయుధ పోరాటమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట పక్షోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పోరాటాల్లో ఒకటి అని చెప్పారు. దేశంలోని పేదలకు భూమి కావాలనే నినాదాన్ని పార్లమెంటు వరకు తీసుకెళ్లిన ఏకైక పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమని చెప్పారు. ఇంతటి గొప్ప పోరాటన్ని కొన్ని పార్టీలు స్వార్థం కోసం నిజం నవాబుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారనే అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. భాజపాకు ఈ పోరాటానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేలా భాజపా వైఖరి ఉందని చెప్పారు. ఈ వైఖరిని కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు తిప్పి కొట్టాలన్నారు. అంతకుముందు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం శేరిలింగంపల్లి నాయకులు శోభన్, కృష్ణ, మధుసూదన్‌రావు, సీతారామయ్య, మాణిక్యం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు సాంబశివరావు, అనిల్, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని శ్రీరామ్ నగర్ రోడ్డు


శంకర్ గ్రీన్ హోమ్స్ కాలనీ

అడుగుకో గుంత .. ప్రయాణానికి చింత

అమీన్‌పూర్ పురపాలక పరిధి కాలనీల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. పెద్ద గుంతలు పడ్డాయి. కాలనీవాసులు ప్రయాణం చేయలేక పోతున్నారు. వర్షం కురిసిందంటే నరకాన్ని తలపించే రీతిలో రోడ్లు తయారయ్యాయి. బృందావన్ టీచర్స్ కాలనీలో రహదారుల పరిస్థితి దుర్భరంగా ఉంది. నడవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. శంకర్ గ్రీన్ హోమ్స్ కాలనీలో రోడ్డు దారుణంగా ఛిద్రమైంది. కిష్టారెడ్డిపేట శ్రీరామ్ నగర్ కాలనీలోకి వెళ్లాలంటే బురద దాటాలి. సుల్తాన్‌పూర్, పటేల్‌గూడ, ఇంద్రేశం గ్రామాల్లో సైతం రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. – న్యూస్‌టుడే, పటాన్‌చెరు

ఆరుగురికి జైలు

పటాన్‌చెరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు శిక్ష, జరిమానా పడింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 17 మంది మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సంగారెడ్డి ఉదయపు కోర్టుకు తరలించగా 11 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా, నలుగురికి ఒకరోజు, ఒకరికి 2రోజులు, మరొకరికి 2రోజులు జైలుశిక్ష న్యాయమూర్తి విధించారు.

కుత్బుల్లాపూర్

మొక్కలు నాటి.. వేడుకలు చేసి


కేటీఆర్ కాలనీలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న రంగారావుప్రసాద్

నిజాంపేట, న్యూస్‌టుడే: భాజపా నిజాంపేట నగరశాఖ అధ్యక్షుడు వకాలపూడి రంగారావు ప్రసాద్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాలనీ పార్కులో మొక్కలు నాటారు. డిప్యూటీ మేయర్ శంభీపూర్ ధన్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రంగారావు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేస్తానన్నారు. కార్పొరేటర్ వి.రవికిరణ్, స్థానిక నేతలు బొబ్బా శ్రీనివాస్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం


ప్రగతినగర్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

నిజాంపేట, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇన్‌కాయిస్ ఉద్యోగులు ప్రగతినగర్‌లో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రగతినగర్ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అకౌంట్ ఆఫీసర్ ఎస్. నాగేశ్వరరావు, దేవేంద్రకుమార్, శాస్త్రవేత్తలు ఉదయ భాస్కర్, మురళీకృష్ణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాటం

షాపూర్‌నగర్: నిరుపేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఎర్రజెండాయేనని సీపీఎం మండల కార్యదర్శి కె.లక్ష్మణ్ అన్నారు. సీపీఎం కుత్బుల్లాపూర్ మండల శాఖ మహాసభ సందర్భంగా షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నేత వెంకన్న అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని షాపూర్‌నగర్, గాజులరామారం, సంజయ్‌గాంధీనగర్, చింతల్ శాఖల నూతన కమిటీలను ప్రకటించారు. నాయకులు మైసయ్య, రామారావు, సంజీవరాజు, నాగమణి, జనుమ, కృష్ణ, అంబయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని దండమూడి ఎన్‌క్లేవ్ కాలనీకి వెళ్లే దారిలో ఐదు రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగు రోడ్డుపై పారుతోంది. ఫలితంగా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి జలమండలి మేనేజర్ అనూష స్పందించారు. సిబ్బంది మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసి రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు చేపట్టారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం.. ధ్వానంగా పరిసరాలు

● దుండిగల్ పురపాలికలో దుర్వాసనతో ప్రజలు సతమతం

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పురపాలిక ఏర్పడి ఆరు సంవత్సరాలైనా ఇప్పటికీ పారిశుద్ధ్యం పూర్తి స్థాయిలో మెరుగుపడలేదు. గృహ సముదాయాల మధ్య, రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాలలో భారీగా చెత్త పేరుకుపోతుంది. నిర్మానుష్య ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలను పలువురు ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. పలు బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ లీకై మురుగు రోడ్లపైనే పారుతోంది. ఫలితంగా దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దోమల వ్యాప్తి కారణంగా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.


బౌరంపేటలో ఏర్పాటుచేసిన బ్యానర్ వద్ద అధ్వాన పరిస్థితులు

నామమాత్రంగా స్వచ్ఛత హీ సేవ 2024

సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమాన్ని పురపాలికలో అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామంటూ బ్యానర్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. అయితే కేవలం ప్రచారానికే అధికారులు పరిమితమవుతున్నారని.. పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బౌరంపేట దిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డు, బౌరంపేట శివాజీ విగ్రహం నుంచి స్థానిక వృద్ధాశ్రమం రోడ్డు, బహదూర్‌పల్లి సాయినాథ సొసైటీ, బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీకి వెళ్లే రోడ్డు, మల్లంపేట ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాలలో భారీగా చెత్త వేస్తున్నారు.


మల్లంపేటలో రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయిన చెత్త

సిబ్బంది కొరతతో..

దుండిగల్ పురపాలికలో జనాభా లక్షకు పైగా ఉన్నారు. ప్రస్తుతం 146 మంది పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం మరో వంద మంది సిబ్బంది అవసరం. ఇదే విషయాన్ని పురపాలిక అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా.. కొత్తగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించకపోవడంతో క్షేత్రస్థాయిలో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

– సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

పురపాలికలో తడి, పొడి చెత్తను స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటా సేకరిస్తున్నాం. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా విధిస్తాం. పురపాలికలో అవసరమైన ప్రాంతాల్లో డంపర్ బిన్లను ఏర్పాటు చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

కుత్బుల్లాపూర్, నిజాంపేట, షాపూర్‌నగర్, దుండిగల్, న్యూస్‌టుడే:

? గాజులరామారం బృందావన్ పార్కు కాలనీలో రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రి అంధకారం నెలకొనడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. – మానిక్, బృందావన్ పార్కు కాలనీ

✔ సిబ్బందిని పంపించి వెలగని దీపాలను పునరుద్ధరింపజేయిస్తాం. – రఘుపతిరెడ్డి, డీఈ, ఎలక్ట్రిక్ విభాగం, గాజులరామారం

? శ్రీరాంనగర్‌కాలనీ రోడ్డు-3లో మ్యాన్‌హోల్ ఛిద్రమైంది. దాన్ని పునరుద్ధరించడానికి తవ్వకాలు చేపట్టి వదిలేశారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. –చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంనగర్.

✔ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. –సతీష్‌కుమార్, ఏఈ, సూరారం డివిజన్

? ప్రగతినగర్ మూడు కోతుల విగ్రహాల చౌరస్తా సమీపంలో ఉన్న స్ఫూర్తి స్కూల్ సమీపంలో 10 నుంచి 15 శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. పిల్లలను స్కూల్‌కు తీసుకొచ్చి.. తీసుకెళ్లే సమయంలో కొన్నిసార్లు వెంట పడుతున్నాయి. ఎప్పుడు దాడి చేస్తాయోనని భయంగా ఉంది. –మహేష్‌యాదవ్, ప్రగతినగర్

✔ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీతో సమన్వయం చేసుకుంటున్నాం. త్వరలోనే చర్యలు చేపట్టి నగర పాలక సంస్థలోని అన్ని కాలనీల్లోని కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాం. – సుకృతారెడ్డి, పారిశుద్ధ్య విభాగం అధికారి, నిజాంపేట

? సూరారం డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లో గాజులరామారం ప్రధాన రహదారి నుంచి మారుతీ మెడికల్‌కు వెళ్లే దారిలో చిన్నపాటి వర్షం వచ్చినా మురుగునీరు, వరదనీటికి తోడై వీధుల్లో ప్రవహిస్తోంది. తీవ్ర దుర్గంధంతో పాటు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. – జక్క సహదేవ్, సంజయ్‌గాంధీనగర్

✔ భూగర్భ డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం పెంచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. తాత్కాలికంగా పూడిక తొలగించి మురుగునీరు రోడ్డుపైకి చేరకుండా చర్యలు చేపడతాం. – రవి, జలమండలి డీజీఎం

? గాజులరామారం డివిజన్ పరిధి బాలాజీ లేఅవుట్‌లో రాయల్‌పామ్స్ తర్వాత రెండు వీధుల్లో తాగునీటి పైపులైన్ విస్తరించలేదు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుంది. – సందీప్, బాలాజీ లేఅవుట్

✔ స్థానికంగా 200 మీటర్ల మేర పైపులైన్ విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పైపులైన్ విస్తరణకు చర్యలు చేపడతాం. – అనూష, గాజులరామారం జలమండలి మేనేజర్

? బహదూర్‌పల్లి ఉన్నత పాఠశాల వద్ద ఐమాక్స్ లైట్లు కొద్దిరోజులుగా పనిచేయడం లేదు. రాత్రి వేళల్లో ఆ మార్గంలో అంధకారం నెలకొంటోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – సుబ్బారావు, స్థానిక నివాసి

✔ సిబ్బందితో మరమ్మతులు చేయించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

కొమ్మలు తీయరు.. ఇబ్బందులు వీడవు


కుత్బుల్లాపూర్ కూడలిలో పాదబాటపై వదిలేసిన చెట్లకొమ్మలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు నరికి రహదారులు, పాదబాటలపై పడేస్తున్నారు. నిబంధనల ప్రకారం నరికిన కొమ్మలను వెనువెంటనే జనవాసాలకు దూరంగా తరలించాల్సి ఉంది. ఇందుకు రవాణా ఛార్జీలు చెల్లించాల్సి వస్తుండటంతో గుత్తేదారులు వాటిని అక్కడే వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● కుత్బుల్లాపూర్ కూడలిలోని సీఆర్ఎంపీ (సమగ్ర రహదారుల నిర్వహణ ప్రోగ్రామ్) రహదారిని అయిదేళ్ల నిర్వహణ కాంట్రాక్టును ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించిన విషయం విదితమే. ఇందులో భాగంగా సంబంధిత ఏజెన్సీవారు ఈ రహదారిని ఇరువైపుల విస్తరించి పాదబాటలు నిర్మించి అందంగా తీర్చిదిద్దారు. పాదబాటలపై ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలకు తాకుతుండటంతో సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ట్రాన్స్‌కో అధికారులు నాలుగు రోజుల క్రితం చెట్లకొమ్మలను నరికించి పాదబాటపైనే వదిలేశారు. దీంతో పాదబాటపై నడక సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రహదారి కూడలి పక్కన ఒక వైపు విద్యుత్తు శాఖ ఏడీఈ, మరో వైపు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్ కార్యాలయాలున్నా ..సంబంధిత అధికారులు పేరుకుపోయిన కొమ్మలపై దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లి దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు


అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ తెలిపారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జంట సర్కిళ్ల పరిధిలో రూ.93 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులతో పాటు రూ. 46 కోట్లతో చేపట్టనున్న పనులపై సమీక్షించారు. నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యను అధిగమించటానికి లింక్ రోడ్ల పనులు తొందరగా పూర్తి చేయాలన్నారు. పెద్ద చెరువు, పరికి చెరువు, ఫాక్స్‌సాగర్, వెన్నెలగడ్డ ఎన్నాచెరువులను సుందరీకరణ చేసి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. క్రీడా మైదానాలను అందుబాటులోకి తెచ్చి యువతను క్రీడలవైపు ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానాల్లో ఓపెన్ జిమ్స్, పాదచారుల నడక మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. కూడళ్ల అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఈఈలు లక్ష్మి, గణేశ్, కిష్టప్ప, డీఈలు రూపాదేవి, పాపమ్మ, శిరీష పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన నిషేధమని, దుండిగల్ పురపాలక ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా.. గతంలో పురపాలిక పరిధిలో నిర్మించిన 12 మరుగుదొడ్ల వద్ద పరిసరాలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. అధికారులు సాత్విక్, రామచందర్ పనులను పర్యవేక్షించారు.

వీధి కుక్కలకు ప్రత్యేక వ్యాక్సిన్ నేడు

కొంపల్లి (పేట్‌బషీరాబాద్) న్యూస్‌టుడే: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలకు బుధవారం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కమిషనర్ కె.శ్రీహరిలు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్సీఎల్‌కాలనీ నార్త్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువులు ఉన్న వారు కూడా వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 85550 52118 చరవాణిలో సంప్రదించాలని కోరారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

కొంపల్లి (పేట్‌బషీరాబాద్) న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిసోందని భాజపా మహిళా మోర్చా నేత పొత్తూరి మాధురి తెలిపారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్సీఎల్‌కాలనీ, నోబుల్‌పార్కు తదితర ప్రాంతాల్లో ఆమె ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక


కొలను హనుమంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు మంగళవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కొలను హనుమంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు నాయకులు తెలిపారు. మహేష్, ఎండీ అహ్మద్, ఎస్కే ఖాజా, రమేష్ గౌడ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

పెంపుడు శునకానికి అంత్యక్రియలు


నిజాంపేట, న్యూస్‌టుడే: అనారోగ్యంతో చనిపోయిన పెంపుడు శునకానికి ఆ కుటుంబీకులు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించి తమ ప్రేమను చాటుకున్నారు. బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన బొల్లమల్ల నర్సింగ్, గీత కుటుంబీకులు ఎక్కడి నుంచో వచ్చిన ఓ వీధి కుక్కను చేరదీసి మూడేళ్లుగా పెంచుకుంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న శునకం మంగళవారం మృతిచెందింది. దీంతో వారు ఎంతగానో దుఃఖించారు. తమ ఇంటికి సమీపంలోని ఖాళీ స్థలంలో ఖననం చేశారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు


సమావేశంలో పాల్గొన్న టీజీ ఎస్‌పీడీసీఎల్ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం పరిశ్రమల ప్రతినిధులతో టీజీ ఎస్‌పీడీసీఎల్ అధికారులు సమావేశమయ్యారు. ఆ ప్రాంతంలో నెలకొన్న విద్యుత్తు సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. దూలపల్లి పారిశ్రామిక వాడలో కార్మికులకు ఆదివారం సెలవు ఇచ్చేలా సహకరించాలని అధికారులను పరిశ్రమల ప్రతినిధులు కోరారు. విద్యుత్తు సిబ్బంది పవర్ హాలిడే లేదా మరమ్మతుల నిమిత్తం ప్రతి సోమవారం పరిశ్రమలకు కరెంటు కోత విధిస్తున్నారు. దీంతో కార్మికులకు సోమవారం సెలవు ఇవ్వాల్సి వస్తోందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని వాటికి దిమ్మెలు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. కరెంట్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని అందుకు స్థలం కేటాయించాలని అధికారులు కోరారు. టీజీ ఎస్‌పీడీసీఎల్ సీజీఎం సాయిబాబా, ఎస్ఈ రవికుమార్, డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏఈ వినాయక్ రాథోడ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాయిబాబా, సభ్యులు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు రూ.74 లక్షలు మంజూరు


బస్తీవాసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, చంద్రగిరి నగర్ లలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.74 లక్షలు మంజూరయ్యాయి. స్థానికంగా జలమండలి ఆధ్వర్యంలో రోడ్డు తవ్వి భూగర్భడ్రైనేజీ నిర్మించారు. పనులు పూర్తయినా తిరిగి రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుండటంతో స్థానికులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు సమస్య తీవ్రతను వివరించారు. ఆయన సమస్యను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. జిల్లా మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను వివరించి రూ.74 లక్షలు మంజూరు చేయించారు. దీంతో కాలనీవాసులు మంగళవారం సమావేశమై శ్రీశైలంగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బస్తీలో తాగునీరు సరిగా రావడం లేదని, వీధిదీపాలు వెలగడం లేదని శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులకు ఆయన ఫోన్‌ద్వారా సమాచారం అందించి వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఇష్టారాజ్యంగా అనుమతులులేని పాఠశాలలు

దుండిగల్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏటా ప్రైవేట్ పాఠశాలలు గణనీయంగా పెరుగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యజమానులు కాసులకు కక్కుర్తి పడి నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తూ. . విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వారికి వరంగా మారుతోంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు అధికారులు మొక్కుబడిగా నాలుగు అనుమతులు లేని బడులను సీజ్ చేశారు. అయినా ప్రభుత్వ అనుమతులు లేని బడులు కొనసాగుతుండడం గమనార్హం.

కఠిన చర్యలు తీసుకుంటాం: హరిచందర్, ఎంఈవో

అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల మల్లంపేటలో అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేశాం.

పాఠశాలను సీజ్ చేస్తే చిన్నారి బతికేదేమో..

మల్లంపేటలోని ఓక్‌లీఫ్ పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేవు. సదరు పాఠశాలలో ఎల్‌కేజీ చదివే మన్విత(3) ఇటీవల వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మృతి చెందింది. దీంతో పాఠశాల పేరు ప్రచారంలోకి వచ్చింది. ఆ బడికి అనుమతులు లేవనే విషయాన్ని విద్యాశాఖ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సదరు పాఠశాలను సీజ్ చేసి ఉంటే చిన్నారి ప్రాణాలు దక్కేవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.


మల్లంపేటలో ఓక్ లీఫ్ పాఠశాలను సీజ్ చేసిన ఎంఈవో హరిచందర్

అనుమతులు ఇలా..

ప్రైవేట్ పాఠశాల అనుమతికి అక్టోబర్ లోనే దరఖాస్తు చేసుకోవాలి. విద్యాశాఖకు చలానా ద్వారా రూ.10 వేలు.. రూ.25 వేలు పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలి. అనంతరం సొసైటీ రిజిస్ట్రేషన్‌తోపాటు భవనానికి సంబంధించి రిజిస్టర్ లీజ్ డీడ్ 10 సంవత్సరాల వరకు తీసుకోవాలి. ట్రాఫిక్, అగ్నిమాపక, పురపాలిక శాఖల నుంచి ఎన్‌వోసీతోపాటు శానిటేషన్, సౌండ్ సర్టిఫికెట్ తీసుకోవాలి.

యువకుడి అదృశ్యం


రవినీత్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: తాను పనిచేస్తున్న కంపెనీకి సంబంధించిన మీటింగ్ నిమిత్తం మధ్యప్రదేశ్ వెళ్తున్నానని ఇంటినుంచి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అస్‌బెస్టాస్ కాలనీ నివాసి మల్లేష్ కుమారుడు ఎ.రవినీత్(23) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 14న సాయంత్రం కంపెనీకి సంబంధించిన సమావేశం ఉందని భోపాల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. వారం రోజులు కావస్తున్నా ఇంటికి రాకపోవడంతో ఆదివారం నుంచి అతని కుటుంబసభ్యులు ఫోన్ చేస్తుండగా స్విచాఫ్ చేసి ఉంది. అతని స్నేహితుల వద్ద ఆరా తీయగా.. అప్పులు ఎక్కువగా ఉన్నాయని ఇటీవల తమతో బాధపడుతుండేవాడని తెలిపారు. కంపెనీకి సంబంధించిన సమావేశానికి కూడా అతను వెళ్లలేదని తెలిసింది. దీంతో అతని సోదరుడు మంగళవారం ఫిర్యాదు చేశాడు.

దుకాణానికి వెళ్తున్నానని మరో వ్యక్తి..


ఆంజనేయులు

షాపూర్‌నగర్: దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. జగద్గిరిగుట్ట పోలీసులు కథనం ప్రకారం.. శ్రీనివాసనగర్‌కాలనీ నివాసి ఆంజనేయులు(31) మియాపూర్‌లో తుక్కు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల అప్పులు తీవ్రమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు స్క్రాప్ దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ స్విచాఫ్ చేసి ఉండటంతో అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో అతని భార్య అనిత మంగళవారం జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దారి ఇలా.. రాకపోకలు సాగేదెలా

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో శ్మశాన వాటిక నుంచి ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఏడాది క్రితం రోడ్డును తవ్వి భూగర్భ డ్రైనేజీ నిర్మించారు. ఏడాది కావస్తున్నా సీసీ రోడ్డు పూర్తి చేయలేదు. జలమండలి, జీహెచ్ఎంసీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రోడ్లను ధ్వంసం చేసి భూగర్భడ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయినా రోడ్ల నిర్మాణం ఊసే లేదు. కనీసం మరమ్మతులు కూడా చేయడంలేదు. స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. మార్గం పక్కన పెద్ద బండలు ఉండడంతో రాకపోకలకు ఆటంకంగా మారాయి.


రోడ్డుపై అడుగు ఎత్తులో మ్యాన్‌హోళ్లు

ఎత్తులో మ్యాన్‌హోళ్లు

రోడ్డుపై అడుగు ఎత్తులో నిర్మించిన మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లోని ఐదు రోడ్లలో మ్యాన్‌హోళ్లను ఎత్తులో నిర్మించారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

–కల్యాణ్, ఏఈ

సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. త్వరలో నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

మానవ హక్కుల పేరుతో వసూళ్లు

● ఇద్దరు మహిళల రిమాండ్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మానవ హక్కుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరి మహిళలపై పేట్‌బషీరాబాద్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పేట్‌బషీరాబాద్ సీఐ కె.విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన బొగ్గుల్ల సునీత(50), సికింద్రాబాద్ నియోజకవర్గం రావుకాలనీకి చెందిన నీలి విజయలక్ష్మి (58) సోషల్ వర్కర్లు(సామాజిక కార్యకర్తలు). వీరు సోమవారం సుచిత్ర కూడలి సమీపంలోని గిస్మత్ మండికి వెళ్లి తాము ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్ నుంచి వచ్చామని గుర్తింపు కార్డులు చూపించారు. మీరు నిర్వహిస్తున్న మండి వంట గది పరిసరాలు బాగున్నాయా? లేవా? అంటూ అడిగారు. వంట గదిలోకి వెళ్లి పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా లేవని, మీపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మీ హోటల్‌ను మూసివేయిస్తామని హెచ్చరించారు. అనంతరం నిర్ణీత మొత్తం ఇస్తే వదిలేస్తామని వారితో అన్నారు. వీరు మరికొన్ని హోటల్స్‌కు కూడా వెళ్లినట్లు సమాచారం. మండి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు. జీడిమెట్ల ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన కృష్ణసాయి (23) కొన్ని నెలల క్రితం ఉపాధి కోసం వచ్చి చింతల్ శ్రీనివాసనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహించేవాడు. ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం తాను ఉండే గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.